THE BOOK WAS DRENCHED

UNIVERSAL
LIBRARY
OU_204688
UNIVERSAL
LIBRARY

అగ్గిరాముఁడు

రామత్రయము

గ్రంథకర్త:
చింతా శంకరదీక్షితులు

ప్రకాశకులు:
కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు
శ్రీ సత్యనారాయణ బుక్ డిపో
రాజమండ్రి

1948

వెల 1—0—0

రాజమహేంద్రవరము :

శ్రీ కొండపల్లి ముద్రాక్షరశాలయందు

ముద్రింపబడియె.

ఇ జి. 14—1000-1946

అగ్గిరాముడు

"దాసూ! ఏమి ముంగిముసలమ్మవలె కూర్చుండినావు?"

పడకకుర్చీలో కూర్చుండి విశ్వనాథము నారాయణదాసు మనో విచారమును గనిపెట్టెను.

"ఏమిచేయుమనెదవు? మూడుప్రొద్దులును మనమేమిటో! ఈ విశాఖపట్టణపు సముద్రపుగాలియేమిటో! అందులో నీమధ్య నెక్కడకేగినను, నీయంతట నీవే పోవుచుంటివికదా? నాకీ యూరనుండినచో నేమియు తోచుటలేదు."

"ఎక్కడెక్కడనుండియో వచ్చి యీయూరిగాలికై నెలలకు నెలలిక్కడ నెల్లరును మకాము చేయుచుండగా నీకు కష్టముగానున్నదా? తినగా తినగా వెగటైనదట! నాకుమాత్రము మీయూరు విడచుట యనిన నెంతో విచారముగానుండును?"

"విశ్వనాథం! దాదాపు ముప్పదియేండ్లు దాటుచున్నవికదా? ఇంతవఱకు దేశ మేమిచూచినట్లు? పుట్టుమని విశాఖపట్నముజిల్లానైనను నాలుగుమూలల జూడలేదుకదా? నీకేమిలే తిరుగుచుందువు. వచ్చుచుందువు పోవుచుందువు?"

"అట్లయిన నేమనెదవో చెప్పుము. ఈదినముననే బయలుదేరి పోవుదము; ఎక్కడికో నిర్ణయింపుము. రాత్రికి రైలెక్కుదము. ఇటు బరంపురంవైపు పోవలయునని యున్నదా? లేక గోదావరీ కృష్ణలవైపు పోదలంచితివా?"

విశ్వనాథం! ఖరారేనా? ఇదిగో నేను తయారే! రాత్రిదాకా కూడ నెందుకు? గోదావరీ కృష్ణాలవైపు పోవుదము. ఒక నెలైనను తిరుగకపోయిన నేను మనిషినికాను. ఖరారేనా?"

"సరే! ప్రయాణమునకు తయారుచేయుము. రాత్రి బయలు దేరుము. గోదావరిజిల్లాలో నెవరో యగ్గిరాముడున్నాడట! వానికి పోలీసువారు చేతులెత్తి నమస్కరింతురట! వానిదర్శనముగూడ జేసి పోవుదము."

"ఇదిగో మరల వానిదర్శనము పీనిదర్శనమని యిచ్చట నొక పదిదినములు నచ్చట నొక పదిదినములు నాగవలయుననిన నీప్రయాణ మెందులకు?"

"దానూ! వాడు మనకగుపడియేడిచినాడా యేమి? అప్పటి మాట నాలోచింపవచ్చును. సుంకేతగవులా లెందులకు? నీవుపోయి సామాను తయారుచేయుము!

దాసులేచి యింటిలోనికేగెను. అప్పుడే టీ త్రాగి కాలకృత్యము లను దీర్చికొని యిర్వురు నీరీతి సంభాషించికొనిరి. ఉదయ మెనిమిది గంటలాయెను దాసింటిలోని కేగినతర్వాత నేదియో గ్రంథము నొక దానిని గైకొని విశ్వనాథము చదువుకొననారంభించెను. ఇంతలో వీధి యరుగుమీద నడుగులచప్పుడి వినబడెను. విశ్వనాథము గ్రంథమును జదువుటమాని వీధిగుమ్మమువైపు జూచెను. విశాఖపట్టణమునకు క్రొత్తగా నారునెలలక్రిందట బదిలీకాబడిన పోలీసు సబిన్స్పెక్టరు కొండల రావాతని కంటబడెను. ఆతడును తన బైసికిలును, వీధియరుగుపై పెట్టి లోనికరుదెంచి విశ్వనాథమునకు నమస్కారముజేసి యొకకుర్చిలో కూర్చుండెను.

"ఏమండోయి! కొండలరావుగారు! మహాత్ములూరకేరారు. మరల నేమైన నాకొంపమీదికి తెచ్చిరాయేమి? అనదుమ పచ్చను గనుగొనునప్పటికి నాప్రాణాలదరినవి."

"విశ్వనాథముగారన్న సామాన్యులా? ఈసారి నావ్యవహార మేమియు లేదు కొంచెము వేఱువిషయము మాటలాడవలయునని వచ్చినాను."

"మీపనియైనవెంటనే తిరిగి మాముఖమైన జూడరుకదా? ఏమండీ! అనిన పనితొందర యనెదరు ఉద్యోగిముతీరనికొంత, ఆరు నెలలమధ్య తమ దర్శనము తిరిగి లేదు ఈనాడు నెత్తిపై కేదియో తిరిగి తెచ్చుటకే యీదర్శనము."

కొండలరావు కొంచెము చిన్నపుచ్చుకొనెను. విశ్వనాథమది గ్రహించి "కొండలరావుగారు! కోపమువలదు ఇవన్నియు వేళా కోళపుమాటలే. మఱిమీరరుదెంచిన పని నెఱిగింపుడు, ఈరాత్రి బయలుదేరి, గోదావరి కృష్ణాలవైపు పోవలయునని నేనును దానును, నిశ్చయించుకొనినాము అవసరమైనచో మీపని చూచియే పోయెదను"—అనెను.

"నాపనిపై గాదని చెప్పితినిగదా? మీరు పోదలంచిన దిక్కుననే ఆపని. కాకినాడలో నబిన్సుపెక్టరు సుబ్బారావుగారి నెఱుగుదురా?"

"అయ్యో! మూడేండ్లు దాదాపుకలసి చదివికొంటిమి. ఇప్పు డాయన యుండునది కాకినాడలోనా?"

"ఔను. ఆయనకేదో గట్టిచిక్కు వచ్చినది. ఏదోవ్యవహార మున దొందరకలిగినది నాపేర వ్రాయగా నేను మీరిచ్చుటనేయున్నా రని వ్రాసితిని. ఇదిగో తిరిగి యుత్తరము వ్రాసినారు. మీకో

మాట్లాడుమని వ్రాసినారు" అని కొండలరావు తన జేబులోనుండి యొక కవరు తీసి విశ్వనాథమున కొసగెను. విశ్వనాథ మూయుత్తర మిట్లు చదువనారంభించెను.

డిసెంబరు 8—1900
కాశినాథ

ప్రియమిత్రుని కొండలరావును దీవించి, సుబ్బారావు వ్రాయునది. నీవు వ్రాసిన యుత్తరమందున్నది నా చిన్ననాటి స్నేహితుడు విశ్వనాథ మచ్చటనే యున్నాడని విని సంతోషించితిని. ఆతడి విషయములో నాకెక్కువ సహాయము చేయగలుగునని నాగట్టినమ్మకము, వెనుక నీ కాతడు చేసిన సహాయమే నాయభిప్రాయమును బలపరచుచున్నది. కనుక నీయుత్తర మందినతక్షణమే, వానియొద్దకు బోయి వాని సహాయమును నేను యాచించినానని, నాబదులుగ వేడికొని యీక్రింది సంగతులనెల్ల వానికి తెలుగజెప్పి, వాని సహాయమును సమకూర్ప వలసినది.

ఈచుట్టుప్రక్కల నీమధ్యరోడ్డుపై దొంగతనము లెక్కువగా నున్నవి. ఎవరో ముగ్గురు దొంగలు పోకసడి కొందరు దొంగలను గుమిగా జేర్చి, యీ చుట్టుప్రక్కల మహాకల్లోలము జేయుచున్నారు వారలలో ముఖ్యుడు అగ్గిరాముడు, మిగిలిన యిర్వురును దొంగరాముడు, బలేరాముడునని పిల్వబడుదురు. ఈరామత్రయ మీ జిల్లానెల్లను గగ్గోలుపెట్టుచున్నది. ఎన్నిసారులు వారిని పట్టుకొనుటకు పోలీసుప్రయత్నించినను, వారు దొరకలేదు. పైపెచ్చు వారలచే పోలీసు చాలాసారులు మోసము నొందినారు ఈ చుట్టుప్రక్కలవారికి భయముచే ప్రయాణముచేయుటకూడ మానినారు. ఈయగ్గిరాముడు చాలబలమును, బలగమును గలవాడు, వానిని పట్టుకొనుట చాల కష్టము, వానిని నెలరోజులలో పట్టుకొనలేకపోయిన యెడల నన్ను,

వస్వాదూ చేసెదనని సూచించుచుండెను బెదరించుచున్నాడు. నేనిం కొక పదిహేనదినము లెక్కవగనుండు కోరినాను, అతడియ్యకొనెనే కాని, నేటికిరువదియైదుదినములైనను, నేను వానిని పట్టుకొనలేక పోయినాను. ప్రాణము భీతిజెందుచున్నది. నిష్కారణముగా నుద్యోగము నకు విరహముకావలసినదేమో తెలియదు. ఇంక నిరువదిదినము లున్నను, వారలనుపట్టుకొనగలనని, నాకేవిధమైన నమ్మకమును లేదు. విశ్వనాథముగారు నన్ను రక్షించి నాతిండి నిలిపెదరేమో యేడుకొను చున్నాను. అతిజరుగురు ఎల్లినను, వారిసహాయమును యాచించుచున్న నన్ను బాగుచేయుభారమువారిది అతి జరుగురు. తత్క్షణమే వారి సమాధానమును వ్రాయవలయును.

ఇట్లు నీప్రియమిత్రుడు,

ఆర్. సుబ్బారావు.

విశ్వనాథమాయుత్తరమును తిరిగి కవరులోనుంచి, కొండల రావున కొసంగెను.

"అయ్యా! నేను సిద్ధముగానే యున్నాను. ఎల్లినను నేటి రాత్రి ప్రయాణమనుకొనుచుంటిదే! కాకినాడలో నీవ్యవహారమును జూచి, తిరిగి బయలుదేరెదను; మీరువ్రాయుడు. నేనునువ్రాసెదను; పాప మాతడు చాలచిక్కులలోనున్నాడు. నాసాధ్యమైనంతి సహాయము జేసెదను"

వీధిలో "విశ్వనాథము గారు!" అని మొకవోకేకవైచిరి. విశ్వనాథ మాయనను బోనికరమ్మనెను. అతడు టెలిగ్రాము బంట్రోతు. అతడు విశ్వనాథముచేతి కొకటెలిగ్రాము నీయగా నాతడు దానిని విప్పి యిట్లుచదివెను.

"రాత్రి దొంగతనము అంతా అల్లరిగానున్నది. తప్పక రావలెను; మీమీద నాయాశ పెట్టుకొనియున్నాను—సుబ్బారావు"

అప్పటికి పదిగంటలాయెను. విశ్వనాథము లేచెను.

"కొండలరావుగారు! నేను రాత్రికవచ్చుచుంటినని మరల తంతినంపుడు; నేను భోజనమునకు బోయెదను"

కొండలరావు తలవూగ్గకొని చనెను. విశ్వనాథమువలన నీయంశములనెల్లవిని, తాను కాకినాడనుండువరకు సహాయముసేయ నొప్పుకొనెను.

2

"సుబ్బారావుగారు! బహుకాలదర్శనము. ఇప్పటికి చాలా కాలమైనది. మనముకలసి చదివికొని; కొలదికాలముక్రిందట నొకసారి రైలులో గనబడుటయేకాని, మరలగనబడలేదు. ఈయూరి నున్నారని మొన్న కొండలరావుగారు తెలుపగా కాబోలునని కొంటిని!"

"విశ్వనాథముగారు! నాసంగతిమీకు తెలియకపోయినను మీసంగతిమాత్రమప్పుడప్పుడు పత్రికలలో చూచుచుండెడివాడను; మీరు చేయుపరిశోధనావ్యాపార మప్పుడప్పుడు పత్రికలలో చదివి నాచిన్ననాటిసహపాఠకుడనుటకై యానందించుచుండినవాడను."

"ఏమిటో మీదయ, ఉద్యోగము గిద్యోగము లేదుగదా. పిత్రార్జిత మింటగూర్చుండి భుజించుచున్నాను. ఊరకేయుండ లేక, యీవ్యాపారమొకటి తగిలించుకొనినాను"

"అందువలననే మాబోట్లకెప్పుడైనను సహాయము నొసర్చుట కవకాశమున్నది. కొండలరావుగారు వ్రాసిన యుత్తరమును

చూచితిరికదా, నాహృదయము చాల కలతనొంది యున్నది. విశ్వ నాథముగారూ !"

"మీ యనుగ్రహముండిన నీకార్యమును ద్వారకలోనే ముగిం పగలనని నానమ్మకము. సంగతి దొంగలు నమ్మకముగనే మా ట్లాడుకొనెదరు. దాసూ! సామాను తీసికొనిరమ్ము. సుబ్బా! వీధిగది ఖాళీచేయించితిరా !"

"మీతంతి చేరినది. ఖాళీచేయించితిని."

దాసు సామాను దింపించినతరువాత, సుబ్బారావు శెలవుదీసి కొని, యింటికిపోయెను. విశ్వనాథుడును, దాసును క్రమ ముగా నిద్రపోయిరి.

మరునాటి యుదయమునను, విశ్వనాథుడు నిద్రమేల్కొని, దాసును నిద్రలేపి కాలకృత్యములను తీర్చుకొని, వీధిగదిలో కూర్చుం డెను. పదిగంటలకాలములో సుబ్బారావుగారు తిరిగి వచ్చిరి. కాఫీ, ఫల హారములను తీసికొని, యిద్దరును వీధిగదిలో కూర్చుండిరి. ఫలహారా నంతరము వారికి ఈ క్రింది సంభాషణ జరిగెను.

"మిత్రుడా! ఈ యగ్నిరాముని సమాచారమేమి ?"

"వాని నెలవు పట్టణములలోను గ్రామములలో నుండును. ఒక గ్రామమున వానికి స్థిరములేదు. సాధారణముగ నతడు రాజమండ్రి యందుండును. అనుదినము తిరిగి కనపడకుండును."

"వాని సహాయులెవ్వరో తెలియునా ?"

"వాడు పాపాలవాడు, ఎవ్వరికి తెలియుటలేదు; పోలీసువారును వాని పోలినవాడు "నభూతో నభవిష్యతి" యని కొనియాడిరి. యిర్వురును రెండుభుజములవలె నున్నారు."

"వాని సంగతి వింటను నొంటికంటి సింగన్న, చాల చిత్ర మైన మనుజునివలె నున్నాడు.

"దొంగతనములో నారితేరినాడు. లక్షజనములో నున్నను నిర్భయమే. కాని యాడువారిజోలికి మాత్రము బోవడు. చిన్నవారి నేమియు జేయడు. మర్యాదగా నున్న దిచ్చినచో, వారలను గొంత దూరము కూడ సాగనంపునట, మరి పెంకితనము చేసినచో, హాతమార్చునట, వానిని పోలీసువారెన్ని పర్యాయములు పట్టుకొనెదమన్నను; వాడు వీలుచేసికొని కొరిసి నాలుగు తన్ని పారిపోవుటయో లేక మరల కనబడకుండ పారిపోవుటయో జరుగుచున్నది. వాని యొద్ద నల్లప్పాపులు పిస్తోలును కత్తియు నుండును. అగ్గిరాముడనిన జల్లాజిల్లా పేరు మ్రోగినది. కాని యెవ్వరును దగ్గరకుబోయి వానిని పట్టుకొనలేకున్నారు."

"మనుష్యుడే మాత్రపువాడగును, పేరు మహాసమ్మర్దనముగా నున్నదే?"

"చూచుటకు చాలపొట్టివాడు, పదునుగులే పోతగుండునేమో! కాని చాలబలము గలవాడని వినాను. ఒకపట్ట పదిహేనుగురు కూడ నున్నను వానిని పట్టుకొనలేరట!"

"వానితో నుండువా రెవ్వరు?"

"దొంగరాముడు బలేరాముడు అనువారిద్దరు వాని సహాయులు, ఒక పెద్దగుంపునకు గుంపుండెడిది, కాని నేటికాగుంపు చెల్లాచెదరై పోయినది. ఈ ముగ్గురును మాత్రము విడిపోలేదు. ఆ యిద్దరు నిరుపమానులు; అందులో దొంగరాముడు సుమారాఱడుగుల పైపడుచును; వానికి కుంటిలును పడుపలు సద్దుకానేరవు; విశేషము దేహబలము కలవాడుకాడు కాని, చాలజిత్తులమారియని యందురు. చాలచిన్నవాని రూపమనియందురు. బలేరాముడు సుమారైదడుగులు యేనుబది గుళ్ళముల పొడగుండును. దేహము కారు

నలుపు, తిరిగినమీసములు, పెచ్చుపెరిగినజుట్టు, కోలమొగము తిరిగిన గండలు, వా డగ్గిరామునితో తులయగు చేయుచుందురు.”

“వీరిలో నెవ్వానినైన మీరెన్నడైన చూచినారా?”

“సేనానాయకుడు లొకటిరెండు పర్యాయములు కనబడిరి కాని, చేతజిక్కకుండ దాటిపోయినారు.”

“అగ్గిరాము డెప్పుడైన మీకు దర్శనమిచ్చినాడా? వా డెట్లుండును? పరిత్యాగిమూర్తిగనా యేమి?”

“వానిని నేనెప్పుడును జూడలేదు. ఇరువదిదినములనుండి వెదుకుచుండగా, నాకు వానిదర్శనమైన లభించినదికాదు. ఒకరోజున మండపేట సమీపమున నాతని చూచెడివాడనే కాని, యేకారణముననో విడిచిపోయినాడు. ఎవరో కనిస్టేబులు లొకటిరెండు పర్యాయములు వానిని చూచినారట; వారాతనిట్లు వర్ణించియున్నారు. చామనచాయగల దేహము, గుండ్రని మొగము, వాల్చిన మీసములు, నుంగరములజుట్టు, కోలగను పెద్దనేత్రములును గలవాడట. ఆతని హస్తమునందు సర్వదా చేతికి సరిపడిన చేకాశీదకర్రయుండునట. అదియే వాని వజ్రాయుధము! మొలనెప్పుడును పిస్తోలును కత్తియు నుండునట! సాధువులన్న పరమ భక్తియట విన్నారా?”

“ఆహా! ఆమాత్రమున్నదికదా! ఫరవాలేదు. సుబ్బారావుగారూ! వాడు తఱచుగా నేరోడ్డపై నుండును? వాని దొంగతనములు సాధారణముగా నేరోడ్డపై జరుగుచుండును?”

“వానికొకరోడ్డనిలేదు. రోడ్లన్నియు వాని యధీనములోనివే! ఐనను వానికి ద్వారపూడి, మండపేట, రామచంద్రపురము రోడ్లపై నెక్కువ యభిమానమని యందురు”

“ఈమధ్య రేవులో దొంగతన జరిగినదని తెలిసినంతనే మొచ్చటకు సన్యాసులు పోయినారా?”

“నన్ను కొత్త మనిషినిగా — వీలిసువాడినే! గోదావరి వద్ద పురమునుండి ఎనమండుగురు పోలీసుజవానులును, ఇద్దరు హెడ్డులును, రెండువేల దసుతీసికొని ద్వారకాపురికి వచ్చుచుండగా మనుమ పేట దాటినతర్వాత నలుగురు [illegible] కొండలును [illegible] వారిపై బడి దస్తు పెట్టెలను [illegible] పోయిరి; [illegible] వారుగు [illegible] గదు; [illegible] పారిపోయిరి. [illegible] అందులో [illegible] మిగిలిన వృద్ధుడు [illegible] పారిపోయి నారు. ఈ [illegible] భంచి తిరిగి [illegible] న్యాయము [illegible] ఆచార్యు [illegible] ఇరువదిరెండవ [illegible] మనుష్యు లెవరును కనబడలేదు.”

“[illegible] లేదు [illegible] వానిని [illegible] నేను వానిని పట్టుకొనుట శక్యము కాకుండ నున్నది. [illegible] కేసు [illegible], ఏమియు చేయలేని వానికే గురుగురుజా సుబ్బారావుగారు! నా శక్తి యున్నంతవరకును, నేను ప్రయత్నించెదను. [illegible] మీ యదృష్టము నేడే బయలుదేరి ద్వారకాపురికి పోగి వచ్చెదను. మా దొంగిచ్చుటనే యుండును” అని దాసు [illegible] “ఏమాయురానా! నీవు వెంటనుండిన వానిని పట్టుకొనుట నాకు శక్యము కాదు. నేను సుబ్బారావుగారింట నుండెదను. అవసరమైనచో కబురు పంపగలను” అని పలికెను

దానికి తల పంకించెను. విశ్వనాథము సుబ్బారావును ఏకాంత ముగా గుసిగుసపోయి రహస్యముగా కొంతకాలము మాట్లాడెను. సుబ్బారావు మొదట సందేహించెను. కాని, విశ్వనాథమునకు కోపము రాగలదని కాబోలు తనోపాధ్యాయుని నేర్పుగ చేసెదనని చెప్పి యొప్పించెను. విశ్వనాథము తిరిగి గుడిలోనికేగి కొంతకాలమునకు భోజనము నకు లేచెను.

భోజనమైన తర్వాత విశ్వనాథము కాలిగంగకను బయలుదేరి గంగమ్మ గుడిలోనికి వచ్చి వెళ్ళిపోయినట్లుగా బయలుదేరి పోయెను. కాకినాడకు అగ్రహారమునకు సుమారు కోసుమైలుండును. వడిగా నడువగలిగినచో నొక సుమారు రెండుగంటలలో కాకినాడ జేరి బసివిరెడ్డిగారి సత్రము కడ వీధి అరుగుమీద కూర్చుండెను.

3

అగ్రహారమునకు సుమారు నూరు గజములదూరములో నీ బసివి రెడ్డిగారి సత్రమున్నది. ఆ కాలమున బ్రాహ్మణులకుగూడ నీ సత్రమున విరివిగా అన్నప్రదానము జరుగుచుండెడిది. విశ్వనాథము రాత్రివచ్చుటచే యింకను పోయి యుండక యొక్క యరుగుమీద కూర్చుండెను. కొంత కాలమైనతర్వాత నెవ్వరో వారును వీరును వచ్చి ఆ యరుగులమీద కూర్చుండి లోకాభిరామాయణము ముచ్చటించుకొనుట కారంభించిరి. కథాప్రసంగమున అగ్రహారపు సంగతి చేబడినది. విశ్వనాథ మాత్రుతతో వినుచుండెను.

“ఏమిటి సుబ్రహ్మణ్యం వాని దర్జా! దర్శనమిచ్చినాడంటే కొంప ముంచిపోయినాడన్నమాట! మర్యాదగా కాలక్షేపముచేసి తినమా ఆపై నిక ఫరవాలేదు, విన్నావుగా మొన్న సీతారామయ్య సంగతి!”

"వినలేదు. నిన్న చెప్పెదనని చెప్పితివి కావు. పోనిమ్మా వేళనైన చెప్పెదవా ? నమ్మెదవో లేదా కాని, ఆమధ్య కిర్లంపూడి ప్రయాణము నేనీ భయముచేతనే మానినాను. ప్రకాశం ! సీతారామయ్యగారి సంగతేమిటి ? ఎవరాయన ? తీరుబడిగా, నీవేళనైనను చెప్పి పొమ్ము"

"కాకినాడప్లీడరు సీతారామయ్యగారి నెఱుగవా ? చెప్పెద వినుము. ఆయన కడసారియాగా కేసో కేసులో పెద్దాపురం కోర్టుకు పోయినారట. సాయంకాలము కాకినాడ బండికేమో ఆయన తిరిగి వచ్చునని అగ్గిరామునకు తెలిసినది. వానికి తెలియని సంగతి లేదు. ఎక్కడ నెవ్వరేవేళకు ప్రయాణమో ఏమాత్రములాభించునో వివరముగా వానికి ముందే తెలియును. ఎవరో యిద్దఱతో వాడు సీతారామయ్యగారు వచ్చుమార్గమున నిల్చినాడట చెప్పుట మఱచితిని. ఈనడుమ దొంగరాముడును, బలేరాముడును, వానితో కలియక మండపేటముకాము పెట్టినారట. వారితో పనియుండిన అగ్గిరాము డచ్చటికేగుచుండునట. ఇట్లుండగా సాయంకాలమునకు సీతారామయ్యగారు సైకిలుమీద విసురుగా వచ్చుచుండగా రోడ్డుప్రక్కనున్న యగ్గిరాముడు దారికడ్డయి టక్కున సైకిలాపెనట. ఆపైన ఏమయ్యా ! డబ్బేది ? ఫీజు మాకిచ్చిపొండి ! అన్నాడట అగ్గిరాముడు.

అబ్బే ! నేను డబ్బేమియు తేలేదు. అని ప్లీడరనెను

ఇంతట వానితోనున్న యిర్వురును ప్లీడరు జేబులు వెదుకుచుండగా అగ్గిరాముడు కల్లునాగమ్మలారా ! ఊరకుండుడు. ఆయనే మర్యాదగా నిచ్చివేయును అని మందలించినాడట ! వీని మర్యాద గాల ! ఏమయ్యా ! మర్యాదగా యిచ్చినమంచిది. ఎక్కడనుండియో పనిమానుకొని సులభముగా దొరకునని నీయొద్దకు వచ్చినాము.

నిష్కారణముగా మనుష్యులను టోపీవేసినావా యేమిటి ? గుసన్నెఱుదువా ? " అన్నాడట అగ్గిరాముడు.

ఆప్పెడరొక అగ్గిరాముడు. ఆడబ్బును పద్దాపురమునుండి తన పేరనే కాకినాడ మనిఆర్డరు పంపితినని చెప్పగా అగ్గిరామున కలవి కానికోపము జనించెను. " ఏడ్చినట్లేయున్నది. ఇంతదూరము నిష్కారణముగా వచ్చితిమి. ఆబట్టలు విప్పివేయుము " ప్లీడరాలోచించుచుండెను.

ఇతలో వారిలో నెవడో బైసికిలుగైకొని దానినెక్కుటకె ప్రయత్నించుచుండెను. అగ్గిరాముడు వానినాపి " ఓరి ! తెలివి తక్కువవాడా ! పై కిలుకు పంబరుండును. అది మన కెందులకు ? ఇచ్చివేయుము అని వాని యొద్దనుండి దానిని దీసికొని ప్లీడరుకిచ్చినాడట. ప్లీడరు సంతోషించి అగ్గిరాముడు ! చాలసంతోషమైనది. మీరంతా నాతోరండి. కాకినాడలో బహుమాన మిచ్చెదను. " అనెను.

" వచ్చెదము కాని, నన్నెఱుగుదురా ? మోసముమాత్రము వలదు. " అని బెదరించి వెంటబడినారట. కాకినాడలో వాండ్రకు పిండివంటలు, ఫలహారములు, క్రొత్తచాపులు, తలకొక యెదురూప్యములు బహుమానము ! ఇక మజా విను ! ఇంకెప్పుడు నాప్లీడరునకు భయములేదు. చీకటిలో ప్రయాణమైనచో తోడుగా సాగనంపును. అగ్గిరాముని జన్మమునకు మర్యాదనూండను !

" వానిసంగతి తెలిసియు నేను ప్రయాణము కహానివేసితిని. ఈరాత్రి కెచ్చటనుందునో తెలిసిన బాగుండును. "

" ఎట్లు తెలియును ? వానిసంగతికంటె మనసంగతి వానికే ముందుగా తెలియును. సుబ్రహ్మణ్యముగారి రాత్రి బండ్లు కట్టించునప్పటి కప్పుడే ఆయునపోవుమార్గమునకు ముప్పది నలుబది మైళ్ళ

దూరమునుండి అగ్గిరాముడు విజయముచేయును. ఆపైన మజా చూచి కొనుము. ఒకతడాఖా తీయకుండ విడిచిపోడు. నీవు లక్షమందిని వెంటబెట్టుకొని పోయినను నీప్రయాణ మాఖరగునప్పటికి నీడబ్బును పెట్టెలును నీయొద్దనుండవు. రాత్రి ప్రయాణములుమాని పగలు బయలు దేరుడమన్నను యింతే!” అని యిర్వురు నేమేమియో లోకాభి రామాయణమును మాట్లాడుకొనుచు నాయరుగుపై కొంతకాలము గూరుచుండి, విడలిపోయిరి.

ఆరుగంటలాయెను. విశ్వనాథము లోనికేగి రాత్రిభోజనమున కుండెదనని గుమాస్తాతో చెప్పి తిరిగి వీధియరుగుమీద గూర్చుండెను. చీకటివ్యాపించెను. భోజనమునకు లేచువేళవఱకును విశ్వనాథము వీధి యరుగుపై గూర్చుండెను. కాని, విశేషము లేమియు నాతనికి గోచ రింపలేదు. రాత్రి గుమాస్తాగారితో ప్రసంగించి తిరిగి కాకినాడ పోవల యునని నిశ్చయించుకొనెను. ఆరాత్రి భోజనమున కితరబ్రాహ్మణు లెవ్వరును లేకుండుటచే గుమస్తాతో స్వేచ్ఛగా ప్రసంగించుట కతనికవ కాశము కలిగెను. వారికి క్రిందిసంభాషణ జరిగెను.

“ఏమండీ కృష్ణయ్యగారు! భోజనముచేసి పెద్దాపురము పోవల యును. కొంచెము దస్తున్నది. ఎంతదూర ముండును? దారి మంచి దేనా?”

“అయ్యా! తమకీప్రాంతము క్రొత్తగాబోలును. నామాట వినుడు. రాత్రులందుమాత్ర మీప్రాంతముల బ్రయాణముచేయుటకన్న బుద్ధితక్కువపనియుండదు. అందును నొంటిగా ప్రయాణ మసలే వలదు.”

అట్లనెదరు? దొంగలభయము విశేషముగా నుండునా యేమండి? అట్లయిన బండీ మాట్లాడుకొనియెదను.”

"వెఱ్ఱినమ్మకమువలదు. నిష్కారణముగా మోసపోయెదరు. ఈప్రాంతముల నగ్గిరాముడను దొంగలగురు వొకడున్నాడు. వానికి బండ్లున్నను లేకున్నను నొక్కటియే.' పదిబండ్లకొక్కడే ఆపి డబ్బు నూడ్చిపెట్టిపంపించును చాలమంది మోసపోయినారు. తొందరపని యైనను రేపేగవచ్చును."

"ఒకటి రెండు పర్యాయములు వీనిపేరు వింటిని. వాడంతవా డుటండీ! ఈనడుమనేమైన జరిగెనాయేమిటి?"

"ప్రతిరోజు నేదియోయొక రోడ్డున జరుగుచునే యుండును. ఎచ్చట నేవేళకుండునో చెప్పలేము ఈనడుమ నారుబండ్లకడ్డముగవచ్చి పండ్రెండుగురు మనుష్యులను గోచీగుడ్డలతో సాగనంపినాడు వాడు తలచినచో వెంట నెందరో యుందురు."

"అంత బలగమున్నదా? మొన్న జరిగినసంగతి కొంచెము వివరముగా జెప్పెదరా. వినుటకు కుతూహలముగా నున్నది.

"పోలీసుజవానులు వానికి వంగివంగి సలాములు చేయుదురట యన్నాళ్ళనుండియో వానిని బట్టుకొనుటకు పోలీసు విశ్వప్రయత్నము చేయుచున్నారు. కాని, వానిదర్శనమైన గాలేదు. ఇప్పటి కెనిమిది దినములక్రిందట రాత్రియందొక కోమటి పెండ్లికిబోయి సంసారము తో తిరిగి వచ్చుచుండెను. చామర్లకోట రైలుస్టేషనున కొక మైలీవల హఠాత్తుగా నేడుగురు మనుష్యులా బండ్లమీద బడిరట! బండ్లవాం డ్రందరు దిగి వానికి దండములుపెట్టుచు వణకుచుండిరట! అంతట నగ్గి రాముడా సావుకారును బిల్చి సామానులు విడిచిపొండి" అని భయంకరముగా జెప్పినప్పటి కతడు పెట్టెయు బేడకునిచ్చివైచెనట! బండిలోనున్న దుడ్డు దనుకు దీసికొని కట్టుబట్టలతో సాగనంపినాడట! వాండ్రను చామర్లకోట సమీపమువఱకును సాగనంపి బండ్లకు తానే అడ్డునిచ్చి పంపెనట! చూచితిరా వీనిసరసము?"

విశ్వనాథ మాశ్చర్యమభినయించెను

భోజనమైనతర్వాత విశ్వనాథము గుమాస్తాయొద్దకు బోయి "అయ్యా! కాకినాడలో బంధుగులయింటికిబోయి రేపుదయముననే బయలుదేరి పెద్దాపురమేగెదను." అని శలవుదీసికొని రాత్రి పండ్రెండు గంటలన్నర కాతడు కాకినాడజేరెను. తాను వినినసంగతులన్నియు దానున కారాత్రియే తెలిపి నిద్రబోయెను.

4

విశ్వనాథ ముదయముననే నిద్రమేల్కొనుసరి కెవ్వరో పోలీసు జవాను లిర్వురు సుబ్బారావుగారితో మాట్లాడుచుండిరి. వారలసంభాషణవలన గడచినరాత్రియం దెచ్చటనో దొంగతనము జరిగియుండె నని విశ్వనాథము గ్రహించెను.

"రాత్రి పండ్రెండుగంటలు కూడ కాలేదండి! కేకలూరికి వినబడునప్పటి కూరిలోనుండి పర్వెత్తుకొనివచ్చినాము మెట్టపాలెము వంతెన కొకమైలివల నదేగోల. అదేగోల! దమ్మిడీకూడ మిగల్చ లేదట!"

"సంగతి నంతయు రిపోర్టులో వ్రాసితిరిగదా ప్రయాణీకుల యొద్ద వాఙ్మూలము పుచ్చుకొంటిరా? అగ్గిరాముడున్నాడని చెప్పిరి కాదా?"

"ఔనండి. మొత్తము పదిమంది ఉన్నారట. అపాయము మాత్ర మెవ్వరికి జరుగలేదట. యజమాని శాస్త్రిగారు కేకలు వేయునప్పటి కగ్గిరాము డాయనగొంతుక నొక్కి దుడ్డుచూపినాడట"

ఇంకముందైనను కొంచెము జాగ్రతగానుండుట మంచిది నిష్కారణముగా చాలమంది మోసమునొందుచున్నారు, తోడుకావలసినచో ఈరాత్రినుండి స్పెషల్ డ్యూటీగా యింకొకయిద్దఱు కనిస్టే

బులను దీసికొనిపోండు. వాండ్రెచ్చటినుండి ప్రయాణము ? ఎందులకు ప్రయాణమై పోవుచున్నారు ? ఏమాత్రము పోయినది ?"

"వారు తాళ్ళరేవు పెండ్లికేమో పోవుచుండిరి. రొఖముమాత్ర మేమియు బోలేదు కాని; తెచ్చిన నగలును బట్టలును పోయినవట."

జవానులిద్దఱును సలాముజేసిపోయిరి విశ్వనాథము నిద్రలేచెనని గ్రహించి, సుబ్బారావు చిరునవ్వుతో వాని గదిలో ప్రవేశించెను.

"ఏమండోయి ! తిరిగి యెప్పుడు వచ్చితిరి ? జవానులు చెప్పినది వింటిరా నిన్న రాత్రి తిరిగి కోరంగిరోడ్డున నెవరో పెండ్లికిపోవుచుండగా, అగ్గిరాముడు మార్గమునందే పెండ్లిచేసి పంపినాడట."

"ఏదో నిద్రమత్తున విన్నాను. సరిగా వినలేదు. ఇప్పుడే నిద్ర లేచినది. వెనుకకు రావలసి తిరిగిపోవచ్చునని వచ్చితిని."

"ఐతే వినండి. ఇదిగో రిపోర్టునుండి చదివెదను" అని సుబ్బారావు తన చేతులోని కాగితమును విప్పి సందర్భానుసారముగా నిట్లు చదివెను

"నిన్న రాత్రి పండ్రెండు గంటలకు కోరంగిలో గస్తీ తిరుగుచుండగా కాకినాడరోడ్డున గొల్లుమని యేడ్పులు వినబడినవి. పరుగు పరుగున మేమిద్దఱము నారోడ్డున బోతిమి. మెట్టపాలెమువంతెనదాటి యొకమైలు రమారమిపోవునప్పటి కచ్చట ముగ్గురు బండివాండ్రును, బండ్లలోని జనమును గోలచేయుచుండిరి. సంగతికనుగొనగా నీక్రింది రీతిని చెప్పిరి — అమాంతముగా పదిమంది బండ్లపైకురికి యెద్దులను విప్పిరి. అంతట వారిలో కొందఱు బండ్లలోని జనమును క్రిందకీడ్చిరి. యజమాని శాస్త్రిగారు కేకవేయునప్పటి కగ్గిరాముడు వానిగొంతుక నొక్కి కత్తిచూపింపగా నాయన యూరకొనెను. దొంగలు పెట్టె బేడ పూర్తిగా తీసికొని పారిపోయినారు మేమేగునప్పటికి వారింకను బండ్లు కట్టుకొనలేదు. తాళ్ళరేవు పెండ్లికి బోవుచున్నారట—"

"వింటిరా విశ్వనాథముగారు! అనుకొనని దారినిగూడ బయలుదేరినాడు. వానిసంగతి త్వరగలో జాగ్రతపెట్టకపోయినచో, కొంత మీరిగికి గాగలను గీపైమగల నూవరింటెండెం టేమి నవాగీ చేయునో"

"అంతవఱకు వచ్చినచో కాదూ, వాడేమైన చేయునని భయము? సాధ్యమైనంత త్వరలోనే వానిని బట్టుకొనుటకై ప్రయత్నములు చేసెదను మీరు పూర్తిగా నిశ్చింతతో నుండుడు"

"ఏమీదయ వారిప్పుడు మీకు దొరికెదరన్న నమ్మకము నాకు లేదు. ఆసంగతి? నా కెక్కడ గోష్ఠని లేదు. ఎక్కడ నుందురని మనము వెంటాడుట!"

"అట్లుకాదు సుబ్బారావుగారు! క్రొత్తసంగతి నా కొకటి తెలిసినది. వినండి చెప్పెదను. అగ్గిరాముడు వేరుగా తిరుగుచున్నాడట! మిగిలిన ఇద్దఱును అనగా దొంగరాముడు, బలేరాముడును మండపేట సమీపమున మకాము పట్టిరిట! ముగ్గురును గలిసి తిరిగినచో పట్టుబడెదమని జాగ్రత్తలు తీసికొనుచుండిరి. ఇది మనకు చాల సుయోగము. ఆయిద్దఱిని పట్టుకొంటిమా, అగ్గిరాముడు సులభముగా మనవలలోపడును."

"ఇదే నిజమైనచో ఇంకేమికావలయును? మీరీ సంగతి నెచ్చట దెలిసికొంటిరి? మండపేట పోయివచ్చితిరాయేమి?"

"లేదండి, సామర్లకోటకేగి వచ్చితిని. ఈ సంగతి నాకచ్చటనే తెలిసినది. అది నిజమేయై యుండును. వారిద్దఱను బట్టుకొనుట కొకమార్గము పన్నితిని — ఈవేళ కోరంగిపోయి రావలయునని యున్నది. ఇప్పుడే భోజనముజేసి నేనును దానును పోయి వచ్చెదము. రాత్రి బయలుదేరి మండపేట కేగెదము. మీకు భయమేమియును లేదు. సాధ్యమైనంత త్వరలో మీపని నెరవేర్చెదను. పెందలకడ

భోజనము పెట్టించిన జాలును. దాసు! లెమ్ము. స్నానము జేయుదము"

ముగ్గురును లోనికేగి స్నానముజేసిరి. భోజనమైన తర్వాత బండి కట్టించుకొని విశ్వనాధుఁడును దాసును కోరంగికై బయలు దేరుచుండగా సుబ్బారావు "నేను కూడ మీతో రావలయునని యున్నది. శోధనకై పోయితినని డైరిలో వ్రాసెదను రమ్మనెదరా?" అని యడిగెను.

విశ్వనాధుఁ డంగీకరించెను. మధ్యాహ్నము పండ్రెండుగంటలకు ముగ్గురును దొంగతనము జరిగినస్థలమును జేరిరి. ఎండ తీక్షణముగా లేకుండుటచే వారి కేవిధమైన యాలసటయును లేకుండెను విశ్వనాధుఁడు మా యిద్దఱ కావిషయములను బోధించుచుండెను. విశ్వనాధము వానిని సమగ్రముగా పరిశీలించెను.

అయ్యా! సుబ్బారావుగారు! దొంగలీ దారినే సామానుతో పోయియుందురు. ఇదిగో గోడ్డునకు తూర్పుప్రక్కనున్న యీయడుగులజాడ వాగ్రము వచ్చినది పదచిహ్నము లన్నియు స్ఫుటముగనే యున్నవి. ఇదిగో యీదారిని తిరిగి వాగ్రముపోయినారు. సామానుతో బరుగెత్తుటచే కాబోలును మడమలు సరిగా ఆనలేదు. అగ్గిరాముడై దడుగులవాడని చెప్పితిరి కాదూ! ఇదిగో యీ యడుగులు వానివి. ఈ యడుగునకు నాయడుగునకు చూచితిరా దూరము. ఇవి తప్పక వానియడుగులే వానిదెంతపాదమండి! సుమారు పదునొకండంగుళము లుండును."

"వీరభద్రపాదమువలె నున్నదే?" అని సుబ్బారావు నవ్వెను.

"దాసు! బండివానిని పంపించుము. మనమీదారి ననుసరించి పోవుదము. ఏమనెదరు సుబ్బారావుగారు?"

"మీకేలవు కావలసినచో తిరిగి దొరుకును లెండు."

దాను బండివానికద్దెనిచ్చి పంపించి తిరిగి విశ్వనాథమును సుబ్బారావును గలిసికొనెను. ముగ్గురు నాయడుగుల జాడ ననుసరించి పోజొచ్చిరి. ఇల్లు కొంతదూరము పోయిన పిదప దూరముగా డొంకలో నేదియో యొకవస్తువు విశ్వనాథముకంట బడెను. అతడచ్చటికేగి తన చేతికఱ్ఱతో దానిని పైకిలాగెను. అదియొక నల్లనిచేవబాడిదకఱ్ఱ. గజము పొడుగున నున్నది. సుమారు పదంగుళములకై వారము గల్గియున్నది కాని, చివరకొంచెము పగిలియున్నది విశ్వనాథము దానిని తనచేతి బుచ్చుకొని దానును, సుబ్బారావును నిల్చియున్న స్థలమును సమీపము చేరెను.

"ఇదిగోనండోయి మీ అగ్గిరాముని దుడ్డు! చివర పగిలిన దనియో చేతియందు బరువెక్కువగ నుండుటచేతనో కాని, దీనిని వాడుపారవైచినాడు. ఈ తదుడ్డును గనుబడచినచో ప్రాణములు మీదికి తెగసిపోవును." అని చెప్పి పరీక్షార్థము వారల కద్దాని నొసంగి, అడుగులజాడ ననుసరించి వారితో పోజొచ్చెను.

ఆజాడ గురజనపల్లి యను గ్రామసమీపమువఱకును స్ఫుటముగా కనబడినది కాని యాపై నగుపడుట మానెను. విశ్వనాథ మెంత ప్రయత్నించినను దిరిగి జాడనుదీయలేకపోయెను. బహుశః అగ్గిరాముడాయూరినుండి రాత్రికిరాత్రియే పోయియుండునని నిశ్చయించుకొని గురజనపల్లిలో బండి నొకదానిని మాటలాడుకొని ముగ్గురును సాయంకాల మారుగంటలకు కాకినాడ జేరిరి.

రాత్రి భోజనమొనర్చి సుబ్బారావుతో విశ్వనాథము చాల కాలము మాటలాడి కొన్ని యేర్పాటులొనర్చునని వానిచే వాగ్దానమును పొంది తెల్లవారుఝామునసే దానును లేచి యిరువురును

కలిసి రైలుస్టేనును జేరిరి. ద్వారపూడికి టిక్కెట్టును గొని, తన దుస్తులపెట్టెను దానున కొప్పగించి, జాగ్రతగా కాలువగట్టున నున్న సత్రమున దిగుమని సలహా నొసంగెను. ద్వారపూడిలో దాను దిగునప్పటి కాతనికెందును విశ్వనాధము కనబడలేదు. ఏదియో యోచించుచు, తుదకాతడు సత్రమునుజేరి యచ్చట మకాము జేసెను.

5

దా నుదయకృత్యము లను దీర్చికొని విశ్వనాధ మానతి చొప్పున ద్వారపూడియూరిలోనికి బోయెను. ఎక్కడ వినినను, ఎవరుచెప్పినను, పోలీసువారలను చాలకాలమునుండి వేధించుచుండిన ఈరామ్రతయుము చేయు దుర్గ యత్రకరమే! రాత్రి యేడు గంట లగునప్పటికి విశ్వనాధము తిరిగి దాను గది ప్రవేశించెను.

“ దానూ! జాగ్రతగా నుంటివా? ఎక్కడకుబోయితి నను కొంటివి? అప్పటినుండియు నిక్కడనే యుంటివా? ”

“ ఇక్కడనే యుండియుంటిని. ద్వారపూడియూరంతయు ప్రదక్షిణము జేసితిని. ఎవ్వరు చెప్పినను నీరలసంగతియే. చాల ఘోరకలిగానున్నది. ఎక్కడ కేగితివి? కూపినేమైన సంపాదించితివా?”

“ కూపీ యేమియు దెలియలేదు. తిరిగి రాత్రిప్రయాణమై పోవలయును లెమ్ము త్వరగా భోజన మొనర్పవలయును. ” ఇర్వురును లేచి భోజనమునకు బోయిరి. ఆయిద్దరునుమాత్ర మప్పటికి మండపేట సమీపముననే యున్నట్లు తెలిసినదని విశ్వనాధము దానున కెఱింగించెను.

భోజనమైనతర్వాత విశ్వనాథము తన పెట్టెలోనుండి చిరిగిన బట్ట నొకదాని—బాగుగా మాసినదానిని—కట్టుకొని, అట్టి దానినే చొక్కాయి నొకదానిని ధరించి, తన పిస్తోలును గైకొని, దానును జాగ్రత్తగా నుండవలయునని చెప్పి, మండపేటదారిని బయలుదేరి పోయెను. రాత్రి 10 గంటల కాతడు మండపేటవంతెనజేరి, దాని కావలగా రెండుమూడు ఫర్లాంగుల దూరమున; చెట్లచాటునదాగి, తన పిస్తోలును చేతికందునట్లు మొలయందమర్చుకొని, వేచియుండెను. తరుచుగా దొంగతనము లాప్రాంతముల జరుగుచుండునని విశ్వనాథము వినియుండుటచే కాబోలు నాతి ప్రాంతములనే వేచియుండుటకై నిశ్చయించుకొనెను.

రాత్రి పండ్రెండుగంట లాయెను. తనవెనుకనుండి పిల్లకాలువను దగి ఎవ్వరో యైదుగురుమనుష్యులు వచ్చుచున్నట్లు విశ్వనాథము గుర్తించెను. ఆయైదుగురిలో వెనుక తాను వినియున్న వర్ణనలనుబట్టి విశ్వనాథము దొంగరాముని బలేరాముని సులభముగా గ్రహింపగలైను! అక్కడనే దాగియుండుట శ్రేయస్కరము కాదని తలంచి, విశ్వనాథ మీవలకువచ్చి రోడ్డుపై నిలిచి, జాగ్రతగా నిల్చియుండెను వీనిని చూచి, కొంచెము సంశయించి తిరిగి తమలోతా మేదియో గుసగుస లాడికొని, ఆయైదుగురును రోడ్డుపై కరుదెంచిరి. అందొక్కడు వీనిని జేరవచ్చి "నీవెవ్వడవు ?" అని ప్రశ్నించెను. "నే నెవ్వడనైన నేమి ? మీరు మిత్రులా లేక శత్రులా ?" అని విశ్వనాథము వారి మొగములను బరిశీలించుచు బల్కెను

దొంగరాముడు మూడడుగులు ముందునకువచ్చి, విశ్వనాథ మును నేరజూచి, "మేము మిత్రులమో, శత్రులమో నీవే నిర్ణ

యించవలయును. ఇదివఱ కెన్నడును, నిన్ను జూచియుండలేదు" అనెను.

"అట్లయిన చెప్పెద వినుడు. నేనిచ్చటి కగ్గిరాముని దండులో చేరవలయునని వచ్చితిని. నాకాపురము చామర్లకోట. ఎన్నినాళ్ళు తిరిగినను, నా కగ్గిరాముడు కనబడలేదు. ఇక్కడ నుండునని తెలిసి యిచ్చటకు వచ్చితిని. ఇందులో అగ్గిరాముడెవ్వరు?"

ఈపల్కులువిని, వారింతక దూరముగానేగి, తమలో గుసగుస లాడుకొనిరి. తిరిగి వానిని సమీపించి, "నీ పేరెవరు? నీ కగ్గిరాము డెందులకు?" అని వారలలో నొకడు ప్రశ్నించెను.

"నాపేరు విస్సిగాడు. నే ని[illegible] తిండిలేక, పొట్టకై అగ్గిరామునితో కలియవలయునని బయలుదేరి వచ్చితిని. అగ్గిరాము డెవ్వరు?"

"అగ్గిరాముడు లేడిక్కడ, ఎక్కడ నున్నాడో మాకు తెలియదు. నీదారిని పొమ్ము" అని [illegible]రాముడు వానికి దారిని జూపెను.

"అగ్గిరాముడు లేకపోయినను వాని స్నేహితు లున్నారట— అంగరాముడు, బలిరాముడు అని వాని స్నేహితు లిక్కడ నెక్కడనో యున్నారట. వారలజాడ చెప్పినను సరే, వారికాళ్ళపైబడి బ్రతిమాలుకొనెదను. బాబూ! తినుటకులేదు. పొట్టను చేతితో పట్టుకొని తిరగవలసినది. ఆసంగతినైన చెప్పరా?"

అగ్గిరాముడు గుంపులో లేడని విశ్వనాథ మెఱుంగును. ఆనాటి మాటలకు వారెల్లరును నవ్విరి. తిరిగి కొంతదూరము వెనుకకు బోయి, వారలలో నిద్దరు గుసగుస లాడి, విశ్వనాథము చెంతకుబోయి "విస్సిగా! నీ వేమిచేయగలవు? వాండ్రెందరకు నీకు గావలయును?" అని విశ్వనాథము దేహమును బరీక్షించుటకు కాబో

లును, వానిభుజముపై దొంగరాముడు చేయివైచెను. ఆచేతిని విద ళించుకొని, విశ్వనాథుడు, "వాండ్రను బ్రతిమాలుకొనినచో, నాకు తిండి పెట్టెదరని నమ్మకముండి వచ్చితిని. వాండ్రలో కలిసి నేను గూడ దొంగతనములు చేయుటకు బోయెదను. వాండ్రెక్కడ నున్నారు?" అని పల్కెను

దొంగరాముని మొగము జూచిన, విశ్వనాథుడు చెప్పిన మాట లోతునకు వచ్చులేదనియు నేదియో ననుమాన మున్నట్లు గ్రహింపవచ్చును. ఆ మన నీమధ్య వారలను బట్టుకొనుటకు పోలీసువారహోరాత్రములు ప్రయత్నములు చేయుచుండిరికదా? ఈ తడు వారలలో వాడేల కాకూడదు? అందులో నొక్కని దూర ముగాబిల్చి దొంగరాముడు డేమియో మాట్లాడుచుండెను. దొంగ రాముడు స్ఫురద్రూపి యని విశ్వనాథుడు గ్రహించెను.

ఐదునిమిషములైన తర్వాత వారిద్దరును తామున్న తావు నకు మిగిలిన పూర్గురును బిలిచికొనిపోయిరి. తిరిగి కొంతకాలమునకు గుస గుస లాడిన తర్వాత వారందరును హఠాత్తుగా వచ్చి విశ్వనాథునిపై నురికిరి. విశ్వనాథ మిట్లుజరుగునని యింతకుబూర్వమే గ్రహింపగలైను కాన, ఎక్కువనేర్పుతో వారలను తప్పించుకొని, తన మొలనున్న పిస్తోలును పైకిదీసెను. దొంగరాముడు వానిని జూచి,

"ఒరే బలేరామ్! పోలీసువేధవే! పోనీయక పట్టుకొనుడు" అని కేకవైచెను. విశ్వనాథుడు తన్ను వీరలు గుర్తించి, తనకార్యములు గ్రహించితిరాయని యనుమానించి ఏమైనను బరిశీలింపవలయునని, నిబ్బరమును దెచ్చుకొని,

"ఆన్నస్థలమునుండి కదలబోకుడు! మోసము జాగిలదు! నేను పోలీసువాడను కాను. నేను మీలోవాడనే; నన్ను పోలీసు వెధవలు తరుముచు వచ్చుటచే పారిపోయి వచ్చితిని. నన్ను వారు

మీరాలోవాడ ననుకొన్నారు. నేను పోలీసువాడను కాను; నిష్కారణ ముగా నన్ను బాధించినచో, ఇదిగో నాచేత పిస్తోలున్నది. నా మాట నమ్ముడు !" అని విశ్వనాథము భయంకరముగా నరచెను.

వాని వాక్యములకు దొంగరాముడించుక సంతుష్టుడై, మాకు నమ్మక మేమిటి? మా సంగతి నెరుంగుదువా? మోసముచేసితివేని గుండె పగులదన్నెదను. అని విశ్వనాథుని సమీపించుచు పల్కెను.

ఎన్నిదినములనుండి మిమ్ములను పట్టుకొనుటకై పోలీసువారు ప్రయత్నము జేయుచున్నారు? మీరెక్కడైన దొరికినారా? మీరున్న స్థలమైన తెలిసినదా? నాకేలా మిములను పట్టుకొనుట! నామాట నమ్మకయుండిన నామాట వినుడి; చెప్పెదను. దొంగయునికి తెలిసికొనుట దొంగకే సాధ్యము. అందుచేతనే మీరెచ్చట దొరుకుదురని ధైర్యముగా నిచ్చటకు వచ్చినాను. ఈమాత్రము తెలివితేటలు పోలీసువారికేయున్నయెడల మనల నంగటి నీ పాటికి హతమార్చరా? ఇప్పటికైన నామాట నమ్మక మున్నదా? అని విశ్వనాథము పలికెను.

దొంగరాముడు వానిని సమీపించి భుజముపై చేయివైచి "అన్నా! విన్ననా! నమ్మకము లేకేమి? నీవు పోలీసువాడ వని నాకెప్పుడును నమ్మకము లేదు. ఏమాత్రము బలమైనవాడవో చూడ వలయునని అట్లుచేసితిని. కోపము నొందవలదు. మన మెల్లరము నొక జాతివారమేసుమీ! నాకు సంతుష్టి గలుగజేసితివి. నీ నివాసం బెక్కడ నుందువు?" అని ఆదరణతో పల్కెను.

అన్నా! నాకు కొంపలేదు. మీతో కలిసి యుండెదను. ఇప్పుడు తిరిగి నాయూరికేగి తిరిగి రేపురాత్రి వచ్చి యిచ్చటనే

మిత్రులను గలిసికొనెదను మద్దూరునుకూ తెచ్చుకొనెదను. బాగుగా నమ్మకము కుదిరినదా ? ఇంకేమైన ననుమాన మున్నదా ?

ఏవిధమైన అనుమానమును లేదు. ఎందుల కుండవలయును ? జరిగినదానిని మరచిపోవలయును మనమూమాత్రము జాగ్రతగా లేకున్న మోసము జరుగదా ? మనసంగతి యటువంటిది బోధపడినదా ?

పోనాను. మరి నాకు శెల వొసంగినచో పోయి రేపురాత్రికి వచ్చెదను. నన్నెవరయిన నిచ్చట గలిసికొనిన చాలును. మీ యింటికి వచ్చెదను. చిన్నబట్టలమూట మాత్రముండును.

నేనే కలిసికొనెదను లెమ్ము. వీడిని చూచితివా ? వీడే బలేరాముడు. బలేరాముడు పక్కికిలించెను.

అట్లా ? రేపటినుండి అంతయు మనమేకదా ? శెలవిచ్చిన పోయెదను చాలదూరము పోవలయును.

సరేపొమ్ము రేపీవేళ కిక్కడనే యుండెదను. తాను వచ్చిన దారినే విశ్వనాధము పోయెను. మంగపేటవంతెన సమీపమున నేదియో యీల వినబడుటచే నాతడు వెనుదిరిగి చూచి వడిగా నడువసాగెను. వానివెంబడి నెవ్వరును వచ్చుచున్న ట్లాతనికి గనబడలేదు. వారి కేవిధమైన యనుమానమును లేదని తలంచి విశ్వనాధము తెల్లవారుఝామున ద్వారపూడిసత్రమున జేరి దానును లేపి తనగది ప్రవేశించెను.

6

నాల్గుదిక్కులను కలియజూచి, వెన్నంటి యెవ్వరును రాలేదని నిశ్చయించుకొని, తనగది ప్రవేశించినంతనే విశ్వనాధ మొక పెద్దనవ్వు నవ్వెను.

"దాసూ! లేచి, దొంగ, అని కేకవైచెదవేమో, నేను విశ్వనాథమును. నమ్మకమున్నదా?" దాసు విరగబడి నవ్వుచుండెను.

"ఏమైనా కూపీ లాగితివా యేమి? నీసంగతి జూచినట్లే బోధపడుచున్నది" విశ్వనాథము తనవేషమును పొదుపుగా తీసి దాచి, తన మామూలు వేషమును ధరించెను.

"దాసూ! దర్శనమైనదోయి!" అని తనచర్య నంతయు నవిస్తరముగా విశ్వనాథ మెఱింగించెను. తరువాత నాతడు మంగలి నొక్కనిని బిలిపించి, తనకేశములను దగ్గరగా కత్తెర వేయించెను. తిరిగి సాయంకాలమునకు యధాప్రకారముగా మాసినగుడ్డలను ధరించి, తాను ధరించియున్న గుడ్డలకుతులయగు కొన్నింటిని మూటగాగట్టుకొని, పిస్తోలును మొలయ దనుర్చుకొని ప్రయాణసన్నాహ మంతయు గావించెను.

"దాసూ! తిరిగి నేను పోవుచున్నాను. బహుశః ఈసారి మూడు నాలుగు దినములు కూడ కావచ్చును. నేను రాలేదని నీ వేమియు కలఁగొనవలదు. నేను చెప్పినసంగతులన్నియు సుబ్బారావుగారి పేర వ్రాసి తగినయేర్పాటులు గావింపవలసినదని తెలియజేయుము. జరిగిన చర్యనంతయు వ్రాయువలెను" అని కొంతసేపాతనితో గుసగుసలాడి విశ్వనాథము నాల్గుదిక్కులను బరీక్షించి, యెవ్వరును లేరని నిశ్చయించుకొని, వడివడిగా మండపేటదారిని బోయెను. రాత్రిగాఢాంధకారముగా నుండెను. ఆకాశము మేఘమయమై యుండెను. సరిగా దారికూడ కనబడుటలేదు. అట్టికటికచీకటిలో నర్ధరాత్రియం దామండపేటకు బోవురోడ్డున కొంచెము వర్షించిన తర్వాత నడచుట యెంత కష్టమో ఆమార్గమున బోయెడు వారికే తెలియగలదు. కాని విశ్వ

నాథ మిట్టి విషమసమయములయందుం గాని తేలిపోడనియు, చీకటిలోనైనను; 50 గజముల దూరమునయున్న వస్తువులను గుర్తింపగలడనియు మాపారకు తెలిసిన యంశమే. అందుచే నాతనికి విశేషకష్టమేమియు దోచలేదు అంతియేకాక తానొనర్పబోవు దుర్ణయమునకు సరియగు కాలమిదియే యని మహోత్సాహము నొందెను. రాత్రి పదిగంటలకాతడు తాను వెనుకటిరాత్రి దాగియుండిన స్థలమునుజేరి చెట్లచాటున నిల్చియుండెను అతనికొఱకై వేచియుండిన దొంగరాముడు దిరువది గజముల దూరమునను డి, మాటతో నిల్లు అంగీకరించెను.

"విశ్వనాథా! వచ్చితివా? బట్టలమూట దెచ్చికొంటివా? సరే! ఈపిల్లకాలువ దిగి రమ్ము కొంచెము పనియున్నది"

"తెచ్చుకొంటిని, ఏమి పనియున్నది?"

"కాలువదిగి దిక్కు త్వరగా పోవలయును ఆలస్యమైనచో, మనవాండ్రు తిగులపెట్టువరు. అప్పన కొం మునుగగలదు!"

విశ్వనాథునిని దీసికొని, దొంగరాముడు పిల్లకాలువగట్టుపై బడిపోవుచు తన తొందరకు నీ రీతిని జెప్పసాగెను.

"ఈరాత్రి కాకినాడనుండి యొకవర్తకుడు రెండువేలరూపాయిల దస్త్రముతో రామచంద్రపురము వచ్చుచున్నాడు. రాత్రి తొమ్మిది గంటలకు బయలుదేరినాడట. తెల్లవారుఝామునకు రామచంద్రపురము జేరగలడు. మనముండు నరువంతెనకు రెండుమైళ్ళవల వానితాళము పట్టవలయును అగ్గిరాముడే స్వయముగా కబురంపినాడు. అతడు రేవు రాత్రి మనమకామునకు వచ్చునట, మనవాండ్రందరును నచ్చటకేగి కాచుకొనియున్నారు వాండ్రున్నస్థలమునకు బండిమూడుగంటలకురాగలదు ఇప్పుడు పదునొకండు గంటలైనదికదా మనమచ్చటకు రెండు గంటలలోగా పోవలయును త్వరగాపోవలయును" అని తనకంటె

విసురుగా నడచుచున్న విశ్వనాథమునితో దొంగరాముడు నడువ జొచ్చెను.

ఆవెనుకటిరాత్రి తన్నెవరు నంటి రాలేదని విశ్వనాథము సంతోషించెనేకాని, యాతనికా గుంపులో నిలువ దొరికిన తర్వాతననగా మరునాటి సాయంకాలము దొంగరాముడు చెప్పినసంగతుల నెల్ల విని విశ్వనాథము తనకు గర్వభంగమాయెనని ఖిన్నుడగుటయే గాక తానిక ముందతిజాగరూకతతో మెలగవలయునని యాతనికి దోచెను. విశ్వనాథము వెంటబడి దొంగరాముడు పిల్లకాలువగట్టున నాతనికి స్వల్ప దూరముననే నడువ నారంభించెనట! దొంగరామునకింకను ననుమాన ముండుటచే, నితడు మండపేట పోలీసుకసబుల కేమైన వార్త నంపు నేమోయని నిర్ధారణజేసికొనుటకై వెంబడించెనట. కాని విశ్వనాథ మిటునటు జూడక తిన్నగాగోష్ఠున బోవుచుండుటచే నాతని యనుమాన మించుక సడలిపోయెను. కాని, తాపేశ్వరమువఱకును బోవ నిశ్చయించుకొని యొకఫర్లాంగు దూరము వెనుకనుండి నడచెనట! అది విని విశ్వనాథము మఱింత వడిగా నడచుటచే, దొంగరాముని యనుమానము తీరిపోవ నాతడు తిరిగిపోయెనట. తాతకు దగ్గులు నేర్పవలయునా? తుదకు దొంగరాముడింటికిబోయి తన కూటములో వారితో తనసందేహము తీరినదని చెప్పెను.

రాత్రి రెండుగంటలకు వీరిద్దరును సంకేతస్థలమును జేరిరి. బలేరాముడు విశ్వనాథమును జూచి తన సంతోషమును వెల్లడించుటకునై యొకసారి కొంచెము బిగ్గరగా సకిలించెను. ఆతర్వాత బండిపోటు ప్రయత్నములన్నియు జేయబడెను. విశ్వనాథము బలేరాముడును బండి తమస్థానమును జేరినంతనే చెరియొక యెద్దును విప్పివేయవలయుననియు దొంగరాముడు బండివానిని క్రిందకులాగి నోటగుడ్డలు గ్రుక్క వలయు

ననియు, మిగిలినవారందఱును, బండిలోనివారు (ముగ్గురుందురని కబురు తెలిసినది) పారిపోకుండ కావలయుననియు, పై ముగ్గురును తమతమ కార్యములను నిర్వర్తించినతర్వాత బండిలోనివారలను గట్టివైచి రోడ్డుప్రక్క బడవైచి దస్తుండిన ట్రంకుపెట్టెను మోసికొని అంచీల మీఁద మండపేట సమీపముననున్న స్వస్థానమును జేరవలసినదనియు, నేర్పాటులు గావింపబడెను. బండికి రెండును తెల్ల యెద్దులన్నియు, గూడునకు బైన తారుగుడ్డ యుండుననియు, యెద్దుల మెడలలో గంటలుండుననియు, తెలియజేయబడెను. ఇంకొక పావుగంటలో, ఉండూరువంతెనయొద్ద కంపెనిచేసిన మిత్రుండరుదెంచి, బండి యొక్క-టియే వచ్చుచున్నదనియు, ఇంకొక యరగంటలో నాతావును జేరగలదనియు, జెప్పెను. అందఱును జాగరూకులై యుండిరి.

బండి సంకేతస్థలమును జేరెను. మాటునదాగియున్న సింహాములవలె ముగ్గురును బండి నాపివైచి తమతమ పనులను గావించిరి. బండిలో ముగ్గురేయుండిరి. వాండ్రకోట గుడ్డలుగ్రుక్కి బండివానితో బాటుగా రోడ్డుప్రక్కను బడవైచిరి. ట్రంకుపెట్టెను బట్టుకొని ప్రక్కదారిని మండపేటవైపు పందఱును బర్వెత్తజొచ్చిరి. విశ్వనాథము మాత్రము బండిలోని మనుష్యులను బంధించుటయందు దోడ్పడక మిగిలినవా రాపనిని జేయుచుండగా తాను బండిలోనుండి ట్రంకునులాగి రోడ్డుపై బడవైచెను మార్గమధ్యమున విశ్వనాథముకూడ కొంతవఱ కాపెట్టెను మోయవలసి వచ్చెను. దొంగరాము డామునుగదయైన వానితోకూడ పర్వెత్తి ఎక్కువనేర్పుతో తనకార్యమును నెరవేర్చెనని విశ్వనాథమును స్తుతింపసాగెను. తూర్పునను తెల్లవారకపూర్వమే వీరందఱును తమనివాసస్థానమును జేరిరి. మండపేటకు గొంతదూరమున నున్న పిడపర్తిగ్రామమున వీరు నివాసమేర్పఱచుకొనిరి వీరు మూల

గూడెమున నొక తాటాకుల గుడిసెయందు వసించుచుండిరి. తమబరు వునుదించి లోపలిగదియందుంచి తాళమువేసి యందఱును ముందు గదిలో పఱచియుంచబడిన చాపలపైన బరుండిరి. ఏదేదియో యిష్టాగోష్ఠిని మాట్లాడుకొనుచు వారందఱును లోకమంతయు మేల్కొనువఱకి నిద్రబోయిరి.

7

మధ్యాహ్నము 2 గంటలకు క్రమక్రమముగా వారందఱును నిద్రలేచి, స్నానముజేసినవారు స్నానముజేయుగా భోజనములజేసి గుడిసెలో కూర్చుండి యుండిరి ఆగుడిసె సంబంధ వర్ణింపవలయును.

గుడిసెకు నాలుగువైపుల నత్తియున తాటాకువడు లున్నవి. లోపలి యావరణలో రెండు మామిడిచెట్లును, ఒకయుసిరి వృక్షమును రెండు కొబ్బరిచెట్లును, ఏడెనిమిద తాటిమొక్కలును, కుంకుడు చెట్టొ కటియునున్నవి. గృహమంత గుంభనగా పైకగుపించదు కాని లోపల నతివిశాలముగ నుండెను. గృహమంత రెండుగదులుగా విభజింపబడి యుండెను. ఇంటివెనుక నొకవసారా యుండెను. ఈవసారాయందు వండ ఱును వంటజేసికొనుచుందురు. ఆ గదులలో నొకదానియందు వా రెల్లరును తమసామానుల నుంచుకొని రెండవదానియందు శయనింతురు. విశ్వనాధ మాదినము నందఱును భోజనము జేయువఱకును నిద్రలేవక, ఏదియో మిఠాయి బెట్టె చేతుగా పట్టుకొని భక్షించెను.

రాత్రిపడువఱకును వీరెల్లరును తమగుడిసెపంచనే కూర్చుండి యుండిరి. (ఆకాలమునందే దొంగరాముడు విశ్వనాధమును కొంబడిం చినగాధ నాతనితో చెప్పెను) అగ్గిరాముడు వాదినమున తమ్ముల్లరను

జూడవచ్చునని కాబోలును వారెల్లరును సుత్సాహవంతులై యుండిరి. అచ్చట జేరియున్న గుంపులో దొంగరాముడును, బలేరాముడును, విశ్వనాధమును గాక ఇంకొక యేబదుగురు మనుష్యు లుండిరి. వారిలో కొందఱు విశ్వనాధమును మండపేటసమీపమున జూచినవారును మఱి కొందఱు రామచంద్రపురమునకావల దొంగతన మొనర్చినవారును గలరు. ఇంతలో బలేరాము దికిలించుచు లేచి, వారల కిట్లుపన్యసింప నారంభించెను.

"అన్నలారా! తమ్ములారా! మనమెల్లరము నొకరీతిగా నుద్యోగస్థులమే యనుకొనియెదము గాక! మనయధికారి వచ్చినప్పు డేవిధముగా మనము సంచరింపవలయునో ఆరీతిగనే మనమేలు గోరుచు బీదసాదలకు సమానత్వమును జేకూర్చుటకై యత్నించుచున్న మన నాయకుడు మనల చూడవచ్చినప్పు డదేరీతిగా సంచరింపవలయును. అగ్గిరాము డగ్గిరాము డనుకొనుటయే కాని నాకును దొంగరామునికిని దప్ప మీకెవ్వరికిని వానిసామర్థ్యములు తెలియవు. కొంచెమాతని శక్తి సిగురించి చెప్పెదను. అతనియాకారమును జూచినంతనే యాతని దేహదార్ఢ్యము మనకంతగా బోధపడదు. ఆతనినుగుణాతి జల్ని జూచినచో నాతడు పేరుమోసిన దొంగరామ యని మీరు సందియ ముందదరు. కఱ్ఱనుగాని, కత్తినిగాని, పుచ్చుకొని సామునారంభించె నేని నూరుమందినైనను అవలీలగా నడ్డగలడు. ఆకాలమునందాతని రూపము మెఱుపువలె, నెవ్వడైన గనబడునేమో సంశయాస్పదము! బాహాబాహి పెనగనారంభించెనా యాతనితో బోరి నేటివఱ కెవ్వరును నగ్గని లోకమున జెప్పుకొనుటలేదు. పిస్తోలుతో లక్ష్యము తప్పకుండ నొంటేటసూక్ష్మవస్తువునైనను మానవసాధ్యమైనంతదూర మునుండి కొట్టగలడు. ఆతనితో నెంతవడిగా వెంబడించువాడైనను

పరుగెత్తలేదు ఆతని దేహమునకు ముండ్లునాటవు. ఆతడు తెలుగు, హిందీ, హిందూస్థానీ భాషలను స్వదేశస్థునివలె, మాటలాడగలడు అరవము, ఇంగ్లీషు, కొంచెముగా మాట్లాడగలడు. ఇక నాతనిమంచి తనము నాతడు దోచినవానికే యుగ్గడించుచుందురు. ఆత డెన్నిసారులు దారులుకొట్టినను నేటివఱకు ప్రాణహానిజేసి యెరుగడు. స్త్రీలను, లేబ్రాయపువారిల నెన్నడును బెదిరించియైన యెఱుగడు తాను తప్పించుకొనిపోవుటకు వీలులేనప్పుడు మాత్రము కొందఱ మొదటివారలను నొప్పించి తనదారి నేగెడువాడే కాని అప్పుడైనను రక్తమును గంట జూచియెఱుగడు. నేటికి సుమారు పదిపంద్రెండేండ్లనుండి యాతడు దొంగతనములు చేయుచున్నను పోలీసు వారింతవఱకు సలాము చేయుచుండుటయేకాని, వానియెదుటబడి పోరాడినవాడులేడు. ఇట్టిమహనీయుడు మనకు నాయకుడై యుండ మనకేటికొదవ? ఇట్టి దేశోపకారి మనకు గురువై యుండ మనమేల భీతిల్లవలయును? దొంగ దేశోపకారి యెట్లగునందురా? ఆతడు భాగ్యవంతులనే దోచికొని. బీదవారిని పోషించుచున్నాడు. బీదల కాతడు దైవసమానుడు. సాధారణసంసారుల నాత డెన్నడును బాధించియెరుగడు అతని యద్భుతచర్యల నింకొకసారి చెప్పెదను. అతని దైవభక్తి, దీనసంరక్షణయే, నాతనిని దీర్ఘాయుష్మంతుని జేసి మన్నింపగలవు."

"ఎవరిని దీర్ఘాయుష్మంతునిజేసి మన్నించుట?" అని యొక గంభీరస్వరము గుడిసె వెలుపలనుండి వినబడెను. బలేరాముడు గంతులువైచుచు తలుపుదీయబోయెను. అగ్గిరాముడు లోపల ప్రవేశించెను. గుడిసెలోనున్న వారందరున్న—విశ్వనాథముకూడ—ఒక్కపెట్టునలేచి "అగ్గిరాముగురోజీకి జయ్" అని కేకలు వైచిరి. కుశల ప్రశ్నములు తీరినతర్వాత దొంగరాముడు విన్నన్న వృత్తాంతమంతయు

దానితోఁజెప్పెను. అగ్గిరాముఁడు విశ్వనాథమును జేరి అతని యొద్ద గూర్చుండి వానిముఖమున దీక్ష్ణముగా బరిశీలించి భుజముపై చేయి వైచి నానందముగా.

"విన్నన్నా! దొంగరాముడు చేసినదానికి నేనెన్నడు సహింపను. నీ కేవిధమైనభయమును వలదు. యథేచ్ఛగా నుండవచ్చును," అని ధైర్యము జెప్పెను.

"నేను తిండిలేక మీపాదములపై బడి జీవనోపాధి నేర్పఱచు కొనుటకై వచ్చితిని. మిమ్ములను జూచుట నేటికిగానితటస్థించినదికాదు మీకయి వచ్చిన నాకు మీయనుచరులు స్నేహముముందుగా తటస్థించినది. వీరును మీరును నాయందు జూపిన దయకు నేనెంతయు కృతజ్ఞుడను."

"విన్నన్నను జూచి మేము మొదట నేమోయనుకొంటిమి. కాని మాకు నామముల బెట్టజాలిన సమర్థుడని మొన్నటి నిన్నటి వ్యవహారములలో తేలినది." అని బలేరాము డికిలించెను.

"విశ్వాసముగా నున్నచో వాని కేవిధమైన హానియు రానేరదు మీవలెనే అతడును నానమ్మినబంటుగా నుండును. నేనిదే అభయహస్త మిచ్చుచున్నాను." అని అగ్గిరాము డాతనిచేతిలో చేయి వైచెను.

విశ్వనాథము తన సంతోషమును గనబఱచుచు "అగ్గిరాముడు తలచినయెడల లోటేమిరాగలదు! నాకానందమైనది" అనెను.

అగ్గిరాముడు దొంగరాముని నావలకు దీసికొనిపోయి నుమారు నున్నవది హేనునిమిషములవఱకును మాట్లాడి పిదప గుంపువారందఱు

నున్న తావునుజేరి కూర్చుండెను ఒకగంటవఱకును వారెల్లరు నిష్ఠాగోష్ఠి మాట్లాడుకొనుచుండిరి. అగ్గిరాముడు తాను పోవలయునని లేచి ముందు జరుపబోవు దొంగతనములను గుఱించి తనవారికెఱిగింపదలచి యిట్లు పన్యసింపదొడగెను.

"సోదరులారా! నేను చెప్పబోవు సంశయములను జాగరూకులై సావధానముగా విననలయును. మనవృత్తి కొలదిదినములక్రిందటివలె నేడు నిష్కంటకము లేదు. పోలీసు మనవృత్తికి భంగము కలిగింప వలెనని విశ్వప్రయత్నము జేయుచున్నారు వివిధోపాయముల నవలంబించుచున్నారు మనగుంపు కొంతవఱకు వారల యధీనమైనది. కాని నేటివఱకు మాత్రము నాయకులను వారు పట్టుకొనలేకున్నారు భగవదిచ్ఛ యెట్లుండునో మనము చెప్పలేము. సాధ్యమైనంతవఱకు మనము జాగ్రతగానుండుటయే మనకు తరుణోపాయము. మనము వసించియున్న యీమూలకూడెములోనివా రెల్లరును మనకు లోబడి యే యున్నారు. మనవలన కొలదిగనో గొప్పగనో వార లనుభవించుచున్నారు. అందుచే వారు మనమున్న తావున్న పై వారి కెఱింగింప నేరరు. వారలట్లు మనకు లోబడి యున్నంత కాలమును, మనము హాయిగా గుండెపై చేయివైచికొని నిద్రింపవచ్చును. కాని రోజు లెట్లుండునో మనము చెప్పనేరము. కారణాంతరములవలన, నేను విడిగా సంచరింపవలసి యున్నది. నేను లేనికాలమున మీరతి జాగరూకులై మెలంగుట శ్రేయస్కరము. మెలగువిధులన్నియు మీరిదివఱ కెఱింగియే యున్నారు. క్రొత్తగాజేరిన విస్సన్నకు దొంగరాము డావిధుల నెఱింగించును. ఇక జరుప దలచిన దొంగతనములను గుఱించి తెలియ జేయుదును. సావధానముగా వినుడు. రేపురాత్రి మీరెల్లరు నవపల్లి లోనొక భాగ్యవంతుని యింట బ్రవేశించి సొత్తును తీసికొని రావల

యును. ఆవైన మంతయు దొంగరామునితో జెప్పితిని! ఆతడు మీా కెఱింగింప గలడు నేనచ్చటకు రావీలులేదు కావున జాగరూకులై మెలంగవలయును. నేను తదియగదా ! తిరిగి షష్ఠిరోజున ద్వారపూడి రోడ్డున రామచంద్రపురము పెండ్లివారు పోయెదరు. సుమారు 10 గంటలకు బండ్లు వంతెనదిగును. వంతెన దిగినవెంటనే మీాపనిమీారు జూచుకొనవలయును. నేనుకూడ బహుశః రావచ్చును. కాని యిన్నిటి కంటెను ముఖ్యమైనది నవమినాటి రాత్రి 12 గంటలకు జరుగవల యున్నది. ఆర్యావట్టములోని కె॥ ల॥ ఇంట బ్రవేశించి, సామాను నంతయు తెల్లవారుసరి కిచ్చటకు తీసికొని రావలయును అచ్చటకు నేనును రాగలను ఎల్లుటిరాత్రి నేనొక చిత్రము నాచరించెదను. తరు వాత నయ్యది మీాకెఱింగించెదను. నేను లేనని మాత్రము మీారెంత మాత్రము నధైర్యము నొందవలదు.”

పిదప నాతడు దొంగరామునితో వదినిమిషముల వఱకు గుస గుసలనాడి “అగ్గిరామ్ గురోజీకి జయ్” అను శబ్దము మధ్య నంధ కారములో నైక్యమైపోయెను.

8

అగ్గిరాముడు గుంపును విడచి యెచ్చటికో పోయెను అతని యునికి దొంగరామునకు దప్ప మఱెవ్వనికి దెలియదు. విశ్వనాథ మగ్గి రాముని జూచినదిమొదల లాతని రూపమునకును, పిదప వానివాక్యముల కును మితిలేని యాశ్చర్యము నొందెను. ఆతని రూపమును జూచినవా రెవ్వరు నాతడు దొంగయనియు, విశేషబలశాలియు దలంచుట కవ కాశములేదు. ఆతని వాక్యములను వినిన నాతడు నీచవృత్తియందు సంచరించువాడని యెవ్వరు ననుకొనరు రాకపోకలయుండలి యాతని

తెలివితేటలను, పన్నుగడల యందలి యాతనినేర్పును వశీకరణమునం దాతని చాకచక్యమునుగని విశ్వనాథుడు తానుకూడ నిజముగ దొంగ యై, యగ్గిరాముని యనుచరునిరీతి నుండిన నెట్లుండునోయని చింతింప నారంభించెను. అట్టియసాధారణ ప్రజ్ఞగలవాడు కనుకనే, నేటివఱకు నాతడు పోలీసుచేత బడకుండెననియు, నాతనియునికి పైవారెఱుంగ లేకుండిరనియు విశ్వనాథమూహించెను. అగ్గిరాముడు నిజముగ చోర చక్రవర్తియను బిరుదము కర్హుడే.

ఇట్లుతలంచుచుండిన విశ్వనాథమును దొంగరాముడు సమీపించి ఏమోయి! జోగుచుంటివా ?" అని కండ్లయెదుట జప్పట్లుచర చెను. విశ్వనాథ ములికిపడిలేచి "గురుదర్శనానందము ననుభవించు చుంటిని" అనెను.

విన్నావా! నీసంగతి అగ్గిరామునకు పూర్తిగాత్రృప్తియైనదట! కూపీలు తీయుటయందు నీకు బ్రజ్ఞయుండవచ్చునని నీముఖమునుబట్టి గ్రహించినాడట! కావున నిన్నికముందు దొంగతనములకు ముందు కూపీలను దీయుట కంపవలయునని యాతడు నిర్దేశించినాడు."

"నాకది సంతోషమే; కాని, ఆతడు నన్నేల అంత తీక్ష్ణముగా తనదృష్టిచే పరిశోధించినాడు ? ఆతనికి నావిషయమై యనుమానము న్నదా ?

"అనుమాన మున్నదనికాదు. పోలీసువారు మనలను బట్టుకొ నుటకై చేయు ప్రయత్నములను జూచి యాతడు పోలీసు వాడెవడైన నీవేషమున వచ్చెనేమోయని పరిశీలించెను. అంతమాత్రము జాగ్రతలేని యెడల, మనకీకాలమున నుప్పును గంజియు లభించునా ?"

"నిజమే. అందుకు నేనేమియు ననుకొనుట లేదులెమ్ము. మన మానంపు రాత్రిప్రయాణ మెప్పుడు ? ఎంతమంది పోవలయును ?"

"మనమైదుగుర మేగవలయును. రేపు మధ్యాహ్నము బయలు దేరి, సాయంకాలమున కనపర్తి జేరవలయును."

ఇంతలో బలేరాముడు వారున్న తావునకు జేరి, "విన్నన్నా; నాచేతికి తగినపని యీమధ్యదగులలేదు. పంజాపట్టెదవా ?" అనెను.

"నాకిదివఱ కలవాటు లేదుకాని; నీకంత యవసరమైన బట్టెదను." అని విశ్వనాథ మాతనితో పంజాపట్టుట నారంభించెను. ఆదిని గొంచెమాతడు బలేరామునకు లొంగునట్లు గనిపించెను కాని, పదినిమిషములైన తర్వాత, నాతడు బలేరాముని ముప్పుత్రిప్పలుపెట్టి యింకెన్నడు చచ్చినో పట్టనని యనిపించెను. చుట్టునున్న వారు గొల్లున నవ్విరి దొంగరాము డాతని వీఁపుపై జఱచి, "వాడికశాస్తిచేసినావు ఇక ముందు మమ్ము బలేరాముడు పంజాబట్టుమనినప్పుడెల్ల నిన్ను జూపింతుము. ఇకనీపేరు వానికి బ్రహ్మాస్త్రమే!" అని మెచ్చుకొనెను

ఇట్లువారు కొంతకాలము వఱకును గాలక్షేపముజేసి, భోజనాద్యవశిష్టములను దీర్చుకొని సుఖనిద్రాపరవశులైరి.

మరునా డుదయము మొదలు మధ్యాహ్నము రెండుగంటల వఱకును, నాగుడిసె నటకరంగస్థలమాయెను. ఆకాలమున నాగుడిసె నుండి, గంటగంట కొక్కడుగా, నొకపంచాంగపు బ్రాహ్మణుడును, నొక కంచుచెంబుల వర్తకుడును, నొకసాతానియు, నిద్దరు రైతులును బయలుదేరి ద్వారపూడిదారి కొకరొక్కరే అనపర్తిజేర నారంభించిరి వేషముల దాల్చుటయుందును, తదనుసరణముగా బ్రవర్తించుట యందును వీరాఱితేరినవారని యీనాటిచర్యయే బాగుగా చాటగలదు. విశ్వనాథము సాతానివేషము దాల్చెను. దొంగరాముడు పంచాంగపు బ్రాహ్మణుడాయెను. బలేరాముడు కంచుచెంబుల వర్తకుడయ్యెను. మిగిలిన యిద్దరును రైతులవలె బ్రచ్ఛన్నవేషములను దాల్చిరి.

విశ్వనాథము చేతిలోని 'విసిని' కర్రయందు కన్నపుగత్తి యమర్పబడి యుండెను. మిగిలిన నలుగురి చేతులయందలి కర్రలయందును గత్తుల మర్పబడియుండెను. ఇట్లు వీరొకరి వెంబడి నొక్కరు ద్వారపూడి సమీపములనుజేరి సాయంకాలమగునరి కూరియందు బ్రవేశింపవల యును. దొంగరాము డాగ్రహస్థునింట రాత్రికి భోజనమునకుజేరి, వీధి యరుగుపై సాయంకాలము భోజనమునకు బూర్వము గూర్చుండియుం డును. మిగిలిన నలుగురు సిల్లునానవాలు జూచికొని రాత్రికి వీధియరు గుపై బరుండియుండు దొంగరామునిజేరి యాతని యనుమతి చొప్పున నింటికెచ్చటనో గన్నము త్రవ్వవలయును తెల్లనారులోపున నందఱును దిరిగి పిడపర్తి జేరవలయును.

ఇట్లు ద్వారపూడినుండి పోవుచుండగా విశ్వనాథము సత్రపున మీాపమును జేరిన వెంటనే తనసహాజమైన కంఠస్వరముతో భాగవత మునందలి "అలవైకుంఠపురంబులో నగరిలో నామూల సౌధంబు లోపల" అని పాడునప్పటికి వీధియరుగుపై నారాయణదాసా ప్రక్క గదినుండి యరుదెంచెను. అతని జూచి విశ్వనాథము తనమార్గమునుండి మరలక నడచుచునే "మొల్లుటిరాత్రి నీగదియందు ఓటీపడనేయుదును. ఆప్రకారము తత్క్షణమే యేర్పాటులు చేయించవలయునని ముత్యా రావుతో చెప్పు" అని యాతనికి వినిపించునట్లు చెప్పి తనదారినేగి యొక విజనప్రదేశమున గూర్చుండి యొకజాబును వ్రాసి కట్టుకొనినబట్ట లో దాచి యుంచుకొనెను. ఆగి నారాయణదాసుతో మాట్లాడినచో, నెవ్వరైన గనుగొనినచో, తనప్రయత్నమునకే గాక ప్రాణమునకు గూడ భంగమువచ్చునని యాతడట్లు నడచుచునే దానుతో మాట్లా డెను.

దొంగరాము డాగ్రహస్థుని యింటికి సాయంకాల మైదు గంటలకుజేరి రాత్రికి భోజనము బెట్టింపవలయునని వేడికొనెను.

ఆ యజమానియు నొప్పుకొనెను. సాయంకాల మైనతోడనే, యాత డాయజమానితోగూడ వీధి యరుగుపైఁ గూర్చుండెను. ఇంకొక యరగంట కొకఁడెంబడి నొకరాఁ ధనిబోయి యూరుబయట మామిడితోపుప్రక్క గూర్చుండి, తమతో దెచ్చికొనియున్న యాహారములను భుజించి యొక మూడుగంటలకాలము విశ్రమించిరి. పిదప చాటుమార్గములవెంబడి నెల్లరు నూరు నిశ్శబ్దమగుసరి కాతని వీధి యరుగులపైకి బండుకొనుటకు జేరినట్లు కూడికొనిరి; దొంగరాముడతిరహస్యముగా యావద్వృత్తాంతమును మిగిలినవారి కెఱింగించెను. బలేరాముడును మిగిలిన రైతువేషముననున్న యిర్వురును దొడ్డిగోడ దాటి దొంగరాముడు చెప్పినట్లు పడకగదికి మంచముక్రింద గన్నము ద్రవ్వి లోన బ్రవేశించి, గాఢనిద్రయందున్న యజమాని మొలత్రాటినుండి తాళపుచేతుల నూడలాగికొని ప్రక్కగదియందున్న బోషాణమును దెరచిరి. అందుగల నగలపెట్టెను, రొఖము బైకిదీసి యొక రొకరే కన్నమునుండి వెలువడిరి. తెల్లవారుసరికి పిదప రిగ్రామము మంచీలపై నెల్లరును జేరిరి. ఒక్క దొంగరాముడు మాత్రము అచ్చట నాయుదయమువఱకును బరుండి, తెలతెలవారు వేళ, దాను కడచినరాత్రి యజమానితో చెప్పినట్లూరిలోని వారెల్లరు దన్ను జూచుచుండగా, బిక్కవోలువైపు బయలుదేరి. యొక యరమైలు బోయి, వెనుకకు మరలి, పొలముగట్లపై ఎనిమిదిగంటలకు పిదప గ్రి జేరెను. యజమాని యుదయముననే లేచి, వీధితలుపుదీసి దంతధావనాదుల నొనర్చి బోషాణముదీయుటకు తాళపుచేతులకై మొల దడుముకొని కానరాక, లోనికిపోయి వెదకి తుదకు బోషాణము జేరి చూడగా తాళపుచేతు లాతాళము ననే యుండెను. తెరచి చూడగా సగత్రి పిళదమాయెను. ఇక నాయుడు చేసినగోలకు మేర లేదు. ఉదయముననే యూరివారి కెల్లయెదుట నొక్క యంగవస్త్రముతో

నేగిన పంచాంగపు బ్రాహ్మణుని యందాతనికి లేశమైన ననుమానమే లేదు; ఈతని పడకగదిలోనుండియును, వంటశాలనుండియును, బోషాణముండిన గదికి మార్గములున్నను, తాళపుచేతుల దీసికొనుటకై యాతని పడకగదికే కన్నముద్రవ్వవలసివచ్చును. ఆరాత్రి లబ్ధి సుమారు నాలుగువేలు రూప్యము లుండియుండును.

9

మరునటినాడు మధ్యాహ్నమునకు రొఖ్ఖములో గొంతభాగము మాలపల్లెలో నున్న వారికి మామూలుగా పంచిపెట్టబడెను. ఎవ రెవరి కీయదలంచినవి వారివారియింటికి దొంగరాముడే తీసుకొనిపోయి యిచ్చుట యలవాటు. వారివారి యవసరములనుబట్టి అగ్గిరాముని యనుమతిపై దొంగరాముడు సహాయము చేయుచుండును. మాలపల్లెలో వీరిపేరెన్నను దినని వాడును, వీరియెడ విశ్వాసము లేనివాడును లేడు.

పిడపర్తి గుంపులో నున్నవారెల్లరు నానందసముద్రమున నోలలాడుచు నిచ్చవచ్చినట్లు గాలక్షేపము జేయుచుండిరి. అగ్గిరాము డెచ్చటనుండెనోగాని, ఆదినమున నాతడు చిత్రము నొనర్చెదనని వాగ్దానము నిచ్చియుండుటచే పిడపర్తిలోనివా రాచిత్ర మెట్టిదో యని యూహలను జేయుచుండిరి. కాని ఆచిత్ర మెట్టిదో ఆదినమున మధ్యాహ్నమునకు కలెక్టరుదొరగారికిగాని, అతని యెదుట నేదియో యుత్తరము జదువుచున్న మునిషీకిగాని బోధపడలేదు. దొరగారి మొగము గీచిన కందదుంపవలె నెఱ్ఱనై కోపముచేతను, నాశ్చర్యముచేతను వికృతమై యుండెను. ఆకలెక్టరు చాల సరసుడనియు, ప్రజాహితపాలకుడనియు

ప్రసిద్ధని ముద్రింపు ఎదుటనున్న మునిషీముఖమున నించుక కొంటె తనము గన్పించుచుండెను. దానికి కారణ మాతడిప్పుడు చదువుచున్న యుత్తరమునందలి యంశములే. ఆసాయంకాలము దొరగారు ద్వారపూడి కాలువలో జమాబందీకై కదియము పోవుచుండె గావున మునిషీ తీరుబడిగ కూర్చుండి చదువుటకుగాని, దొరగారు కూర్చుండి వినుటకు గాని లేశము నవకాశము లేకుండెను. మనముగూడ నాయుత్తరము లోని యంశముల నొకసారి పఠింతము.

“ మహారాజరాజశ్రీ గోదావరిజిల్లా కలెక్టరుదొరగారి దివ్య సముఖమునకు, భృత్యుడు అగ్గిరాముడు సాష్టాంగదండప్రణామము లాచరించి వ్రాసికొను అర్జీవిన్నపములు. దొరగారికి నే నెవ్వరినో, నావృత్తియు గుణగణంబు లెట్టివియో నే నెఱిగింప నవసరములేదని తలంచుచున్నాను. ఏలనన నాపే రీజిల్లారికార్డులలో జరిగిన పది; పదునొకండు వత్సరములనుండియు నగ్రస్థానము నలంకరించియుండు నని నేను చెప్పుకొనుచున్నానని మీరు నాయందు గర్వము నారో పింపవల్దు. నేను తమవలెనే ప్రజాహితపాలనమునకై యత్నించు చున్నాను. చేతకానివా రగుటచే పోలీసు నన్ను బట్టుకొనలేక, నాయందు తమకున్న కోపాదులను దీర్చుకొనుటకే నానామమును గలుషపూరితముగా జేయయత్నించుచున్నారు. తమరు రెండేండ్ల క్రిందట నావ్యవహారమున నాపరోక్షమందు విచారించుచు నేను దొంగనయ్యును కరుణయు, మానమును గలవాడనని నిండుసభయం దుచ్చరించితిరని విన్ననాటినుండియు తమ యుదారభావమును గొనియాడుటయే తప్ప, నాకితరోద్యోగ మేమియులేదు. తమ కసతి కాలములో నాయద్భుత నైపుణ్యము జూపింపవలయునని యానాడే నిశ్చయించుకొని యుంటిని కాని, తొందరపనులవలన, నేటివఱకును తీరిక లేకపోవుటచే యూరకొన వలసివచ్చెను. ఈయాలస్యమునకు మన్నింతురేని, తమకు కొలదిదినము

లోపల—నేలనగా నేడో రేపో వెళ్లుటనో—నాచాతుర్యమును జూపించి మెప్పుబడయగలను.

దేవరవారి దివ్యచిత్తమునకింకొకసంగతి దెలపవలయునని యిన్ని దినములనుండియు యత్నించుచుంటిని. నేనెంతదొంగనైనను తమరు సెలవిచ్చినట్లు నాకును మానావమానములున్నవి. దొంగయు మనుష్యుడే. కాని నేను బాటలు గాయుచున్నను బాటసారులను హింసించలేదు. మనుజులసొత్తును హరించుచున్నను వారి మాన ప్రాణముల నెన్నడును స్పృశించి యెఱుగను. విరివిగా దొంగతనములను జేయుచు, వేలకువేలు ధనము నార్జించుచున్నను, నేను నిత్యభిక్షాధికారినే. భాగ్యవంతులనే దోచి యాధనమును బీదల కొఱ కిచ్చుచున్నాను. అట్టి నన్ను పోలీసు పట్టుకొనలేక, నాయందు ప్రాణహాని, స్త్రీమానహాని, బాలబాలికాహింస, నిర్దయ మొదలగు మహాపాపముల నారోపించుచున్నారు. నేను తమ్ము గోరున దేమన, నాయందు దయయుంచి, నాబారిబడి, నాచే ధనమును బోగొట్టుకొనిన వారిని విమర్శించి, నాయం దిట్టిగుణము లున్నవేమో కనుగొని, పోలీసువారికి బుద్ధిజెప్పవలయుననియే! నాచేత నిరాయుధుడై, నిద్రావస్థయందున్న నాపరమవిరోధి జిక్కినను నేను వానిప్రాణమున కేవిధమైనహానియు నొనర్పననియు, రక్తము గంట జూడననియు నాబిరుదములు. తమకే నిదర్శనము తెలియగలదు. నేడు జమాబందీపై బయలుదేరుచున్నారు కాబోలును. తిరిగి వచ్చునపు డగ్గిరామునిగురించి, మీకున్న సదభిప్రాయము బలపడునుగాత — ఇట్లు విన్నవించువిధేయుడు — అగ్గిరాముడు."

దొరగారు ప్రయాణపు హడావిడియందీయుత్తరములోని యంశములకు కోపము నాశ్చర్యమునొంది, విసుగుదలచే, మునిషీ నొక రెండుతిట్టి, ప్రయాణ మాలస్య మగుచున్నదని, ఇద్దఱు ముగ్గురు

బంట్రోతులపై నుంచి, సాయంకాల మారుగంటలకు పడవనెక్కి, పడవటాపుపై జాగరూకతతో మేల్కొని యుండవలయుననియు, అగ్గిరాముడు వచ్చిన గలియబడి పట్టుకొనవలయుననియు, నాజ్ఞలనొసంగి పడవలో తలుపులు దీసికొని, తన చందువాపెట్టెను కాళ్ళక్రింద నుంచుకొని గాఢనిద్రాపరవశుడాయెను బంట్రోతులు రాత్రి 12 గంటలు దాటినదాక, మెలకువతో మాట్లాడుకొనుచు నగ్గిరాముని గురించి కథలను జెప్పికొనుచు గాలక్షేపము జేసిరి. అంత నించుక నిద్దరా వారు జోగుచు, మధ్యమధ్య "అదుగో వచ్చినాడు! ఇదుగో వచ్చినాడు!" అని పలవరించుచు టాపుపై నిటునటు సంచరించి తిరుగ నిద్రాపరవశులైరి. రాత్రి 8 గంటలకు పడవ యొకచో రెండులాకులగుండ బోవలసి వచ్చెను. అంతయు నిశ్శబ్దముగ నుండెను. మొదటిలాకును దాటునపు డగ్గిరాముడు లాకు తలుపులో డాగియున్నవాఁడు గావున, "టాపు" పై వారి కగుపడకుండ పడవ హాలులో ప్రవేశించెను. తిరిగి పడవ రెండవలాకును దాటువేళ కాతడు దొరగారి చందువాపెట్టెలో తలుపులోనికెక్కి డాగెను. దొరగారి పాదములక్రింద ఆయన దుస్తులను మూటగాపెట్టి, అగ్గిరాముడా పెట్టెను కదలిక లేకుండ లాగివైచెను. పడవ లాకును దాటిన తర్వాత నగ్గిరాము డాపెట్టెతో తనదారి బోయెను.

ఉదయముననే లేచి దొరగారు పెట్టెలేదని బంట్రోతులపై నొందినకోప మింతింతయని చెప్పనేరము. ఒకరిద్దఱకు పాదరక్షాప్రహారములు కూడ సిద్ధించెననియు నొకఁని పనిలోనుండి తప్పించివైచెననియు తరువాత తేలినది. ఆపెట్టెలో జమాబందీకాగితములు కొన్నియు, సర్కారురహస్యములుగల కాగితములు గొన్నియు సుమారొక వేయి రూపాయల కాగితములు గలవట! డబ్బుపోయిన నాతడువిచారింపడు. కాని సర్కారుకాగితములు పోయెనని చాల ఖిన్నుఁడై తనయొద్దనున్న

గుమస్తాలను, బంట్రోతులను నాలుగువైపుల కాతడు పరుగెత్తించి విహ్వాల మనస్కుడయి యాతడా కాలువగట్టున కొంతదూర మేగెను.

ఉదయ మెనిమిదిన్నర గంటలాయెను. ఒక అత్తరులమ్ముసా హేబు నాలుగుదిక్కులను గలియజూచి తలపాగ తిన్నగా సవరుచ్చుకొని గుడ్డలో కట్టబడి తన భుజముపై నుండి వ్రేలాడుచున్న పెట్టెతో దొర గారి యెదుటనిలిచి సలాముచేసి పెట్టెను గుడ్డలోనుండి తీసి యాతని యెదుట బెట్టెను దొరగారాశ్చర్య నిమగ్నులై తత్క్షణమే తనజేబు లోనున్న తాళపుజేతులను దీసి పెట్టెమూత దెరచి లోనిసామాను నంతయు వివరముగా జూచెను. ఈకాలమంతయు నాయత్తరు సాహే బు నాల్గుదిక్కుల జాగరూకతతో బరీక్షించుచుండెను. తుదకు దొర గారు లేచి నిలువబడి "ఎవడవు నీవు" అని ప్రశ్నించెను.

తెమకు నిన్న యుత్తరము వ్రాసియుండలేదా? అందులో చూపెదనన్న చిత్రమే యిది. శెలవుగిచ్చిన నాదారి నేగెదను. అని వచ్చిన యగ్గిరాము డనెను.

చాల సంతోషము. ఈడబ్బు తీసుకపొమ్ము. అని దొరగారా పెట్టెలోనున్న సుమారు వేయిరూప్యములు విలువగల కాగితములను దీసి యాతనిని దీసికొమ్మని సంజ్ఞచేసెను.

తెమ యనుగ్రహమున్న చాలును. ఈడబ్బు నాకనవసరము. ఇట్లు నిరాకరించితినని కోపమువలదు. దీనినేదైన ధర్మమునకు విని యోగించుడు. దయయుంచుడు. శెలవు అని తృటిలో నగ్గిరాము డదృశ్యమాయెను. తిరిగి మకాము జేరిన తర్వాత సాధనమును బీద విద్యార్థులకొఱకు దొరగారు ఖర్చుపెట్టిరని వాడుక.

10

అగ్గిరాముడు కలెక్టరుగారి పడవయం దీచిత్రమును జేయు రాత్రి ప్రారంభించునప్పటికి పిడపర్తిలోని గుడిసెలో నెక్కడజూచినను నవ్వులే. దొంగరాముడు తనయొక్కయు, నగ్గిరామునియొక్కయు, బలేరామునియొక్కయు విచిత్రచర్యలను కథలుగా చెప్పుచుండెను. మనమచ్చట కొంతసేపు విశ్రమించినచో రామత్రయముయొక్క చరిత్ర మించుక తెలియగలదు.

" నేను సుమారెనిమిదేండ్ల క్రిందట నొకసర్కారుద్యోగమున నుండెడివాడను. నాకు నెల కిరువదిరూప్యము లిచ్చుచుండెడివారు. ఇట్లుండగా నొకగ్రామస్థుడు నాయధికారితో పనియుండి మేము మకాముచేసిన గ్రామ మరుదెంచెను. ఆతడు చాల భాగ్యవంతు డగుటచే యధికారికి బహుమానముగా నెన్నియో వస్తువులను దెచ్చెను. కారణాంతరములచే యాతడు తిన్నగా యధికారియొద్దకు బోక నాయొద్ద కరుదెంచి యధికారితో తనకార్యమును నివేదింపవలయు నని నన్ను బాధింపసాగెను. నేనదివఱకెన్నడు నధికారితో నెవ్వరికొరకును గలుగజేసికొనలేదు కావున నేనట్లు జేయనని నిరాకరించితిని. అత డెన్నియో విధముల బ్రయత్నించెను. కాని నేనందుల కొప్పుకొనక పోవుటచేత నాతడు నాయందు కోపముగలవాడై బంట్రోతులద్వారా యధికారితో తనపని చెప్పికొని నాతని దర్శించి లంచముగాని యిన్ని దినములవఱకును తనకార్యముదీర్పలేదనియు యిప్పుడాతనికై తెచ్చిన బహుమానము కావలెనని పట్టుపట్టెననియు నాపై లేనిపోని కొన్ని కల్లలను గల్పించి పితూరీ చేసెను. దానిపై నధికారి మండిపడి దర్యాప్తన మాయకనే నన్ను పనినుండి తొలగించితినని యుత్తరమంపెను. నేనూరిలోనికి బోయి యెచ్చటనో భోజనముచేసి సాయంకాలమైన

తర్వాత నధికారిని తిరిగి దర్శింపవలెనని యాతని మఠామునకు బోయితిని. కాని యాతడించుక సురాపానముచేసి యుండుటచే మత్తెక్కి నన్నుజూచి దొంగదొంగ యని చేతికర్రను విసిరి, బంట్రోతులను కేకవైచెను. నేను విధిలేక తిరిగి పోయితిని. అతి డాయుూరియందొక మూడురోజు లుండెను. నన్నీదుస్థితికి తీసికొనివచ్చిన యధికారికి నా విషయమును దిరిగి నివేదింపదలచుకొని యుంటిని కాని యీవార్త సమీపమున నున్న మాగ్రామమున దెలిసి నాకీలోకమున సర్వమునై యున్న వృద్ధురాలగు నాతల్లి గుండెపగిలి చనిపోయెనని యామూడవ నాటిరాత్రి నాకు దెలిసినది. దానికి గడువిచారించి నాయధికారిని, నాకీయవస్థదెచ్చిపెట్టిన గ్రామస్థుని దండించి నాకసి దీర్చికొనవలయు నని నిశ్చయించుకొని యారాత్రి నేను నాగ్రామమునకు జేరుటకు ముందే నేనందుల కారంభించితిని. రాత్రి యధికారిగృహముం బ్రవేశించి యాతని చందువపెట్టెనపహరించి యూరివెలుపలనున్న కాలువలో నూరద్రొక్కి నాయూరునకేగి నాతల్లి కంత్యసంస్కారముల నన్నియు దీర్చితిని. నేను పరువుగల కుటుంబములోనివాడను. ఇకముందే వృత్తిని యవలంబించి యిట్టి నీచులకు గర్వప్రాయశ్చిత్తము జేయవలయునని గట్టిగా జొరబడితిని. ఈచందువాపెట్టియం దాఫీసు కాగితము లెన్నిరూ యున్నవనియు ఇటీవల నాయధికారికి జీతము చాల తగ్గించిరనియు వినియుంటిని. ఇల్లు బ్రోద్ధమునైన తర్వాత నాకున్న యాస్తినంతయు పత్రమునకై యిచ్చివైచి యూయూరు విడిచి నాపై బితూరీచేసిన గృహస్థుని పీడింపవలయునని యాతని గ్రామమునుజేరితిని. ఆతడు మంచిస్థితిపరుడు. అతనియింట సుమారిరువది ముప్పదివేల రొఖ ముండెనని వినియుంటిని. అదియంతయు నింట భోషాణమునందుంచి యాతడందుపై పక్కవైచికొని పరుండునని వినియుంటిని. ఆతనియింట బ్రవేశించుట కొకనాలుగైదుదినములు తాచికొనియుంటిని. ఇట్లుండ

నొకనాడాతడు తన పెద్దకుమారుని యింటనుండి పొరుగూరేగెను. ఆరాత్రి నేనింటిపై పెంకులను దీసి చావడిగోసి యింట ప్రవేశించునప్పటికి నాకు గల్గిన యాశ్చర్యమేమని చెప్పగలను! నాకెదురుగా నొకమూల పండ్లికిలించుచు నీబలేరాముడు ప్రత్యక్షమాయెను. ఒకరిసంగతి నొకరు గ్రహించి సంజ్ఞలచే యావద్వృత్తాంతమును విశదపఱచుకొని యా భోషాణముపై బరుండినవానిని దింప క్రిందపరుపుతో నిడి భోషాణపు తాళమును మారుచెవులచే దెఱచి. పదియొక యైదుసంచులను దీసికొని యాతని మరల నాపరుపుతో భోషాణపుపెట్టెపై పరుండబెట్టి బలేరాముడు ప్రవేశించిన కన్నముగుండ వెల్వడితిమి. వెన్నెలలో మేము తెచ్చిన సంచులను దెఱచి చూడగా నందు సుమారుగా నిరువదియైదువేలరూప్యములు కిమ్మత్తుగల నాణెములును, కాగితములును గలవు. వానికి దగినశాస్తి జేసితిమని సంతసించికొని యిర్వురమును గలిసి బయలుదేరితిమి. నాకెచ్చటనుండుట కునికిలేక పోవుటచే నీరెండవవానితో గలిసియుండుట కవకాశముండునేమో యని యాతని వంశాదులను బృచ్ఛచేసితిని. అప్పు డాతడు తన పేరు బలేరాముడనియు, 'నా' యనువారెవ్వరును దనకు లేరనియు సుమారై దేండ్లనుండి యీ వృత్తిలో నుండియుంటి ననియు, నన్నుగూడ తనతో నుంచుకొనుట కభ్యంతరము లేదనియు జెప్పెను. నాడు మొదలు మే మిర్వురమును దొంగతనములను జేయుచు తెచ్చిన ధనమును బీదల కొఱకు వెచ్చించుచుంటిమి. ఆబలేరాముడే యీబలేరాముడు. ఈతడు చిన్నతనమున బడులందు ప్రారంభించిన పలుపుల్లలదొంగతనమే ప్రస్తుత మీతని యుత్కృష్టతకు సాధనమని యతడే చెప్పెను. తోడిబాలుర పుస్తకములను దొంగిలించినవా డిప్పుడును దానే యైనను చదువుకొనిన యెనిమిదేండ్లలో నొక్కనాడును పట్టుబడలేదట. పైగా నాదొంగతనము లితరులమీద నారోపింపబడుచుండెనట. ఇట్లు మేమిర్వురమునుగూడ క్రమముగా

కొంతకాలమున కొక పదిమందిని జేరదీసి యిండ్లలో ప్రవేశించుటతో పాటుగా బాటలను గాయనారంభించితిమి. ప్రచ్ఛన్నవేషములతో పగలూరూరు సంచరించుచు నుండి రాత్రులందు దొంగతనములను జేయుచుంటిమి. ఇట్లుండ నప్పుడు దూరములోని యగ్గిరామునిసంగతి నెవ్వరో చెప్పుకొనుచుండగా వినుచుంటిమి. కాని నాటివఱకును మేమాతని నెన్నడును జూచియుండలేదు. ఇట్లుండగా నొకనాటిరాత్రి గాఢాంధకారములో మేము ద్వారపూడినుండి రామచంద్రపురము పోవురోడ్డున గాచియుంటిమి నేనును బసేరాముఁడును మఱియొక్కఁడు నుంటిమి. రాత్రి 12 గంటలు దాటినతర్వాత నొంటియెద్దుబండి నెక్కి యెవ్వరో వచ్చుచున్నట్లు గ్రహించి జాగరూకులమైయుంటిమి. బండి మేమున్న తావును జేరెను. వెంటనే మేము ముగ్గురము నాబండిపయిబడి బండినాపినాము లోపలనుండి యెవ్వరో "బండియాపిన ముగ్గురిలో నిద్దరు బండిలో కూర్చుండవచ్చును. మూడవవాఁడు బండివానితోఁబాటు బండితోలవచ్చును. అగ్గిరామునకు బండితోలిన పరువు తక్కువకాదు" అని గంభీరముగా పలికెను. మాకు గుండెలు ఝల్లుమనెను వెనుకకు వచ్చి బండిలోనివానిని జూచి నిర్ఘాంత పడితిమి. అగ్గిరాముని పేరెక్కడ, యీబండిలోని సామాన్యదేహదార్ఢ్యముగల వీఁడెక్కడ నని యాశ్చర్యమునంది యట్టె నిలిచితిమి అంత నాతఁడు బండిదిగి "ఈబండిమీఁద వచ్చుచున్న మనుజుని కట్టి యొక పొలమున నుంచి యీబండిమీఁదనే నేను వచ్చుచున్నాను. సుమారు పదివేల రూప్యములను దీసికొని కొన్నపొలమునకు జెల్లించుట కాతఁడు రామచంద్రపురము వెళ్లునని నాకు నిన్ననే వార్త తెలియుటచే పెద్దాపురమునుండి యింతదూరము వచ్చితిని. నాతో డీకొనవలయునని మీకున్నయెడల రండు అనెను. మేము వెలవెలబోయి యాతనిచంకనున్న దుడ్డును, చేతనున్న పిస్తోలును, మొలనున్న కత్తినిజూచి "నీవు

నిజముగా నగ్గిరాముడవైన యెడల మేము నీకు భృత్యులమే!" అని యాతనివైపు చూడగా నాతడు నవ్వి "మీరింకను దొంగతనమున నారితేరవలయును. నాతో రండు" అనెను. మే మనుమానించుచుండగా నాతడు నన్నును బలేరాముని జూచి "మీరిద్దఱును నాతో రండు. ఈకుఱ్ఱవాని నింటికి పోయి రేపీవేళ కిచ్చట కింకెవ్వరైన నున్న వారితో రమ్మనుడు" అనెను. ఆతనియెదుట మేము చేయునదిలేక మాతోనున్న వాని నితరులతో మరుఁగడ్డాళ్లమున నుండవలయునని చెప్పి మేమాతనితో బోయితిమి. అత డాబండిని రామచంద్రపురము వఱకును దీసికొనిపోయి వానికొక పాలికహూప్యముల నిచ్చి పెట్టెను కాలువయొద్ద విప్పి యందున్న సయికము దీసికొని మాతో కూడ తన మకామునకు బయలుదేరెను. దారిలో దాతియాజ్ఞ చొప్పున మారువేషములను దాల్చి బండిచేయించుకొని యాతని వాసస్థానము జేరితిమి. అప్పటి కంతయు విశదమాయెను. ఆరాత్రి మాగుపులోనివారి నందఱను దీసికొనిరావలయునని నేనును నాతడును బయలుదేరితిమి. నాడు మొదలు నేటివరకును నెల్లరమును గలసియే యుంటిమి, ఇక ముందు భగవదేచ్ఛ యెట్లుండునో, క్రమముగా నందఱితోపాటా తడును నిద్రాదేవిముద్రలను నేత్రముల కద్దుకొని యాలోకమును మఱచెను.

11

తూర్పు తెల్లవారినతోడనే యెల్లరును నిద్రనుండి మేల్కొని, విధ్యుక్త కృత్యములను దీర్చికొని రాత్రి జరుపబోవు చర్యను గుఱించి చర్చింప నారంభించిరి. ఎల్లరును తత్పూర్వపు రాత్రియందు వినిన యంశములను గుఱించి నవ్వుకొనుచు, జరుపబోవు నాటకమునకు నాందీ ప్రస్తావనల విరచింప దొడగిరి.

ఈనాటికి తనపై ననుమానము సంపూర్ణముగ నంతరించినదని విశ్వనాథుడు ధృవపఱచుకొనెను. అగ్గిరాముడు వెనుక దొంగరామునితో చెప్పిన మాటలవలన గుంపులోనివారెల్లరును, వానితోగూడి మంతనము లొనర్చుచు, వానిసలహా నపేక్షించుచు, వానితో స్వేచ్ఛగా ప్రవర్తింప నారంభించిరి విశ్వనాథ మనిన దొంగరామునకును, బలేరామునకును నపరిమితమగు విశ్వాసమును, స్నేహమును గుదిరెను. కావుననే నాటిరాత్రి యాచరింపవలసిన కార్యమును గూర్చి, వారిద్దరును విశ్వనాథుడు చెప్పినచొప్పున నడచుకొనదలచి, యాతని చెంతజేరి మంతన మారంభించిరి. "అగ్గిరాముడు లేనప్పుడు మనకు విన్నన్న నాయకుడు; అతని యనుమతి లేనిదే గుంపులోని వారెవ్వరును నేకార్యమును జేయరాదు." అని దొంగరాముడావెనుకటి రాత్రియే గుంపులోని వారికెల్లరకు నెఱింగించెను. అందుచే, మిగిలినవారికి విన్నన్నయందు గౌరవమును భయమును గూడ జనించెను.

విన్నన్నా! అగ్గిరాముడు వచ్చునో రాడో నిశ్చయముగా తెలియదు. కావున కార్యభారమంతయు మనపై బడినది. మాలోనీవే యెక్కువ యనుభవశాలివి కాన నేడు సంపూర్ణాధిపత్యముతో నాయకత్వమును నేనొసగుచున్నాను కావున నేటిరాత్రివిషయమై నీయభిప్రాయమేమియో మాకెఱింగించినచో నీయాజ్ఞలను మేమెల్లరమును నెరవేర్ప సంసిద్ధులమై యుందుము" అని తానిదివఱ కనుభవించుచున్న నాయకత్వమును లేశమైన నసూయ జెందకుండ దొంగరాముడు విశ్వనాథునకు ధారవోసెను.

"అసలు సంగతులేమియో నేనెఱుంగను. అగ్గిరాముడు నీకు తప్ప మాకెవ్వరకు నెఱింగింపలేదు. కావున నాకు యావద్వృత్తాంతమును నెఱింగించినగాని, నేనేమియు జెప్పలేను అంతియే కాదు? నీనాయ

కర్తవ్యమును నీవేల విడువవలెను. నేనును నీమందలోని వాడనే యని తలంచుము. ”

అప్పుడు దొంగరాము ఈరాత్రి జరుగనున్న విషయమును గురించి, యిట్లు చెప్పదొడగెను. గుంపులోనివారెల్లరు సావధాన చిత్తులై వినుచుండిరి

“ ఈరాత్రి పదిగంటలకు జరుగవలసిన యీవిషయమునుగూర్చి చూచాయగా మీాకగ్గిరాము డిదివఱకే తెలిపియున్నాడు. ద్వారపూడికి నాలుగైదుమైళ్ళ దూరము నున్న రేయొక పల్లెటూరినుండి, రామచంద్రపురములో, రేపుదయమున జరుగబోవు పెండ్లికై పెండ్లివారు బయలు దేరుదురట. వారు రాత్రి 10 గంటలకుద్వారపూడివంతెనసమీాపములకు జేరుదురట. మనమచ్చటనే కాచియుండి మనపని నిర్వర్తించుకొనవలసిన దని మన కగ్గిరాము డిదివరకే తెలిపియున్నాడు. కాని వచ్చెడి మనుజు లెందఱో యాతడు చెప్పలేదు. ఆతని కెరుక లేదని చెప్పియున్నాడు. బహుశః యావద్వృత్తాంతమును తిరిగి తెలుపుటకై మధ్యాహ్నము లోపున తిరిగి యగ్గిరాముడువచ్చిన రావచ్చును. కాని నమ్మకములేదు. ఆతడు రానియెడల, మనలో నెవ్వడైనను ముందుగా నాగ్రామమునకేగి యచ్చట మనకు గావలసినయంశముల నెఱింగి వంతెనయొద్ద జేరియున్న యితరుల కెఱింగింపవలయును. వచ్చెడువారి సంఖ్య రూఢిగా మనకు తెలియదు కనుక మనదండంతయు నాప్రాంతములనే వేచియుండవల యును. లేనిపోని కొంటెపనులను జేయవలదని యగ్గిరాముడు గట్టిగా చెప్పినాడు ” ఈమాటలను విని బలేరాము డించుక యికిలించెను. “ ఇకిలించుటకాదు. ఈసారి యెవరైన నసలు పనిమాని కొంటెతనము నకు దిగినచో, కార్యము ధ్వంసమగుటయేకాక, తాను తగినట్లు బుద్ధి జెప్పెదనని యగ్గిరాముడు తీవ్రముగా జెప్పినాడు కావున పీఠాపురము

రోడ్డున జేసినట్లు చేయవలసినది శాసించితినని చెప్పినాడు. ఆపైన మీ యిష్టము. అగ్గిరాముని వ్యవహారమప్ మాత్రము మఱచిపోవలదు "—

"పిఠాపురము రోడ్డున నెవరేమి చేసినారు? కొంచెము నాకు గూడ నెఱింగింపరాదా?" అని విశ్వనాధము దొంగ రాముని గోరెను.

"అయికిలింపుల ఈరన్న నే యడిగిన చెప్పును చేసినవాడు చూచినవానికన్న సరిగా చెప్పగలుగును కదా?" బలేరాము డీమాట లనువిని నవ్వునాపుకొనలేక వీధిలోనికి బోయెను అప్పుడు దొంగరాము డిట్లు చెప్పెను

"మేమైదుగురము బయలుదేరి పిఠాపురపు రోడ్డున నొకబండి నాపి లోపలి సామానును మోసికొనిరావలయునని నాలుగుమానముల క్రిందట నొక రాత్రి కాచియుంటిమి. సాయంకాల మగునప్పటి కందఱ మును పర్వవరపురోడ్డున కొక మైలుదూరమున గాచియుంటిమి ఆరోజున నగ్గిరాముడు మాతో లేడు. కోరంగిలో నొకవర్తకుని యింట గన్న మువైచుటకై యాతడు పోయినాడు. ఆనాడు పిఠాపురము రోడ్డున మాకు దొరకెడువు లాభముకన్న నెక్కుడుగా లభించు నితరోద్యోగ ములున్నను, తానుకూడా మాతో లేనికారణమున సులువుగా తేలునని మమ్మాతడీ రోడ్డున నియమించెను ఇద్దఱు మనుష్యులు సుమారు నాలుగైదువేల రూప్యముల కిమ్మతుగల నగలను చిత్రాడదీసికొని పోవుటకై కాకినాడలో రాత్రి 8 గంటలకు బయలుదేరునని మాకు రూఢిగా దెలిసినది. బండికి గట్టినయెద్దు మాత్రము చాలచురుకైన దనియు వడిగా నడుచుననియు మాకు వర్తమానము దెలిసెను. మేమందఱమునుగూడి రోడ్డుప్రక్క పొలములో త్రాటిమొక్కలచాటున, నిసుకపై బరుండగా, బలేరాముఁడు నన్ను జేరి కొంతసేపేదియో లోకాభి రామాయణమును మాటలాడి తుదకు తానొక చిత్రము నాచరింప

వలయునని యుద్దేశమున్నదని చాలకాలము నుండి తన యభీష్టము నెర వేరలేదనియు, తానట్లుచేయుటకై యనుజ్ఞనీయవలయుననియు, నెంతయో కాలము బ్రతిమాలగా, ఏమోయనుకొని నేను సరేయని యొప్పుకొంటిని. మీ కార్యము సులభముగా నెరవేరుననియు, నా భారమంతయు దమదనియు నచ్చెప్పి, బలేరాముడు, మాయొద్దనున్న యగ్గిపెట్టెను బుచ్చుకొని, బయలుదేరి పోయెను. మేమెల్లరమచ్చటనే యుంటిమి. ఒక యరగంటలో నాతడు తిరిగివచ్చి, సర్వము సిద్ధముచేసితిననియు, ఆగిపోయిన బండిలోని వస్తువులను సులభముగా తీసికొనవలసినదనియు నాతడు మాతో చెప్పి, తిరిగి తనదారిని బోయెను. ఇంతలో రాత్రి 10 గంటలాయెను. మేమందఱమును లేచి, రోడ్డుప్రక్క నీడచాటున నిలిచి బండికై యెదురుచూచుచుంటిమి. కొలదికాలములో బండి మాకు చూపుమేర మాకగుపడెను. బండి వడివడిగా వచ్చుచుండెను. ఇంతలో నయ్యది మేముండిన స్థలమునకు కొంచెము నూరు గజముల దూరమునకు వచ్చునప్పటికి బండిపై నెచ్చటినుండియో యొకనిప్పులతో నిండినముంత విసరబడెను. అగ్నికణములు బండికప్పుపై చెదరి, యెద్దుపై గొన్ని పడెను. ఆపడినచప్పుడుచేనేమి, మీదబడిన నిప్పులబాధచేనేమి, ఆ యెద్దు దారితెన్నుగానక యొక్కబిగి నుడాయించి బండివానికైన నాపుటకు శక్యముకానిరీతిని పరుగెత్త నారంభించెను. ఆబండినాపుట కడ్డగించుచూ, మాకు మృత్యువు స్థిరమేయని యూహించి, మేమున్న స్థలమునుండి కదల కూరకొంటిమి. బండి అదేవిధముగ పరుగెత్తుకొని పోయెను. ఈనిప్పు లెచ్చటివని మేమాలోచించుచుండగనే యికిలించుచు బలేరాముడు మమ్ము వెదకికొనుచు మాస్థానము చేరెను. ఆనిప్పులను విసరినదివీడే, ఆనిప్పులు పడినంతనే నయ్యామని భయపడ, బండిలోని వారెల్లరు పారిపోవుదురనియు, నయాయాసము లేకుండ, బండిలోని వస్తువులు లభించుననియు; నాతని యభిప్రాయమట! ఆరాత్రి మేము

పెట్టినచీవాట్లొక భారతముండును. కాని అగ్గిరాము డాతని చెవిబట్టుకొని యిటునటు నూగించుచు, మరల నెన్నడు నిట్టిపనిజేయనని శపథము చేయించుకొనిన తర్వాత బలేరాముని మొగము చూచితీరవలసినదే. దీనికేమి కాని, నీవు ముందుజరుగబోవు విషయమై యేమి యాలోచించితివో చెప్పవలయును" అని దొంగరాముడు విశ్వనాథము భుజము దట్టుచు బల్కెను.

"చెప్పుట కేమున్నది? ముందుగా నెవ్వరైన నా గ్రామముజేరి యావద్వృత్తాంతము నెఱింగి రావలయును కదా యగ్గిరాముని యుద్దేశము? మధ్యాహ్నము వఱకును జూచి యింతవఱకు రాని యెడల, నెవరో యొకరు బయలుదేరుటయే యుంచిది" అని విశ్వనాధ మనెను.

"ఎవరో యననేల? కూపమందు నుండుట యేమి నిన్ను ప్రయోగింపవలయునని యగ్గిరాముడు నీతోచెప్పి యున్నాడు కదా? మధ్యాహ్నము నీవంటయు భోజనమునైన తర్వాత నీవే బయలుదేరి పోవలయును?"

"సరే, మీయందఱి యుద్దేశమట్లైన నాకభ్యంతర మెంతమాత్రమును లేదు. ఎన్నిదినముల నుండియో నిక్కసంగతి నడుగ దలంచితినికాని, మఱచుచునే యున్నాను. ఇప్పుడు జ్ఞప్తికి వచ్చినది. మీరిచ్చట నగ్గిరాముడింకొక చోట నుండుటకు గారణమేమి? ఇదివఱ కందఱు నొక్కచోటనే నివసించుచుండిరని వాడుకగదా! ఎప్పటి నుండి యిట్లు విడిపోయినారు?"

ఆ మాటలువిని బలేరాముడు లోనికరుదెంచి ఆమాట నన్నడిగిన సరిగా చెప్పగలను ఏలయందువా, కోటిఫలిలో నొకనాడు మేమైదారుగురము పగటివేషము లాడుచుండగా దొంగరాముడు నెఱింగిన వాడెవ్వడో వానిని గుర్తించి, మానాటకపటము లితడట్లు చేయుచుండెనని, కొంతకాలమైన తర్వాతగాని, మేము గుర్తింపలేక పోయితిమి

మ్మాకా విషయము తెలిసిన వెంటనే కోటిఫలినుండి బయలుదేరితిమి. ఆతడు మావెంటబడెను. అతని కోటికి రెండు దినములారూర త్రిప్పితిమి. చివరకీ పిడప రిజేరుసరి కాతడు పసిగి తనదారి బట్టెను. ఇచ్చట యదృచ్ఛగా నీకొంప లభించినది నేను వీరి కాతనిచర్య జెప్పకుంటినేని, ఈపాటి కెల్లరము చక్రవర్తి యాతిథ్యమనుభవించుచునే యుండి యుందుము" అని యాతడు స్వల్పసంల్పత బ్రకటించెను. కొంతకాలమున కెల్లరును వంటప్రయత్నముల నారంభించిరి

12

సూర్యుడు గగనోపరిభాగము నలంకరించెను. కాని శీతకాలమగుటచే నాతని తీక్ష్ణత నెవ్వరు భరింపజాలకుండుటలేదు గుంపులోని వారెల్లరును భోజనములనుజేసి యగ్గిరాము డరుదెంచునేమో యని నిరీక్షించుచుండిరి. వేళదప్పని యగ్గిరాము డాదినమున వచ్చెదనన్న వేళకు రాకుండుటచే నిక రాడని వారెల్లరు నిశ్చయించుకొనిరి.

"విస్సన్నా ! ఊరికే కాలక్షేపము చేయుచుండుటకు ? ఇక నాతడుదినమునకు రాడని నిశ్చయించుకొనవలసినదే నీవు త్వరగా బయలుదేరి నీపనిపై బోవలయును" అని దొంగరాము డాతని లేవదీసి దూరముగా దీసికొనిపోయి సుమారొక పదిహేను నిమిషముల వరకును గుసగుసలాడి యాతని బంపివైచెను. విశ్వనాథము తనకు గావలసిన సాధన సామగ్రినంతయు దీసికొని బయలుదేరి తనదారి నేగుచు నట్లు దలపోయ నారంభించెను.

"నేటికి నెల్లరిలోను నాకొక నమ్మకము తరినదని నేను సంతోషించుచుంటినే గాని పిరికియట్లుగడ యెట్టిదియో నేనెఱుగ లేకున్నాను. వారు నాకు సకల స్వాతంత్ర్యములు నిచ్చినేయుటజూచి యింకను నాచరిత్ర ... పట్టినయనది వారియుద్దేశ మనట్లనుమానమొది

యుంచుచున్నది కావున జాగరూకతనే యుండుటయే మేలు. ఈ జట్టులో నగ్గిరాముడవినను నాకు భయములేదు. కాని దొంగరాముని చర్యలనుజూచిన నాతని నొకకంట జూచుచునేయుండినగాని మోసము గలుగగలదని నాకు స్ఫురించుచున్నది. ఈనాడీతడు నన్నీకార్యమున నియోగించినాడని నాయిష్టమువచ్చినట్లు జేయుటకు వీలులేదు మూడు వంతులు దొంగరాముడు నావెనుక నాజాడదీయుచు రాగలడని తోచుచున్నది. ఏదెట్లయిన నీరాత్రిజరుగబోవు దొంగతనము నాపివేయ వలయును. తగిన యుపాయ మేదైన యాలోచించి దానిన కెఱిగింప వలయును. అగ్గిరాముడు వీరితో తిరుగుచు వేరుగా నివసించుచుండు టకు కారణముకానరాదు అతని నివాసస్థల మెచ్చటనో ముందెఱింగిన గాని నేను వీరితో జేరియుండిన కార్యములేదు. వీరల నెచ్చటనైనను సులభముగా బంధింపవచ్చును కాని, యగ్గిరాముడు దొరకకపోయిన యెడల వాడు తిరిగి గుంపును జేరదీసి మునుపటికన్న విచ్చలవిడిగా సంచరింపగలడు. 'రామో, రామేతి, రామేతి, అని దశావతార పురుషునితో సమమైన నామమును దాల్చినవీరు నిజముగా చోరచక్రవర్తి యవతారములే. వీరి లోకానుభవము, భాషారచయును సాధారణ సంసారుల కుండజాలవు, అందులో దొంగరాము డొకజిల్లా కధికారము నొంది పాలింపదగిన శక్తిసామర్థ్యాదులు గలవాడు వానితో మాట్లాడుటయే జ్ఞానోదయమునకు సాధనమని వేరుగా వచింపనక్కరలేదు. అక్కటా! లంచగొండి యగునధికారి నిరాదరణముచేతను, మూర్ఖతచేతనుగదా యీతడు దొంగయయ్యెను. లేనిచో నీత డెట్టిదశలో నుండెడివాడో ఎవ్వరు చెప్పగలరు? ఇదివరకు నేను శోధించిన వ్యవహారము లన్నిటిలో నిది కడుచిత్రముగా నున్నది. నాకండ్లయెదుట వీరొనర్చిన దొంగతనములలో నెచ్చటను దౌర్జన్యమును వీరొనర్ప యత్నించలేదు, వారియుద్దేశములుగూడ నట్టివి కావని స్పష్టపడు

చున్నది. మనదేశమునందింతవఱకెచ్చటను నేనిట్టియుదారహృదయు లగుచోరులను గనియెఱుంగను—ఈ రాత్రి జరుగబోవు దొంగతనము నెట్లయిన నాపివేయవలయును ఒకవేళ నావెంట నెవ్వరైన నంటివచ్చి నను నేను దానుతో నెట్లయిన మాటలాడితీరవలయును.

విశ్వనాథ మనేకమాయోపాయములచే నెవ్వరైన తనవెంట వచ్చుచున్నారేమో యని కనుగొన యత్నించెను. కాని, యాతనికట్టి యనుమానమే లేకపోయెను. ఆతనివేషము నించుక వర్ణింపవలయును. అతడు ముతకపంచె నొకదానిని ధరించి నల్లనిచారలుగల ఎఱ్ఱనిషర్టును దొడిగికొనియుండెను. ముఖమున సాతానులవలె నామముండెను. తలపై నొకపెద్ద యంగవస్త్రము తలపాగవలె చుట్టబడియుండెను. పాదములకు కిర్రుచెప్పులజోడు దొడిగికొనియుండెను. ఆతడొక 40 లేక 50 పుస్తకములు (పాటలువర్గాలు) గలపుస్తకముల కట్టగట్టి తన కుడిచేత బట్టుకొని యెడమచేతియందొక కర్రను (లోపల కత్తి యమర్చబడినదాని) పట్టుకొనెను. మొలలో నాతని పిస్తోలుండెను. పాటలపుస్తకములమ్ము నొకసాతానివలె నాతడుండెను. ఆడుచు పాడుచు నతడు మూడు గంటలకు ద్వారపూడిపత్రముజేరి యింటుకనే పరుగుపై ప్రవేశించెను. ఆప్రక్కగదిలో దాసేదియో యొక గ్రంధమును బిగ్గరగా చదువుచుండెను. విశ్వనాథము చిరునగవుతో వినుచుండెను.

"కపినాథుండవు నీవు, రాఘవుఁడనంగా దాపనుండానురా
ధిపు ముప్పేర్చియగొన్న రాక్షసకులాధీశుండనే, నిన్ను ని
క్కపు దోబుట్టువుగా మదిందలతు, నక్కాంబైన నాతోనపాం
దుపడున్ గావున, యేగుమీవెడగు మర్త్యుంబాసికిష్కింధకున్"

వీధియరుగుపై నుండి విశ్వనాథము, 'గావణబ్రహ్మ! తలుపు దీయుము" అనెను

ఉత్తరక్షణమున దాసు గదితలుపు దీసెను. విశ్వనాథము నలు దిక్కుల జాగ్రతగా పరిశీలించి; తన బట్ట చెంగున జాగ్రతగా కట్టుకొని యున్న యుత్తరమునువిప్పి, మూతవిప్పి, “ఇంకొక యరగంటలో నీదారినేరమ్ము నీకై కనిపెట్టుకొని యుందును. మాటలాడవలసిన యవసరమున్నది” అనిలేచి యుంచుక మంగళతీర్థము నడిగిపుచ్చుకొని త్రాగి తనదారి నేగెను.

దాసింటిలోని కేగి యాయుత్తరము నొకసారి చదువుకొని, జాగ్రతగా పొందుపఱచి, తనచేతి పెట్టెను గైకొని, విశ్వనాథమేగిన దారి నేగవలయునని, తలుపునకు బీగము వేసి, బయలుదేరెను. నాలుగు గంటల కిద్దరు నొక నిజన ప్రదేశమున గలిసికొనిరి. వారికి క్రింది సంభాషణము జరిగెను.

“నేను నీతో విశేషకాలము మాటలాడుట కవకాశము లేదు. నీవుదయముననే బయలుదేరి, కాకినాడకు బోయి, సుబ్బారావుగారితో నాయుత్తరములో నేను వ్రాసిన రీతినంతయు సిద్ధముజేసికొని, నేనేర్పఱచినచోట నుండవలయుననియు, నేను తరములో వ్రాసినరీతినే మెలగవలయుననియు గట్టిగా జెప్పి నీవుకూడ వారితో నచ్చుటకు రావలయును నీవేమాత్రము మాటతప్ప మొనర్చినను గార్యమంతయు జెడిపోవగలదు. నీవీరాత్రి యొక విచిత్రమునాచరింపవలసియున్నది నీదిపిరికి గుండెయా? లేక నిర్దిష్టకృత్యము నాచరింప సమర్థుడవా?”

“నాసంగతి సుమారు పదిసంవత్సరములనుండి నీవెఱుంగుదువు కదా? నేను పిరికి వాడనో కానో నీవెఱుంగవా? చేయవలసినదేదియో చెప్పుము నాశక్తికొలది నాచరింప బ్రయత్నించెదను. అనుమానింపకుము.”

“అట్లయిన నీకిటనే జేయవలయును.” అవిశ్వనాథమాతనితో నేడెనిమిది నిమిషములవరకు నూరకు వినబడనట్లు రహస్యముగ మాటలాడెను. దాసు తృప్తి జెందెను.

"అట్లయిన నేనిక నాలస్యముచేసిన ప్రయోజనము లేదు. నీపెట్టెలోనున్న ధనము దీసికొని నాకవసరమైనంత వెచ్చించెదను" అని దాసు లేచెను.

"పొరబాటు వచ్చిన కొంపలంటికొనును. జాగ్రత. నేను బోయెదను" అని విశ్వనాథము బయలుదేరి తానేగదలచిన పల్లెటూరు సాయంకాలము కాకుండగనే జేరెను అతిడాయూర చీకటి పడువరకును సంచరించి సాధ్యమగు వర్తమానమునంతయు సేకరించి తిరిగి రాత్రి 8½ లేక 9 గంటలగునప్పటికి ద్వారపూడి కేతెంచి సత్రమును దాటుచు, "తస్మాత్ జాగ్రత జాగ్రత" అని దాసునకు బరాకు జెప్పి సంకేత స్థానమును చేరెను. ఇంకొక పదినిముషములకు దొంగరాముడు గుంపులోని మిగిలినవారునేతెంచిరి. వీరెల్లరును సంతెనడిగిన నూరు గజములలోనున్న పిల్లకాలువగట్టున విశ్రమించిరి విశ్వనాథము తాను గ్రహించిన యంశములను గుంపులోని వారికెరిగింపజొచ్చెను. పురుషులారుగురు మాత్రమేయున్నారనియు, మొత్తమైదుబండ్లు బయలుదేరుచున్నవనియు, నున్నపురుషులంత బలాఢ్యులవలె నగుపడలేదనియు నింకొక యరగంటలో బండ్లురాగలవనియు, వారలాతని వలన నెరిగిన తర్వాత వారి యుత్సాహమునకు మేరలేదు. అగ్గిరాముడు సమయమునకు రాకూడదాయని వారు తలంచుచుండవచ్చును రాత్రి పదిగంటలాయెను. బండ్లిక వచ్చువేళ యైనదని ఎల్లరును వేచి జాగరూకులై రోడ్డుప్రక్క చెట్లమరుగున నిల్చియుండిరి. దొంగరాముడు ఛాయవలె నొకరిని విడిచి యొకరిని జేరుచు, నించుక కాలమేదియో ప్రసంగించి పోవుచుండెను. అవసరమైన యెడల కత్తులను దీసికొని వారలను బెదరింప వలయునని కూడ గుంపు వారలకారాత్రి యాజ్ఞయొసగబడెను. వారిలో నెవ్వడును చొక్కాలను గాని మోకాలుదిగిన దుస్తునుగాని ధరించి యుండలేదు అందరును వైష్ణవసూచకమగు నామములను

ధరించియుండిరి. చేతులందు కత్తులమర్చబడిన కర్రలు మాత్రముండెను. బండ్లు సంకేతస్థలమును జేరెను

గుంపంతయు నొకపెట్టున బండ్లపైబడి బండ్లవాండ్ర నీవలకు లాగివయిచిరి. వారొనర్చినగోలచే, బండ్లలోని వాండ్రందఱు నొక్కపెట్టున "దొంగలు! దొంగలు!" అని కేకలువైచిరి. "గొంతుకలు నొక్కవలయునా, నోరుమూసికొని యూరకుందురా?" అని విశ్వనాథ మొకసారి గర్జించెను. ఆకత్తులను జూచి బండ్లలోని పెండ్లివారికి దేహములు కంపింపసాగెను. ఒకరొక్కరే, బండ్లలోనుండి దిగి, క్రింద నిలువబడ నారంభించిరి. అప్పుడొక యద్భుతము జరిగెను. కాలువలో నుండి పుట్టినరీతి నదివఱకు వంతెనక్రింద దాగియున్న కొందఱు మనుష్యులొకకాగడాను వెలిగించుకొని, రోడ్డునెక్కుచు, "పట్టుకొనుడు, పట్టుకొనుడు వచ్చుచున్నాము! వచ్చుచున్నాము!" అనికేకలు వెట్టుచు నావైపు డప్పులు వాయించుకొనుచు పరుగెత్తిరి. ఈ విచిత్రమును జూచి, దొంగలొకటిరెండు తెప్పపాటులకాల మట్లేనిలిచి యొకరిమొగము నొకరుజూచికొని, యొక్కపెట్టున పొలములలోబడి పారిపోజొచ్చిరి. ఈవచ్చినవారు నారాయణదాసును, ఆతడారాత్రికిజీతమిచ్చి చేరదీసిన, చాకళ్ళును, మాదిగలే! వారాబండ్లనుజేరి, రాత్రికి వెనుకకు మరలి ద్వారపూడి సత్రమున, ముకాముజేసి, తెల్లవారు ఝామునసే బయలుదేరవచ్చునని నచ్చజెప్పి, వారలను సత్రము వఱకును దీసికొని వచ్చి, ఎవరి దారిని వారేగిరి, దాసు సత్రమున తనగది బ్రవేశించెను.

13

ఆరాత్రి యగ్గిరాము నగుంపులో గలియకుండుట కొకహేతు వుండెను. ఆతడాయుదయమున కలెక్టరును దర్శించి, మారువేషమున రైలుపై కాకినాడకేగి యచటనొక విచిత్రమగు వ్యవహారమును పరి

శోధించుచుండెను. ఆతడా రాత్రి యీగుంపులో నుండియున్న యెడల, గుంపులోనివారల్లు హడావిడిగా పరుగెత్తికొనిపోవుట కవకాశముండి యుండునా? బండ్లలోనివా రదివఱకే భయగ్రస్తులై యుండిరి కాన యాతఁడు ముందుగా నాసచ్చినవారిపై నురికి వారిని పారద్రోలి యనంతరము తనకార్యమును నెరవేర్చికొని యుండును. ఆమాటనే గుంపులోని వారలకు నిర్భయముగా విశ్వనాథము పదేశించుచుండెను. ఆమరునాడు దయమున వెలవెలబారిన మోములతో నెల్లరును నిద్రమేల్కాంచి రాత్రి జరిగినవిషయమును గుఱించి చర్చించుచునప్పుడు, బలేరాముడు, కలలో కూడ మనస్సు వాగాతుగా నెందఱో మనుష్యులు దండెత్తుదురని మనమనుకొననియప్పుడు వారిదర్శనమైన వెంటనే మనమనుమాన ముదయించును, వెంటనే మనదారిని మనముపోవుటయు సహజమేకద?” అని వచించుటచే, విశ్వనాథ శాంతవాక్యములు సాగక పునరుదుట నుపదేశించుట కవకాశము తొలగెను.

“మనము కష్టకాలమున పసిబాలకునివలె హీనముగా ప్రవర్తించితిమి, అగ్గిరాముడే మనతోనుండిన యెడల, మనమంత తొందరపడ వలసిన యవసరముండెడిది కాదు. వెనుకముందుల నాలోచింపక, మనము రాబోవులాభమును మఱచి, నాడు బలేరాముడు చేసిన చిత్రమున కెద్దులు పరుగెత్తుకొనిపోయినవో అట్టి కాలములో జారవిడిచితిమి. ఆ వచ్చినవారు బహుశః బండ్లలోనిసరకులను దుముగులేయుండవచ్చును. వారు బస్తీకి చుక దూరమైన నావనస్థానము వంకకు డుగా వచ్చుచుండిరేమో? దారిలో దొంగభయమే మైనఁ గలిగిన యెడల, నాదొంగలను భయపెట్టుటకు జేయుట కిపుడు గడ బయలుదేరియుందురు. అది మనము కానలేక వారలవలలో చిక్కితిమి. ఇంతమాత్రమునకే చింపజాలని మనమేరీతి నీవృత్తియందు గడితేరగలము? నేనెంతో చాలకున్నాను. నేనిట్లంటినని మీకునాపై కోపము కలుగునేమో?

నేను యథార్థముగా నాహృదయమున దోచినమాటల జెప్పుచుంటిని. నీ యభిప్రాయమేమి ?" అని యాతడు దొంగరాముని బ్రశ్నించెను.

"విన్నన్నా ! నీవుచెప్పినదంతయు నిజమే ! నిష్కారణముగ మోసము నొందితిమి. ఇకమీద నిదియొక యనుభవముగా జూచుకొన వలయును. ఇన్నిదినములనుండియు, దొంగతనమున మనమార్జించిన కీర్తియు, ననుభవమును నిన్నరాత్రి ద్వారకపురీ కాలువలో కలిపితిమి" అని యాతడు విషాదహృదయుడై పలికెను.

"ఇంతమాత్రమున కేల విచారింపవలయును? పెండ్లినలుపుట కై యుంచిన ముహూర్త బలిమిచే పెండ్లివారిక పక్షము రాలేదని యనుకొందము. ఇది మనకొక మంచియనుభవముగా నుండగలదు" అని విశ్వనాథము ధైర్యము చెప్పెను.

ఇంతలో నాపేటలోని మాలలు కొందరు దొంగరామునితో పనియుండి వచ్చుటచే నీప్రసంగమాగిపోయెను. దొంగరాము డావల కేగి, వారితో కొంతవడి కేమేమియో ప్రసంగించి తిరిగి యింటిలోని కరుడెంచి కొంతధనమును దీసికొనిపోయి వాండ్రకు బంచిపెట్టెను. వాండ్రును తమదారినేగిరి. గుంపులోని వారెల్లరును వంటప్రయత్న ములు చేయనారంభించిరి.

ఆమధ్యాహ్న మగ్గిరాముడు మారువేషమున రైలుపై కాకినాడ కేగెనని చెప్పియుంటిమి. ఆతడాయూర నొక యద్భుతమగు పరిశోధన జేయుటకై యేగియుండెను. ఆయూర నొకభాగ్యవంతుడగు తెలగకులస్థు డొకడుండెను. ఆతడు వ్యాపారమున నుమారునాలుగై దు లక్షలరూప్యముల విలువగల యాస్తినార్జించెను. ఆయూరనే వ్యాపా రము విరివిగా జేయుచుండుటచే నాలకచ్చుట నొక దివ్యమైన భవనమును నిర్మించుకొని యందు తనభార్యతో వసించుచుండెను. ఇట్లుండగా

నాత డగ్గిరాముడా యూరుజేరిన రెండురోజులకు బూర్వ ముదయముననే పోలీసువారికొక కింటెకథను దెలిపెను. తనకులస్థుడైన యొకడు తన భార్యను లేవదీసికొని వెనుకటిరాత్రి చెన్నపట్టణమువైపు లేచిపోయె ననియు, తన భార్య సుమారిరువదివేలరూప్యములుగల నగలతోడను కొంత రొఖముతోడను పోయెననియు నాతడుచెప్పి, వారిని బంధిం చుటకై చెన్నపట్నము టెలిగ్రాము నంపించెను. ఆసాయంకాలమాతని భార్య బంధుగులయింట పెండ్లిజూచుట కేగుదునని మిద్దెపై నిల్లువెడలె ననియు, రాత్రి ప్రొద్దుపోయిన తర్వాత నామె తిరిగివచ్చునేమోయని, యాతడూహించి నిద్రించెననియు నుదయముననే చామర్లకోటకేగిన తనబంట్రోతు రుదెంచి, తానామె నింకొకనితో నారాత్రి 11 గంటలకు చామర్లకోటలో రైలులో చూచితిననియు నిదివఱకట్టి యుద్దేశమున్న దని తానను మానించుచున్న పురుషుడారాత్రి చెన్నపట్నము వైపేగె ననియు నాతనికథ. ఆపురుషుడొంటరిగా నెల్లూరుస్టేషనున దిగెనని పరిమానము తెలిసినదేకాని వానిజాడకాని యామెజాడకాని పోలీసు వారు కనిపెట్టలేకపోయిరి. ఈయుపాయము నాతఁ డగ్గిరాముడు దవ్వుట కేగెను.

ఇదివఱకు కొలది దినములక్రిందట నొకరాత్రి యగ్గిరాముడాగృ హమున బ్రవేశించి, దొంగితనము జేయదలంచియుండగా, నారాత్రి భార్యాభర్తలకు జరిగిన వివాదమంతవఱకు జరిగెనో యాతడెఱుంగును ఇకనారాత్రి తనపనినెరవేరలేదని నిరాశజెంది యాతడాగృహమును విడిచిపెట్టెను. తన కిప్పుడు తాను వినిన ప్రసంగమువలన నేడయామె యను మానము కలిగిన నాతడాయింట దిరిగి ప్రవేశింపదలచెను. రాత్రి పది గంటలకు పైని యతఁ డాయింటిచుట్టు బజారుచేయుచు, బంట్రోతు రాత్రి నిద్రించుచుండగా నురుపెంచినప్పుడు దొడ్డితలుపులో నాలుగు ... సందట నిరీక్షించుకొని, వీధితలుపు

దగ్గరగా పెట్టి, ఆ పక్షణముననే గాలినిపట్టుకొనిపోయెను." మాటాడ యత్నించుచుంటివేని నీ ప్రాణములపై యాశ విసర్జించుకొనవచ్చును." అని ఆతఁడా బంట్రోతును కెటిఁగించియుండుటచే నాతఁడు మిక్కిలి బలుపులేక పిల్లి వలె నూరకుండెను. నాఁటి నుండి యా జనపదదేశము కేల్చుకొనిపోయి, యగ్గి రాముఁ డిరీతిగా ప్రసంగించెను.

"నేనెవ్వఁడనో యెఱుఁగుదువా? సన్నిధికాఁ బడకు నెన్నఁడును జూచి యుండకపోయినను నా పేరయిన వినియుందువు. నా పేరు అగ్గిరాము డందురు. నేనడిగిన ప్రశ్నలకు సరియగు సమాధాన మిచ్చెదవేని, నీకు బహుమాన మిచ్చెదను. అబద్ధములగు నుత్తరము లిచ్చెదవేని తత్క్షణమే నిన్నొకనబడుచున్న యుప్పుకొటియందు దూరద్రొక్కెదను. నీ చావు బ్రతుకులు నాచేతి యందున్నవి. కావున నీయభిప్రాయమును వెంటనే చెప్పవలయును. ఆలస్యమయినచో నేఁ దలఁచిన కార్యము చెడిపోవును. నీమర్యాదయును నీకు దక్కదు. ఏమందువు? "అడుగుఁడు నిజమే చెప్పెదను" అని దీనముగా నాబంట్రోతు వేడికొనెను.

"అడ్డగిడ్డమగు సమాధానము లిచ్చినను ఏవిధమయిన పెంకె తనము జేసినను నీ మానప్రాణములు నిలుగావు. నీవు నిజముగా నీ యజమానురాలిని చామర్లకోటలో రైలులో చూచితివా లేక నీయజమానునివలన లంచము దిని యాతఁడాడుమనిన మాటనే యాడుచుంటివా? నాకీ వ్యవహారమున యదార్థము తెలియుట కవకాశమున్న దని యెఱిఁగి జవాబునిమ్ము"

"నేను నాపనిమీద చామర్లకోట కేగినమాట వాస్తవమే. నేను రైలుకై వచ్చినప్పు డచ్చట నిలిచియున్న యింకొకరైలులో నామెను చూచినమాటయు వాస్తవమే."

అగ్గిరాముడందులకు సమాధానముగా తన చంకయందున్న దుడ్డును జూపించుచు "నీదేహమునయున్న ఎముకలన్నియు పొడిచేయ వలయును కాబోలు! నీముఖమునుజూచిన నీచెప్పినమాట లన్నియు నబద్ధములని వేరుగా వచింపనవసరములేదు" అని తని చేతిముడుకు లపై తన దుడ్డుతో నొకటిరెండు దెబ్బలుకొట్టెను ఆతడరచుటకయి యత్నింప, "కేకలు పెట్టినచో పీకనులిమి యుప్పుటేరున నూగద్రొక్కెదను. జాగ్రత" అని బెదరించెను. ఇక తప్పుకొనుటకు మార్గములేక బంట్రోతు దీనస్వరముతో నిట్లు చెప్పనారంభించెను. "నే నాదినమున చామర్లకోట నాయజమాని పంపగా నేగితిని. నాయజమానురాలు రయిలులో నాకెందును నగుపడలేదు. యజమాని నన్నట్లు సాక్ష్యమిమ్మని నిర్బంధించుటచే నేనట్లు చెప్పవలసి వచ్చెను. నేనేపాపకర్మ మెరుగను."

"నీయజమానురాలేమయినదని నీయుద్దేశ్యము" అని అగ్గిరాము డిరువదిరూప్యముల వానిచేతినుంచెను. దానికాతడు సంతుష్టుడయి అయ్యా! నాకావిషయమేమియును తెలియదు. నాకనుమాన మేమియును లేదు" అని పల్కెను.

"నీవింట బంట్రోతుగా నుంటివికదా? భార్యాభర్తలకు సంబంధ మెట్లుండెడిది?"

"దినదినము నిరువురును నేదియో యొకవిషయమై తగవులాడు చునే యుండుట స్వభావము."

"మీయజమాను డిప్పుడెట్టిస్థితిలో నున్నవాడో సరిగా చెప్పిన నింకొక పదిరూప్యము లిచ్చెదను. నాతో సనత్యము చెప్పకుంటివేని నీకింకను లాభము రాగలదు."

"పగలాతం డీవలకరుదెంచుటలేదు. ఇంటియందే కాలుకాలిన పిల్లివలె నిటునటు నూరక తిరుగుచుండును. ఇనుపపెట్టెయున్న గది మాత్ర మెప్పుడును, విడిచి యుండుటలేదు. తన్నెవరయిన జూడ నరుదెంచినను దర్శనమిచ్చుటలేదు."

"నేను తిరిగి నీకొఱకరుదెంచి, నీకట్టను పిప్పువఱకును నీవిచ్చటనే యుందుము" అని అగ్గిరాముడాతని త్రాళ్ళతో గట్టిగా బంధించి నోట గుడ్డలుక్రుక్కి, సందులో నొకమూరుమూల జాగ్రతగా వెదకినను కనబడనిరీతిని బడవైచి తానేగెను.

ఇంకొక రెండు నిముషములలో నాతిడాగృహమును ప్రవేశించి, ద్వారము బంధించి, బంట్రోతుకై మేడపై నుండి అదేపనిగా పిలుచుచున్న యజమానిగదిలో ప్రవేశించెను.

ఈవిగ్రహమును జూచి యజమాని నిశ్చేష్టితుడై యాతనిదెస వెఱ్ఱివానివలె జూడజొచ్చెను. అగ్గిరాముడు గడపపై నుండి, కదలక ట్లే నిల్చియుండెను. కొంతకాలమునకు యజమాని ధైర్యము దెచ్చికొని, కించిద్గద్గదస్వరముతో "ఎవరునీవు? ఎందులకై వచ్చితివి" అని ప్రశ్నించెను. అగ్గిరాముడు నవ్వుచు గడపదాటి లోనికేగి, వెనుదిరుగక యే ద్వారమును బంధించి, చంకనున్న దుడ్డును చేతబట్టుకొని, యజమానిపై వుజూచెను. యజమాని దేహమంతయు గంపించుచుండెను. నోటిమాటరాక తుదకాతడు గట్టిగా వెఱ్ఱివానివలె, "వీరిగా వీరిగా!" అని బంట్రోతును కేకవైచెను. అగ్గిరాముడు దుడ్డునెత్తి మరల నా రీతిని గేకలు పెట్టితివేని, వీరిగాడున్నచోటును నీకీదుడ్డు చూపించ గలదు. అనెను,

ఆగృహాధిపతి యవస్థవర్ణింపనేరితరము? అర్ధరాత్రివేళ నవ్యవస్థత గల చిత్తముతో బాధపడుచున్న నాతనిమెదుట నకస్మాత్తుగా వృథ

గాత్రుడగు నొకపరిచయములేని పురుషుడుచేతికి నరియగు దుడ్డుతో ప్రత్యక్షమైనప్పుడితర సాహాయ్యమేమియును లభించుట కవకాశములేని యాతనిమరవస్థ యెంతని వ్రాయగలము. ఆతని పంచప్రాణములను నొక్కపట్టి యాతని నేత్రద్వారముగుండ బయల్వెడల యత్నించునో యను నట్లాతడు తదేకదృష్టితో సాక్షాత్కరించి చోరచక్రవర్తిని జూచు చుండెను ఇట్లయిదు నిమిషములైన తర్వాత నగ్గిరాముడాతనిగూర్చుం డనియమించెను యజమానియు మారుమాటాడక చెంతనున్న ఆసన మునందు గూలబడెను. అగ్గిరాముడు సంపూర్ణవిజయము గాంచెనను టకు సందియములేదు ఆత డధికారముతో ప్రసంగింప నారంభించెను.

"పోలీసువారి కన్నులను గప్పినను నాకన్నులు గప్పలేవు. నేను సర్వాంతర్యామిని నాపే రగ్గిరాము డందురు ఇది నీయింటికి నా రెండవరాక. మొదటిపర్యాయ మరుదెంచినప్పుడు నీభార్యను భయ పెట్టుచుంటివి. నే నరుదెంచినపని నెరవేరినదికాదు. నేను తిరిగి దర్శన మిచ్చితిని. నీభార్య నేమిచేసితివి? యదార్థ మెఱిగింపుము. కాల యాపనజేసిన కాదు నీకు రెండునిమిషముల గడువు నిచ్చుచున్నాను." అని యగ్గిరాము డాతనివైపు తీక్షణదృష్టులను బరపుచు తలుపునకు జేరగిలబడి నిల్చియుండెను.

యజమానిమొగమున నెత్తురు, మచ్చునకైన గనబడుటలేదు. ఆత డధోవదనుడై దీర్ఘచింతాసముద్రమున మునిగియుండెను. అగ్గిరాము డిచ్చిన రెండునిమిషములు గడువు దాటిపోయెను. అగ్గిరాము డాతనిని సమీపించి భుజముపై జేయివైచి లేవదీసెను. "సమాధాన మీయవా? నీయిచ్చవచ్చినట్లు—ఇంతలో నాయజమాని యొక స్నాతుగా నగ్గిరామునిపై బడి యాతని చేతిలోని దుడ్డును లాగికొన యత్నించెను. ఆతని లొంగదీసి నేలపై బడవైచి తనయొద్దనున్న త్రాళ్ళతో నాతని కాలుసేతుల బంధించి నోటగుడ్డలుకుక్కి మొలలోని

తాళపుజేతుల నూడదీసికొనుట కొకనిమిషమైనను బట్టలేదు. తోడనే యాతడినుపపెట్టెను జేరి కడు ప్రయాసమున నెట్టకేలకు సరియగు తాళముజేతుల నేరుకొని దానిని తెఱచెను. ఆత డాపెట్టెను తెఱచుట యేమి ఛీ ఛీ అనుచు వెనుకకు నాలుగడుగులు వైచుట యేమి, యొక్కక్షణముననే జరిగెను. ఆయినుపపెట్టెయం దాయజమానుని భార్య శరీరము కాలుసేతులు నరుకబడి యుంచబడెను. ఆమె శిరస్సు కూడ నరకబడియుండెను అగ్గిరామునకు మితిలేని అసహ్యము జనించెను వెంటనే క్రిందపడియున్న యజమానుని తనకాలితో నాలుగు తన్నులు తన్ని చండాలుడా ఇదియా! "నీకుట్ర! అని మొగముపై నుమిసి ఆపాపిష్టిసొమ్ము కొనిపోక యాతని వ్రాతబల్ల ద్రాయరులను దీసి అందుగల రొఖ్ఖమునుదీసికొని యొకకాగితముపై పోలీసుఇన్‌స్పెక్టరు కొక లేఖ వ్రాసి న్యాయముగా దాని నాతని కొసంగ నిశ్చయించుకొని యిదివరకు తానెఱింగిన యిల్లగుటచే త్వరలో జేరి తలుపు బిలిచి తలుపుదీయవచ్చిన సుబ్బారావున కాయుత్తరము నిచ్చెను. సుబ్బారావు దానిని దీపపువెలుగున జదువ లోనికేగెను. అం దిట్లు వ్రాయబడి యుండెను.

" తత్క్షణము తమరు—యింటికేగిన యెడల నాతనిమోసము బయల్పడగలదు. ఆతడే తనభార్యనుచంపి ఆమె శవమును ఇనుపపెట్టె యందుంచినాడు. ఆలస్యము చేయక నేటికే బోవలయును. ఇట్లు విధేయుడు అగ్గిరాముడు

సుబ్బారావు తిరిగి వీథిలోనికి కరుదెంచెను. అగ్గిరాముం డదృశ్యు డాయెను. ఆతడు నాటిపోరాటమునిమెంచి ఉత్తరములోని యభిప్రాయమును బరిశీలింప నాతడు పోలీసుస్టేషనునుండి కొందరు జవానులు దీసికొని ఆయింటికేగి తెరువబడియుండిన తలుపుదీసికొని యజమానుని కొఱకు

గోకలు పెట్టుచు క్రమముగా మేడనెక్కగా యావృత్తాంతము బోధపడెను. ఆయజమాని యసహాయస్థితిని గనిపెట్టి అది అగ్గిరాముని పనియై యుండునని యాలోచించి యిరుగు పొరుగు వారలకు వర్తమాన మంపి పంచాయతీ శాస్త్రోక్తముగా జరిపి ఆయజమానుని ఖయిదీగా నీడ్చుకొనిపోయెను తెల్లవారినతర్వాత నా ప్రక్కసందులో బంధింప బడి యుంచబడిన బ్రిటోతునుజూచి యెవ్వరో పుణ్యాత్ములు వాని బంధనలను విప్పిరి కాని వాని కొంతకాలము తిరుగుచున్న పోలీసు చేతులలో నాతడనాయాసముగా నయాచితముగా చిక్కెను.

14

ఉదయము మొదమిదిన్నర గంటలకు నారాయణదాసు కాకినాడ జేరి సుబ్బారావుగారికొఱ కాయన యుంటియరుగుపై వేచియుండెను. ఆవెనుకటిరాత్రి చాలవరకు మేల్కొని యుండుటచే సుబ్బారావింకను నిద్రనుండి మేల్కొనలేదు. నిష్కారణముగా నాయునన్నిద్ర నేల భంగ పఱుపవలయు నని నారాయణదాసరుగుమీద వేచియుండెను. ఇంకొక యరగంట దాటినతర్వాత సుబ్బారావుగారు లేచి దంతధావనార్థము వీధియరుగుపై కరుదెంచెను. ఆయనయు, దాసును నొకరి నొకరు పలుకరించుకొనిరి. పిదప నారాయణదాసు తన జేబులోనున్న యుత్తరము నొకదానిని దీసి ఆయన కొసంగుచు "ఆయుత్తరము గో వ్రాసిన ట్లన్నియు నేర్పాటులు గావించుకొని మిమ్మెందులో సర్దయించిన తా నావేళకు సిద్ధముగా నుండవలయునని చెప్పినాడు" అనెను.

సుబ్బారావుగా రాయుత్తరమును పాతము పఠించి ఆశ్చర్య మగ్నమానసుడై మరల నొకసారి పఠించి తనివి తీరక తిరుగ నింకొక సారి పఠించెను. మీరిందలి యంశములు నెఱుంగరు కాబోలును!

మీరుకూడ దీనిని పఠింపుడు " అని యీయుత్తరమును దానునకొసంగెను. అతడొకసారి దానిని చదివి సుబ్బారావుగారి కోరికపై తిరిగి యిట్లు చదివెను.

మకాము—ద్వారపూడియొద్ద పొలములో
15 డిశంబరు 1900.

మహారాజశ్రీ ఆర. సుబ్బారావుపంతులుగారికి, విశ్వనాథము వ్రాయునది. నేను భగవదనుగ్రహమువలన నేటివఱకును సురక్షితముగానే యున్నాను నేనును వారలలో నొకడనైతిని. వారలలో తిరుగుచు బందిపోటుల కేసుచుంటిని. మీకష్టకాలము తీరిపోయినట్లు కనుపించుచున్నది. 18 వ తారీఖున రాత్రిపడి తరువాత నార్యపట్టమున—గారియింట దొంగతనము జరుపుటకు నిశ్చయింపబడినది. మీరియుత్తర మందినతత్క్షణమే తగిన బలమును దీసికొని యుంగు మీకుజూపిన ప్లానుప్రకారము వారల నంచవలయును ఈయుత్తర మందిన తత్క్షణమే మీరు స్వయముగా నచ్చటకేగి ఆయింటి యజమానునితో యీవర్తమానమును జెప్పి యీయనకు ధైర్యముజెప్పి ఆరాత్రికే మీరందరును నాయింట ప్రవేశించి యింటలోనివారల నెచ్చటకైన సమీపగ్రామ మంపవలసినది. దొంగతనము జరుగురోజున మాత్రము మీరెవ్వరును పైకగుపడకుండ నుండవలెను. దొంగలు ప్రవేశించు మార్గము ప్లానులో నున్నది. అతిజాగరూకులై యుండవలయును. జయము తప్పక సిద్ధింపగలదు. ఇచ్చట ప్లాను వ్రాయబడియుండును.

విశ్వనాథము.

ఆదినమున సుబ్బారావుగారికి తీరికయే లేదు. రాత్రి చాలవఱకునిద్రలేకయుండియు పగలంతయు నాతడు కూర్చుండుటకైన నవకాశము లేనంతశ్రద్ధగా పనిచేయవలసి యుండెను. అగ్గిరాము డిచ్చిన

వర్తమానముపై వెనుకటిరాత్రి యూతము పట్టుకొనిన హంతకునిగురించి యింకను చాల పని జేయవలసియున్నది. ఆలస్యమైనచో సాక్ష్యము పూర్తిగా లభింపకుండుట యటుండ నేరస్థుడగు నాయజమాని యప రాధి కాడని స్థిరపడుట కవకాశముగూడ గలుగగలదు. ఈపనికిదో డాత డారాత్రి కార్యపట్టము జేరి యచ్చట విశ్వనాధము వ్రాసిన చొప్పున నేర్పాటులన్నియు గావింపబడవలసి యున్నవి సాయంకాల మగునప్పటి కాత డెట్టకేలకు పని నిర్వర్తించుకొని నలుబదియైదుగురు కనిస్టేబులతో నార్యపట్టము బయలుదేరి విశ్వనాధము వ్రాసినట్లు రాత్రి 12 గంటల కేర్పాటులనెల్ల గావించి బడలికచే పరివారముతో పాటుగా కండ్లు మూసెను.

ఇక సిడపర్తిలో నాదినమున నీగుంపువారేమి చేయుచుండిరో యించుక గనుగొనెదము. మధ్యాహ్నమున కెల్లరు నించుక విశ్రమించి, భోజనాదులను జేసి, కొంతవడికేదియో లోకాభిరామాయణము మాట లాడుకొనిరి. ఆకాలమున విశ్వనాధము పరధ్యానముగ నుండెను. ఆతడు చిత్తమున నిట్లు తలపోయుచుండెను. నేను పంపిన యుత్తరమును దీసి కొని, యీపాటికి నారాయణదాసు కాకినాడజేరి, సుబ్బారావుగారికి దానినిచ్చి యేర్పాటులన్నియు గావించియుండెనా? సుబ్బారావుగా రూరనుండియుండునా, లేక గ్రామాంతరము బోయియుండునా? గ్రామము విడువకుండ, సాధ్యమగునంతవఱ కచ్చటనే యుండవలసిన దని వెనుక నేను చెప్పినమాటలు నాతడు పాటించి కాకినాడలోనుండి నచో, తప్పక యేర్పాటు లన్నియును నీపాటికిజేసికొనియే యుండును. ఈసమయమునందాటినచో తిరిగి వీరు నాబారిబడుట యసంభవమే! నేను కూడ దొంగవలెనే మెలగవలయునుకాని నాసంగతి వీరిలో నెవ్వరికైన దెలిసినచో, పోలీసువారి యెదుటనే నన్నుకడతేర్చెదరు. ఈసారి గుంపువారెల్లరును దప్పక దొరకెదరని నమ్మకమున్నది భగవదేచ్ఛ

యెట్లుండునో తెలియదు. దొంగరాముడు నాయందు నమ్మకముంచి ఆర్యవట్టములో జరుపదలంచిన దొంగతనమును గురించి, యావద్వృత్తాంతమును నాకెఱింగించుటచే, ప్లానుగూడ తయారుజేసి ఎచ్చటెచ్చట జవానుల నుంచవలయునో కూడ తెలుపగల్గితిని. నేటికి సుమారు వారముదినములనుండి నాకులమును మఱచి నానాజాతులవారితోడను గూడి, సంకరమైతిని. ఇంటికేగినతర్వాత దానేమి ప్రాయశ్చిత్తము చెప్పునోకదా?" అని లోలోపల నానందించుటచే నతని ముఖమున కళ హెచ్చెను. లోపలి యానందము వెల్లివిరియగా నాతనిముఖమున చిరునగ వంకురించెను. అతనివైపు రెండు నిమిషములనుండి చూచు చుండిన దొంగరాము డదికనిపెట్టి పెద్దనవ్వునవ్వెను

"విన్నన్నా! విన్నన్నా! ఆకాశమున మందిరములను నిర్మించి నీచాతుర్యమునుజూచి నీవే యానందించు చుంటివా యేమి?" విశ్వనాథ ములికిపడి, పరుండినవాడు లేచి కూర్చుండెను.

"లేదోయి! నేను మీగుంపులో జేరుటయు మీరెల్లరును నాయందు దయయుంచి, నన్నాదరించు చుండుటయు, దలచుకొని నాహృదయమున విశ్వాసము జనింప మీసుగుణ పరంపర కచ్చెరు వందుచు, నాకు జీవనోపాధి కలిగినందుల కానందించుచుంటి." అని యాతడు సర్దుకొనెను.

ఇట్లే సాయంకాలమువఱకును గాలక్షేపము జేసి యెల్లరును తిరిగి వంటలజేసికొని భుజించి గుడిసెవెలుపల నించుకకాలము విశ్రమించి రాత్రి 9 గంటల కెల్లరును తిరిగి గుడిసెలో దూరిరి. ఇంకొకఅర పావు గంటకు వీధితలుపు నెవ్వరో తట్టిరి. ఆతట్టినయాతడు మిత్రుడే యని తట్టినపద్ధతివలన గ్రహించి దొంగరాముడు పోయి తలుపు తెఱచెను. అగ్గిరాముడాగుడిసెలో ప్రవేశించెను. గుడిసెలో నున్నవా రందఱు నానందపరవశులయి "అగ్గిరాముడికి జయ్" అని కేకవయిచిరి. అగ్గి

రాముడు తన భుజమున నున్న మూటను దొంగరాముని కొనంగి యొకచాపపై నుపవిష్టుడాయెను. కుశలప్రశ్నము లిరువంకల దీరెను. పిదప దొంగరాముడా వెనుకటిరాత్రి తమకు గలిగిన పరిభవమును గుఱించి విపులముగా నెఱింగించెను. అగ్గిరాము డంతయు విని జరిగిన దానికి విచారింపవలదని హెచ్చరిక నొసంగెను.

పిదప నాతడు జరిపిన రెండువిచిత్రచర్యలను గురించి విపులముగా వారలకెల్ల నెఱింగించెను. అతడు కథలను జెప్పుటలో నద్వితీయుడు. అతడు చెప్పుచుండగా విని గుంపులోని వారెల్లరును కడుపు లుబ్బునట్లు నవ్వనారంభించిరి. చివరకాతడా యింటియజమానుని బంధించి యినుపపెట్టెను దీసి మోసము నెరింగి దొరకిన ధనమును ప్రోగుచేసికొని పోలీసువారికి యుత్తరమును వ్రాసి స్వయముగా నిచ్చు వంశముల నెఱింగించునప్పుడు గుంపులోనివారలకు గలిగిన యానందమే యానందము! విశ్వనాథమునకు గలిగిన యాశ్చర్యమే యాశ్చర్యము! అగ్గిరాముని ధైర్యసాహసములకు తీక్ష్ణబుద్ధికిని, విశ్వనాథమునకు మితి లేని యాశ్చర్యము జనించెను.

"పోలీసుయిన్‌స్పెక్టరు సుబ్బారావుగారు చాల మంచివాడని నే నాయనకి వర్తమానము నొసగ నిశ్చయించుకొంటిని" అని అగ్గిరాముడు వచించునప్పుడు విశ్వనాథ మీసారి సుబ్బారావుగారితో గలిసికొనునప్పు డగ్గిరాముని విషయమై దయదలచుట రొప్పిదమే యని వాదించి యాతని హృదయమున మరల నిశ్చయించుకొనెను.

అనంతరము దొంగరాము డామరునాడు జరుగవలసిన ప్రయత్నమును గురించి యగ్గిరాముని ప్రశ్నించెను. అగ్గిరాము డుదయమున నచ్చటి కింకొక యిరువురరుదెంతురనియు, మొత్తముగా గుంపువా రందరును గలసి బయలుదేర వలయుననియు జెప్పెను. దొంగరాముడు తనయొద్దనున్న కాగితముపై నాయింటిప్లానును వ్రాసి అగ్గిరాముని

కొనగెను. అతడు దానిని బుచ్చుకొని యేరీతిగా నాగృహమున బ్రవేశింపవలయునో, యెందరెందరెచ్చటనుండవలయునో విపులముగా వ్రాసి గుంపువారి కెల్లరకును జూపించెను.

"ఈదొంగతనమైనతర్వాత కొన్నిదినముల వఱకు మనమెల్లర మూరకొని యుండవలయునని నాయభిప్రాయము. ఇదివఱకు చాలదినములనుండి యొకటేరీతిగా పనిచేయుచున్న మనకొక్కింత విశ్రాంతి నడుమనడుమ నుండినగాని ముందు ముందు మనకు చాల భారముగ దోచగలదు. మనమెల్లరమును గూడి దూరదేశమునకుబోయి, అచ్చట కొంతకాలముండి తిరిగి వచ్చెదముగాక! ఈలోపున గోదావరిజిల్లాలోని భాగ్యవంతులు తిరిగి ధనమును సేకరించుకొని మనకై యెదురు జూచుచుందురు. నిర్విఘ్నముగా కొన్నిదినముల వఱకును మనవృత్తి సాగగలదు" అని అగ్గిరాము డుపన్యసించెను. ఆమరునాడు దూరప్రయాణమును వనిభారము నుండుటచే, క్రమముగా నెల్లరును నిద్రాసక్తులైరి.

15

మరునా డుదయముననే మేల్కొని, పెందలకడ నెల్లరును పిడపర్తి మాలగూడెముననున్న గుడిసెలో వంటలుజేసికొని; భుజించి, కార్యాలోచనా నిమగ్నులై యుత్తమోపాయముల నూహింప మొదలిడిరి, అందఱు నుపవిష్టులైరి. అగ్గిరాము డిట్లు ప్రసంగించెను.

"ఇదియే కొంతకాలము వఱకును మాకడసారి దొంగతనమని యే తలంపవలయునని, నిన్నరాత్రి తెలిపియుంటిమి. ఇకనొక కొంత కాలము వఱకును, మనము విశ్రాంతి ననుభవింపవలయునని నాయుద్దేశము. మీకును విశ్రాంతియనిన నవశ్యముగ గాన్పింపదనియే నా

యభిప్రాయము. కావున నేటిరాత్రి మనయావచ్ఛక్తిని ధారవోయవలయును. మనకీరాత్రియందేవిధమైన నంతరాయమును రాదనియే నా నమ్మకము. ఏమయినను మనజాగ్రత్తపై మనముండుట యనవసరము. ఏదెట్లయినను, నేనుమాత్రము మీాయోగక్షేమములనే మదియందుంచుకొని, సర్వదా మీాబాగునే కోరుచుండెడివాడనగుటచే, మనమనుభవించు విశ్రాంతికాలమున నెల్లరము నొకచోటనే యుండుట శ్రేయస్కరమని, నిన్నరాత్రి దలపోయగా, నాకు స్ఫురించినది. నేనుపుట్టిపెరిగిన యీజిల్లాయందే సహాయగు స్థానము నేర్పఱచుకొని యుండదలంచితిని. అది మీాకున్ముందు తెలియజేసెదను. ఇక మనము నేటిరాత్రి జరుపవలసినదాని విషయమై యించుక విచారింతము. ఆర్యవట్టము సామాన్యమైన గ్రామమయినను మనము చేయు దర్శింపనున్నగృహ మూరునకు నడుమనున్నది. చుట్టును గృహములున్నవి. కాని పశ్చిమదిక్కున నున్న పెద్దకొంప కారణాంతరములచే నిప్పుడు నిర్జనమై యున్నది. కావున మనము ప్రవేశించుట కాదిక్కే యుత్తమ మని నిర్ణయించితిని. ఆమార్గమున బ్రవేశించునెడల మనయునికి పైవారెఱుంగుట కవకాశములేదు. కాని యొక్కటే చిక్కుగుపడుచున్నది. దొడ్డిగోడ యెత్తుగానుండుటయు, వీధిగుమ్మముతప్ప వేఱొక్కటి లేకుంటయు మనము తప్పించుకొని పారిపోవుట కించుక నడ్డముగా నుండవచ్చును! మనము ప్రవేశించు ప్రదేశమున కెదురుగానున్న నిర్జనమైన యింటియరుగుపై నొక్కడు పంచుకొనవలయును. లోనికిబోవుమార్గమచ్చట కేగిన తర్వాత మీాకు దెలిపెదను. సాధ్యమగునంత వఱకు బెదరింపులతోడనే యింటిలోనివారల నెల్లర భయపెట్టి మన పని నెఱవేర్చుకొనవలయును. తగినంత యవసర ముండినగాని కర్రనుగాని, కత్తినిగాని, యుపయోగింపరాదు. ఇంటిలోనివారలను బంధించుటకే ముందుగా ప్రయత్నింపవలయును. సాధ్యమగునంతవఱ కింటిలోనివా

రేవిధమైనగోలను గావింపకుండునట్లు జాగ్రతగా నుండవలయును. వా రేవిధమైనగోలను చేసినను మనకు చాల సిబ్బంది కలుగగలదు. ఏల నందురా? గ్రామము చిన్నదైనను గ్రామస్థులయందు చాల నైక మత్యముండుట సహజము. అదటుండనీ. ఇంటికి నాలుగుదిక్కులయం దును గృహము లున్నవని చెప్పియుంటిమి. ఏమాత్ర మలికిడియైనను. గ్రామము నలుదిక్కులనుండియు జనసమూహ మరుదెంచి యింటి కన్నివైపుల కాచికొని మనము పారిపోవుటకు వీలులేనట్లు చేయుదురు అప్పుడు తప్పక మనగుంపులో కొందఱు దొరకుట సహజమే. ఇన్ని చిక్కులున్నను లబ్ధి సుమారేబది యరువది రూప్యములరొఖముండు టచే మనమీ ప్రయత్నము జేయవలసియున్నది. ఏదయిన నల్లరియగు నెడల ప్రహరీగోడ మూలలకు జేరి వీలుకొలది త్రాటినిచ్చెనలతో నాలుగుమూలలనుండియు బారిపోవలయును. కావున వేగముగా వాటిని సిద్ధపఱుచుకొనవలయును. అవి సిద్ధమైనవెంటనే యొక్కరొక్కరుగ నెల్లరమును పొలముకాపులవలె వేషములను ధరించి సాయంకాల మగుసరి కార్యపట్టమును జేరి యూరిబైట నున్న చెరువుగట్టుపై దక్షిణపుదిక్కున మకాము జేసి, మనతో దీసికొనిపోయిన యాహార మును భుజించి, యించుక విశ్రమించి, యాపై పని నారంభింపవల యును. చెప్పినయంశములలో ప్రతిదానిని జ్ఞప్తియం దుంచుకొని సాధ్య మగునంత జాగ్రతతో మెలంగవలయును.

పిదప గుంపులోనివారెల్లను నాలుగు త్రాటినిచ్చెనలను సిద్ధ మొనరించుటకై పూనుకొని సుమా రరగంటకాలమునకు నార్యపట్టము జేరుటకై కాపువేషముల ధరింప నారంభించిరి. ప్రతిదొంగయు కత్తి లోపలమర్చబడిన కఱ్ఱలను చంకయం దిడికొని తలకొక తలపాగ ధరించి, యొక్కరొక్కరే యాగుడిపెవిడిచి బయలుదేరి నారంభించిరి. బయలు దేరిన పదుగురుదొంగలలోను చిన్నన్నయు, దొంగరాముడును,

బలేరాముడును, నగ్గిరాముడును చెరియొక త్రాటినిచ్చినయు బట్టలో మూటగట్టి యొకచేతనామూటను బట్టుకొనిపోయిరి. ప్రతివాదును చిన్న చిన్నకుండలయం దాహారమునుగూడ దీసికొనిపోయిరి. సాయంకాల మగునప్పటి కెల్లరును చెరువుగట్టుపై భోజనముల నారగించిరి.

దొంగ లిచ్చట భోజనముచేయునప్పటి కప్పుడే కాకినాడనుండి యరుదెంచిన నలుబదియేడుగురును భోజనములను జేసి విశ్వనాథముచే నిర్ణయింపబడిన స్థానములయం దతిజాగరూకులై కూర్చుండియుండిరి. ఎవ్వరును గట్టిగ మాటలాడుకుండుట యటుండ ననలే నోట నేవిధమైన శబ్దమును వెలువడనీయకుండిరి. శ్వాసముకూడ వినబడనియంత నిశ్శబ్దముగా నెల్లరును గూర్చుండి సంజ్ఞల చేతనే యొకరిభావముల నొకరాగాఢాంధకారమునఁగూడి నెఱుంగ నుత్సహించుచుండిరి. నిర్జనమని చెప్పబడిన యాయింటియందు సుమారిరువదియెనుగురు కనిస్టేబులు సుబ్బారావుగారితోకూడ నిలువబడి యుండిరి. ఆయింటికి తూర్పు దిక్కున నున్నయింటియందు పండ్రెండుగురు పోలీసుజవానులు డాగిరి. దొంగలు ప్రవేశింపదలచిన యింటియందు బలనశులైన యెనమండుగురును కనిస్టేబు లుండిరి తలనిండ ముసుగు గప్పికొని పైకెగగట్టబడిన కట్టుబట్టతో నాపాదువడిన కొంపయరుగుపై నారాయణదాసు పండుకొనియుండెను. రాత్రి నిశ్శబ్దముగ నుండెను. దా నతిజాగ్రతతో ప్రతి శబ్దము నాలకించుచు బరుండెను.

పండ్రెండు గంటలాయెను. ఛాయాగ్రహములవలె నడుగుల చప్పుడైనను వినబడకుండ పదుగురుమనుజు లాపాదువడిన యింటి ముందు నిలిచిరి. దాను నిశ్శబ్దసమయమున నించుక వినిపించెడు శ్వాసాధారముచే వార లరుదెంచినట్లు గుర్తించి జాగరూకుడై యుండెను. ఆయరుగుపై బరుండినమనుజుని చూచి వారించుక యనుమానించిరి రెండునిమిషములకాలము వారలట్లే నిలిచియుండిరి

అంతట నగ్గిరాముడు మెల్లగా నాతడు పరుండిన యరుగుపై నెక్కి నాలుగైదు నిమిషములవఱకు నాతనిదెస జాగ్రతగా చూచుచునే యుండెను. పిదప నాతడించుక సంతుష్టుడై తిరిగి మిగిలినవారు నిలిచి యున్న తావునుజేరి వారితోనించుకకాల మాలోచించెను. ఎట్ట కేలకాతడు దృఢనిశ్చయుడై, తనగుంపులో నొకనినిబిల్చి "నీ వేగి, వానిప్రక్కనే పరుండుము. వానికేవిధమైన ననుమానము లేనిరీతి మెలంగవలయును. వాడుమేల్కొని నిన్నేమైన లేపినచో, నేదియో ప్రసంగించుచు, నిద్రాసక్తుడవైనట్లు మెలంగుము. జాగ్రత్త" అని యాతడు నియమించి, మిగిలినవారితో గూడ యాయింటి కించుక దూరముగా పోయెను. ఇంకొక యైదునిమిషములలో నెల్లరును త్రాటినిచ్చెనల సహాయమున నా ప్రహరీ దాటి లోనప్రవేశించిరి. దొంగ లా యింటికి పశ్చిమముగానున్న పడకగదియందు గన్నము త్రవ్వి యచిరకాలములోనే లోపలకుబోయిరి. ఊరంతయు నిశ్శబ్దముగ నుండెను. వారు లోపల బ్రవేశించి క్రమముగా నిల్లంతయు శోధించుచుండిరి. కాని వారికాయింట నెవ్వరున్నట్లు తోచకుండుటచే, ననుమానాస్పదులై, మోసము జరిగినదా యని, యింటిమండువాయందు నిలువబడి చూచుచుండిరి. దొంగలందఱు నత్యాతురులై ఇతికర్తవ్యతామూఢులై యుండిరి.

అప్పుడొక యద్భుతము తటస్థించెను. ఆదొంగలు ప్రవేశించిన యింటి దొడ్డివసారా తలుపు తెరుపబడెను. దొంగలు నిశ్చేష్టులై నిలువబడియుండిరి. ఇంకొక యరనిమిషమునకు "దొంగలు! దొంగలు!" అను పెద్దధ్వనియు, దిక్కులు మారుమ్రోగునట్లీలపై నీల వినబడెను. తత్క్షణమే నారాయణదాసు తన చెంతనున్న వానిపైబడి నేలకదిమిపట్టెను. పాడువడిన యింటనుండి, సెలయేటిప్రవాహమువలె కనిస్టేబులు వెలువడి యా యింటి పశ్చిమ, దక్షిణోత్తర దిక్కులకు

పట్టుకొనిరి. ఇంకొకచో డాగియుండిన పండ్రెండుగురు జవానులు తూర్పుదిక్కున కగుడెంచిరి. పెద్దగోల యయ్యెను. ఊరంతయు గగ్గోలయ్యెను. దొంగలు వెలువడి నాలుగుమూలలను ప్రాటినిచ్చెనలతో గోడలనుదాట ప్రయత్నించిరి. లోపలనున్న కనిష్టేబుల యొత్తిడిచేనేమి, యీవలకాచియున్న కనిష్టేబుల యొత్తిడిచేనేమి, దొంగలు పోరాడ ప్రయత్నించినను, వారి యాటలు సాగినవికావు. లోపల నిద్దరును బయట నారుగురును దొంగలు పట్టువడిరి. అరుగుపై నారాయణదా సదిమిపట్టు కొనియున్న వానితో తొమ్మండుగురైరి. లోపలనున్న కనిష్టేబులు పట్టుకొనిన దొంగల నీవలకీడ్చుకొని వచ్చిరి. అందఱకు కర దండములు దగిలింపబడెను. ఇంక నెవరైన నుండిరేమోయని చుట్టును నాయింటికి కొందరు జవానులు కావలియుండిరి. ఇంతలో సుబ్బారా వచ్చుట కరుడెంచి దొంగల నెల్లరను లెక్కపెట్టెను అతను తలుపు కన్నమునుండి లెక్కపెట్టిన పదుగురిలో నొక్కడు తగ్గియుండెను. అగ్గిపుల్లను వెలిగించి చూడగా ప్రధాన పురుషుడగు నగ్గిరాముడు డాపట్టు పడినవారిలో నిందును గానరాలేదు. గ్రామములోని వారెల్లరును గుమిగూడిరి. "అగ్గిరాముడు లేడు ఇల్లంతయు నెందుగుఱు కనిష్టేబులేగి సోదా చేయవలయును" అని సుబ్బారావాజ్ఞ నిచ్చెను. కనిష్టేబులింట జొరబడిరి. ఎంతవెదకినను వారికగ్గిరాముడెందును గానబడలేదు. అప్పుడు సబిన్‌స్పెక్టరు కనిష్టేబుల నందఱను బిలిచెను. లెక్క చూడగా నందొక్కడు తక్కువగ నుండెను. గ్రామస్థులలో నొకడు, "కనిష్టేబొక్కడగ్గిరాముని తరుముచుంటినని, గొల్లపాలెమువైపు వోడ్డున పరుగెత్తుకొని పోవుచుండె" నని తెలిపెను. లాభములేదనియు, నాతడే తిరిగి వచ్చుననియు, పగటి వఱకు నాయింటిని గాచుకొనియుండు టవసరమనియు, సుబ్బారావు చెప్పుటచే, తెల్లవారువఱకును వారిచ్చటనే కాచికొనియుండిరి. ఉదయమున వెంటనే తిరిగి వారాయిల్లు

నాలుగుమూలల వెదుకగా, నొక చాపక్రింద, దొడ్డివసారాలో, నోట గ్రుక్కబడిన గుడ్డలతో త్రాళ్ళచే బంధింపబడిన యవయవములతో, కట్టుబట్టతో నొక పోలీసుకనిస్టేబు వారికంట బడెను. జరిగినమోస మప్పుడు వారి కించుకస్ఫురించెను

ఆ జరిగిన మోసమెట్టిది? ఆమోసము సుబ్బారావుదనుకొనిన యంతటితో తీరలేదు. మూల మూల వెదకుచున్న యొకకనిస్టేబుపై నకస్మాత్తుగాపడి, అగ్గిరాముడాతనినోట తన మొలనున్న గుడ్డను గ్రుక్కి, తనయొద్దనున్న త్రాటినిచ్చిన త్రాళ్ళతో నాతని బంధించి, యొకమూల బడవైచి, పై నొకచాపనుగప్పి యాతని దుస్తులను తానే ధరించి; యింటియావరణమునందు దొరకిన ఖైదీలను కనిస్టేబు లావలకు దీసికొనిపోయినవెంటనే, తానుగూడ, తూర్పున గోడదాటి గొల్లపాలెము రోడ్డున పరుగెత్తికొనిపోయెను. గ్రామస్థు డొకడడ్డి యెవరువారని ప్రశ్నింపగా, "నగ్గిరామునికొఱకు" అని పరుగుమానకయే ప్రత్యుత్తర మిచ్చెను. సంతుష్టుడై గ్రామస్థుడా వార్త నిచ్చటకు జెప్పవచ్చెను. రోడ్డుపై బడి పరుగెత్తిన వాడిక తిరిగి లభింపడుగదా యని, సుబ్బారావు మిన్నకుండెను. అట్లాతడు వడివడిగా పరుగెత్తికొని పోవుచుండగా, గొల్లపాలెము దాటి యొకపర్లాంగున కాతని కొకబండి యెదురాయెను. అగ్గిరాముడాగి యించుక యాలోచించెను.

"సుబ్బారావుగారి కించుక నాశక్తి సామర్థ్యములు రుచి జూపింప వలయును. ఇంతకన్న మంచిసమయము తటస్థించునా? అగ్గిరాము డనినపేరు జ్ఞాపకముండవలయును."

ఎదురుగావచ్చుచున్న బండిని రోడ్డుప్రక్కనున్న అగ్గిరాముడు దారికడ్డై యాపెను. బండిలో నిద్దరేయుండిరి. నిద్రపోవుచున్న బండి వాడులేచి గొల్లుమనెను. బండి కెదురుగా నిలిచియున్న అగ్గిరాముడు

తన దుడ్డునుజూపించి "గోలజేసిన దీనితో జావమోదెదను. బండిలోని వారు దిగి రోడ్డుపై నిలువబడవలయును" అనెను. ఆ విగ్రహమును జూచి, బండిలోనివారు రోడ్డుపై నిలిచిరి. బండిలోనున్న పెట్టె నీవలకు లాగి తాళమువిరచి లోపలనున్న నాలుగువందలరూప్యముల రొఖ్ఖమును దీసికొని పెట్టెమరల బండిలో పెట్టె ఆర్యవట్టములో పోలీసువారున్నారు. వారికీసంగతి తెలియజేయుడు, అని కాకినాడవైపు పాతడేగెను. 'బ్రతికితిమి జీవుడా'యనుకొని వారు గొల్లపాలెము నొద్ద తూర్పు తెల్లవారువఱకు నాగి, యుదయముననే బయలుదేరి ఆర్యవట్టముజేరి, పోలీసువారి కీవార్త దెలిపిరి. సుబ్బారావు మితిలేని యాశ్చర్యమున మునిగిపోయెను.

అగ్గిరాముడు తూర్పు తెల్లవారునగికి కాకినాడ జేరి, తిన్నగా, సుబ్బారావుగారి యింటికేగి, తలుపుదట్టెను. లోపలనుండి తలుపు తీయుచు నెవ్వరో "ఎవరువారు"అని ప్రశ్నించిరి. నేను కనిష్టేబును" అని అతడు సమాధానమిచ్చెను. తలుపు తెరవబడెను. అగ్గిరాముడు లోపలకు బ్రవేశింపకయే యిట్లడిగెను

"అమ్మా! సుబ్బారావుపంతులుగా రార్యవట్టమునుండి యిప్పుడే స్టేషనునకు వచ్చినారు. ఆయనదుస్తులను దీసికొనిరమ్మని నన్ను బంపినారు వారు తీసికొనివచ్చిన ఖైదీలతో మేజస్ట్రీటుగారి యొద్దకు బోవలయుననియు, నత్యవసరమనియు, నన్ను బంపినారు. త్వరగా నీయవలయును."

సుబ్బారావుగారి భార్య కాబోలును, లోనికేగి, యొకవరాయిని యొకకోటును, ఆయన తలపాగయును, బూడ్సుజోడును దెచ్చి అగ్గిరామునిచేతి కొసగెను." అమ్మా నేనేగెదను." అని యాతడా దుస్తులతో తనదారి నేగెను. ఆ మధ్యాహ్నము సుబ్బారావుగారింటి కరుదెంచుసరి కీవర్తమానము భార్యవలనవిని యేమియు దోచనివానివలె కుర్చీలో కూలబడెను.

16

ఆ మధ్యాహ్నము దొంగలందఱును ఖైదులో నుంపబడిరి. ఒక్కొక్క డొక్కొకగదియం దుంపబడెను ఒక్కొక్కగది కిద్దఱు చొప్పున పహారాజవాను లుండునట్లు సుబ్బారావాజ్ఞ నొసంగెను. విశ్వనాథము దొంగలతోఁబాటు గదులలో చివరనున్న దానియం దుంచబడెను. అగ్గిరాముడు తన్నట్లుమోసముచేసెనని సుబ్బారావు మొదట విచారించినను నాతని ధైర్యసాహసముల కాతఁడుమది నానందించుచు మిగిలిన గుంపంతయు నాతనిచేతబడెనని మాత్రము సంతోషించెను. ఆదినమంతయు బడలికదీర్చుకొనుటతో సరిపోయెను.

మఱునా డుదయముననే జైలులోనిజనుల కాశ్చర్యజనక మగు నొకవార్త వ్యాపించెను. ఖైదీలలో నొక్కఁడు రాత్రికిరాత్రి గదిగోడకు కన్నముత్రవ్వి పారిపోయెనని వదంతి కలిగెను. ఆపారిపోయిన వాడావెనుకటిదినమున నుంపబడినవారిలో నొకడని తరువాత దెలిసెను. అటు తరువాత వానిపేరు విస్సన్న యని విదితమాయెను. ఈవ్యాపారమంతయు సుబ్బారావుగారే, చేయించిరి దీనివిషయముననే వెనుక విశ్వనాథమును, సుబ్బారావుగారును మాటలాడికొనినపుడు మొదట ననుమానించి యెట్టకేలకు విశ్వనాథమునకు గోపము రాగలదని సుబ్బారావుగారు సమ్మతించిరని వెనుక దెలిపియుంటిమి ఈవార్తను విని సుబ్బారావుగారు జైలున కరుదెంచి ఖైదీలదరిపోవునట్లు గదిని కావలిగాచియున్న కనిష్టేబులపై నురిమి వారలపనినుండి తప్పించి, ఖైదుజేయించెద నని బెదరించి వారియొద్ద సముజాయిషీలను బుచ్చుకొని యింటికేగెను ఆకనిష్టేబులకుకూడ నీరహస్యము విదితమగుటచే వారును మిన్నకుండిరి. ఖైదులోనున్న దొంగరాముడును తక్కినవారును విస్సన్న సాహసమునకు మెచ్చుకొన నారంభించిరి. ఈతడు గది

నెట్లు కన్నము త్రవ్వగలిగెనా యని వార లాశ్చర్యమగ్న మానసు లయిరి. కాని వారిగదులను గాచుచున్న కనిష్టేబులా పారిపోయిన దొంగ తనగది గాచుచున్న కనిష్టేబులపై నేదియో మందు ప్రయోగించియుండు నని చెప్పుటచే వారించుక తృప్తిగని తమకు గూడ నట్టి మందు నేదయినను ప్రసాదించి ఖైదునుండి తప్పించుకొను నుపాయము జూపుమని వారు భగవంతుని బ్రార్థింపజొచ్చిరి. ఎన్నివిధములజూచిన నాజైలుగోడ లితరోపాయము లేకుండ కేవల భుజబలప్రయోగమున నసాధ్యమే యని వారు స్థిరపఱచుకొని తప్పించుకొనుట కింక వేఱు పాయము లేమియు లేవనియు నేదైన పన్నుగడ బన్ని యగ్గిరాముడె వారల నాచెఱనుండి తప్పింప యత్నించునేమో యనియు నాతనిపై భారమంతయు నుంచి భావిఫలముల కెదురుజూచుచుండిరి.

ఆ వెనుకటిరాత్రి జైలునుండి తప్పించుకొనిపోయిన ఖయిదీ నిర్భయముగా పోలీసుసబిన్స్పెక్టరు సుబ్బారావుగారి యింటికేగి నిర్భయముగా తలుపు దట్టెను. రెండుమూడు సారులు పిలువగా నాయన నిద్రనుండి మేల్కొని వీధితలుపు దెఱచి కంఠస్వరమున వచ్చినవాని నానవాలుపట్టి గాఢముగా కౌగలించుకొనెను. తలుపు తెఱచినశబ్దమును విని నారాయణదాసు విశ్వనాథము గొంతుక నానవాలుపట్టి తనవీధి గది తలుపు గూడ దెరచెను. బావమఱదు లిర్వురును గూడ పలుకరించుకొనిరి సుబ్బారావు వీధితలుపు బంధింపవలదని భార్యకు దెలిపి తానును విశ్వనాథమును నారాయణదాసును గలిసి వీధిగదిలో బ్రవేశించి తలుపు నోరగిల బెట్టి దీపమును వెలిగించిరి.

ఆరాత్రి పదిపదిహేను నిమిషములవఱకు ముగ్గురును గుసగుసలాడుకొనిరి. సుబ్బారావు వారలను నిద్రబొండని చెప్పి తనదుస్తులను ధరించి, తిరిగి వచ్చువఱకును మేల్కొనియుండవలయును అని భార్యకు

తెలిపి తనపై సికిలుపై పోలీసుస్టేషను కేగి యొక హేడ్డును, పదుగురు కనిస్టేబులను పిడపర్తిలో గుడిసె గావలిగాయుచున్న మువ్వురును బంధించి, యింటనున్న సామానునంతయు దీసికొనిరమ్మని పంపి, తిరిగి తానింట కరుదెంచి దుస్తులను దీసివైచి ఆనందపరవశుడై నిద్రబోయెను.

ఆముగ్గురును బంధింపబోయిన హేడ్డును కనిస్టేబులును పిడపర్తి గ్రామమునందున్న గుడిసె నుదయ మేడుగంటలకు జేరిరి వారేగు నప్పటి కింకను గుడిసెలోనున్నవారు నిద్రనుండి మేల్కొనలేదు. వెనుకటిరాత్రి ముగియకముందు పరుదెంతుమని చెప్పిపోయిన దొంగరాముడును తక్కినవారును జెప్పినవేళకు రాకుండుట, నాదినమంతయును రాత్రి చాలవఱకును వారికొఱకు నాగుడిసె కావలిగాయుచున్న ముగ్గురును నిరీక్షించుకొనియుండిరి. ఉదయ మగునప్పటికైన నరుదెంతురను నమ్మకముతో వారు రాత్రి నిద్రించుటచే తలుపుతట్టిన శబ్దము విని, ముగ్గురును లేచి తలుపునొద్ద కరుదెంచిరి. తలుపు తెఱవబడెను. వెంటనే కనిస్టేబు లారుగురును లోనికి జొరబడి యాశ్చర్యమగ్నమానసులై యున్న యాముగ్గురును బంధించి యావలకు లాగిరి. ఇల్లంతయు సోదాచేయబడె కాని వారికాయింట విశేషముగా ధనముగాని, సామగ్రిగాని లభింపలేదు. ఆముగ్గురుదొంగలను దీసికొని ద్వారపూడి జేరి రైలుపై మధ్యాహ్నము మూడుగంటలకు కనిస్టేబులు కాకినాడ జేరిరి. ఆగుడిసెయందు గలసామానునంతయును దీసికొని హేడ్డు సాయంకాల మారుగంటలకు పోలీసుకచ్చేరి జేరెను. దొంగలు ఖైదులో నుంపబడిరి

ఆయుదయమున నిద్ర మేల్కొనినతరువాత సుబ్బారావుగారు విశ్వనాథము, నారాయణదాసును లేచి మాటలాడుకొనుచుండగా నాగదియందు ప్రవేశించి అగ్గిరాముడావెనుకటిదినమున తనయింట

జేసిన విచిత్రచర్యను గుఱించియు, నాతడు పారిపోవుచు దారిలో గొల్ల పాలెమున కీవలజేసిన దొంగతనమును గురించియు కడుపుబ్బ నవ్వుచున్న బావమఱదుల కెఱింగించెను.

“ ఇప్పటికైనను మీ కగ్గిరాముని సంగతి పూర్తిగా తెలియదనియే నాయభిప్రాయము. అంతటి దొంగయు, సాహసికుడును, కరుణాయత్తచిత్తుడును మనకు దఱచుగా గనుపించడు. మీయింట జరపిన దొంగతనమున కేమిగాని వాడీమధ్య నీపురములోని యధికారుల కేమైన తనప్రజ్ఞ జూపియుండెనని మీరు వినియుంటిరా? అని విశ్వనాథ మాయనను జూచి పల్కెను.

కలెక్టరుదొరగారి కాత డేదియో యొక యుత్తరమును వ్రాసినట్లు దగ్గరనున్న మనిషివలన కొంచెము వదంతి కలిగినది. కాని తరువాత జరిగినయంశము లేమియు మాకు దెలియలేదు. దొరగారీ యుదయముననే తిరిగి మకామునుండి బయలుదేఱి వత్తురని వర్తమానము తెలిసినది.

అట్లయిన జెప్పెదను వినుడు. అని విశ్వనాథము తన కగ్గిరాముడు తెలిపినరీతిని నొకయుపిరమైనను మారుపకుండ యావద్వృత్తాంతమును వారి కెఱింగించెను.

అగ్గిరాము డనిన కలికాలపు మైరావణునివలె నున్నాడే! పెట్టెను దొంగిలించుట యొక్కటి నిర్భయముగా దానిని తిరుగ దీసికొనిపోయి స్వయముగా దొరగారికొప్పజెప్పుటయొక్కటి. రెండును మైరావణుని చర్యలలో జేరినవే అని నారాయణదాసు తనయాశ్చర్యమును దెలిపెను.

ఇన్ని దినములనుండియు, వీరెల్లరును నిర్భయముగా నీచుట్టు ప్రక్కల సంచరించుచున్నను, చుట్టుప్రక్కలననే—మనయెదుటనే సంచరించుచున్న వారు మనచేత బడకుండుటకు గారణము నెఱుగు

దురా? మారువేషములను ధరించుటయందు వారెల్లరు సద్వితీయులు, ఏవేషమునకునైనను, పరిపడు సామగ్రి నంతయు వారెల్లరును నిమిషములో సమకూర్చుకొని, యావేషమున కనువగు రీతినే మెలంగుటయందు సమర్థులు ఆమధ్య నొకదినమున దొంగరాముడు బ్రాహ్మణవేషమును ధరించి అనపర్తిలో నొక గృహస్థునింట రాత్రి భోజనముచేసి యింటిగుట్టంతయు పైన తిరుగాడుచున్న మాకెఱింగించెను. నేనుకూడ వారియొద్ద వేషములను ధరించుటయందుగలనైపుణ్యమువారముదినములలో నేర్చుకొంటిననిన నాశ్చర్యము నొందవలదు. వారెంతకైనను తగినవారే! కాని వారియొద్ద నున్న నీతియును, నుదారతయు నేమహాయోగికైనను నేమహారాజునకైన నుండుటరుదు. నేను వారితో మూడుదొంగతనముల కంటెని కాని వారెన్నడు నొక్కనినైన హింసింప యత్నించగా నాకంట బడలేదు. ధనికులను దోచికొని బీదలను బోషించుట మామతమని వారు గర్వపడుచుందురు. అట్టి దొంగజన్మము సామాన్యముగ మానవులకు లభింపదు. వారియెడ తగినంత సానుభూతి గనబఱచి విచారణయందు వారికి గొప్పశిక్షలు లభింపకుండునటుల జూచు భారమంతయు మీదే" అని విశ్వనాథము వేడుకొనెను.

"అది మనమెట్లు చేయగలము? నాశక్తి యున్నంతవఱకు నాకు మాటరాకుండ వీలుగలయంతవఱకు వారిపై నేరమును తగ్గింపదలంతును. ఆపైన వారి యదృష్టము. అన్నట్లు చెప్పుటమఱచితిని. ఈ మధ్య నగ్గిరాముడు నాకొకరాత్రి దర్శనమిచ్చి పోయినాడు. నేను తల బద్దలుకొట్టుకొనుచున్న యొకహత్యా విషయమై నాకు వర్తమానమును స్వయముగా నిచ్చి పోయినాడు" అని సుబ్బారావు హత్యావిషయమును గుఱించియు, తన ప్రయత్నమును గుఱించియు, నగ్గిరాము డిచ్చిన సహాయమును గుఱించియు విపులముగా వారికెఱింగించెను.

అగ్గిరామున కీవిషయ మెట్లు తెలిసియుండునో యని నాకుచాల నాశ్చర్యము కలుగుచున్నది. అతడిచ్చిన వర్తమానమే నాకు చాల తోడుపడినది. ఆనేరమునకు సాక్షినిగూడ యాతడు కట్టి పడవైచి పోయినాడు. అని సుబ్బారావా విషయమును గూడ దెలిపెను. విశ్వనాథము కొంచెముకాల మాలోచించి "ఏదయిన దొంగతనము జరుపుటకై యాత డాయింట ప్రవేశించి యుండవచ్చును. ఇనుపపెట్టెను దెరువగా నాళసికంట నీఖండింపబడిన దేహము కనుపించగా నాతడెన్నడును రక్తమును గంటజూచినవాడు కాకుంటచే కోపము జనింప మీకీ వర్తమానము నిచ్చి యుండవచ్చును" అని తన యభిప్రాయమును దెలిపెను.

ఈ రీతిగా వారు ముగ్వురును గొంతవఱకు మాటలాడుకొనిన తరువాత సుబ్బారావు స్టేషనుకేగి తనపని జూచుకొని జైలునకుపోయి ఖైదీలను వారివారల నిమ్మసి యడిగెనేగాని యెవ్వరును నోరు కదల్పకుండుటచే తిరిగి యింటి కరుదెంచి తన మిత్రులతో భోజనమొనరించి కూర్చుండెను.

"ఈరాత్రి నేను తిరిగి ప్రయాణమై పోవలయును. కథానాయకు నన్వేషింపవలయును. మీగడువు దాటకుండ వానినిగూడ మీ కప్పజెప్పితినేని నాపని పూర్తియగును. దానిచ్చటనే యుండగలదు" అని విశ్వనాథము తన నిశ్చయ మెఱింగించెను.

17

ఆరాత్రి పదిగంటలకు కాకినాడనుండి యొకడై రాగి వెలువడి వడివడిగా నడచుచు మధ్యమధ్య దిక్కుల నతిజాగ్రతగా పరిశీలించుచు కాలునగట్టుపై — పగ్గకోటకు ప్రయాణమై పోవుచుండెను. అతని

యొద్ద ధరించిన వస్త్రములు తప్ప మఱేమియు లేవు. తలకొక మాసిన తరుణారుణవర్ణము గల యంగవస్త్రమును, అరంగేగల యొక పెద్ద చొక్కాయియు, తాటిమట్టలతో చేయబడిన పాదరక్షలును మాత్రమే యాతడు ధరించి యుండెను అతని యెడమచేతియందొక కమండలు వుండెను. చంకనొక భిక్షాపాత్రయు, కుడిచేతియందొక కర్రయునుం డెను. ఆతడు మార్గమున నడచుచు, నడుమనడుమ వెనుకకు దిరిగి జూచుచు, సాధ్యమగునంతవఱకు చీకటిచాటుననే మసలుచు, నను మానాస్పదునివలె న చరించుచుండెను రాత్రియంతయు నాతడా రోడ్డుననే విశేషము పనియున్నవానివలె, వడివడిగా నడచుచు, వెనుకకు ముందునకు బచారుసేయుచు, నిరాశజెంది యెట్టకేలకు దయ మాఱున్నర గంటలకు చామర్లకోట కాలువదాటి యావలిగట్టున చెట్లనీడను నిద్రాపరవశుడాయెను.

మాపాఠకుల నొక్కింతకాల మావెనుకటిదినమున సుబ్బారావు గారి యింటనుండి యుదయమున నాయన దుస్తులను గైకొని పారి పోయిన యగ్గిరాముని వెంబడింపవేడుచున్నాము. సూర్యోదయ మగు నప్పటి కాతడు కాకినాడకు సుమారు రెండుమైళ్ళ దూరముననున్న వాకలపూడి యను గ్రామముజేరి తిన్నగా శూద్రగూడెములోనికి బోయి తన యొద్దనున్న రూప్యములలో రెంటి నచ్చట నొకవృద్ధునకిచ్చి తనరాక నెవ్వరికెఱింగింపవలదని వేడుకొని యాతనియింటనే భుజించి నిద్రాపరవశుడై సాయంకాలమువఱకును బండుకొని తిరిగి భోజనము జేసి ప్రయాణమై రాత్రి 10 గంటలకు పిఠాపురముజేరి కుక్కుటేశ్వరు నాలయప్రాకారమున విశ్రమించెను. ఆతడు ధరించిన పోలీసుదుస్తుల నెల్ల మూటగాకట్టి తన తలక్రిందనుంచుకొని శయనించెను. ఉదయము మూడుగంటలకు నిద్రనుండి మేల్కొని యాతడు సూర్యోదయము కాకమునుపే పెద్దాపురముజేరి పాడువడిన కోటలోని తన నివాసస్థాన

మునజేరి తన వేషమునంతయు మార్చివైచెను. వంటజేసికొని భుజించి బడలిక పూర్తిగా తీరిపోవునట్లు సాయంకాలమువఱకును సుఖముగా నిద్రపోయెను. సాయంకాల మాతఁ డూరిలోనికేగి స్నానమునొనరించి శుచియై, సామాన్యసంసారియగు నొక క్షత్రియునివలె వేషమునుదాల్చి తనకుపయోగించెడు సామానునంతయు, నొక చిన్నట్రంకుపెట్టెయందు నర్దుకొని, రాత్రి 10 గంటలకు చామర్లకోటజేరెను. అచ్చట రైలు స్టేషనులో వారును వీరును మాటలాడుకొను మాటలవలన, విస్సన్న బైరాగి నుండి తప్పించుకొని పారిపోయెనని యాతఁడెఱుంగుట కవకాశ మేర్పడెను. సుబ్బారావుగారు రాదలఁచిన హత్యవిషయము పరిశోధించి, సాక్ష్యము మొదలగు సంశయములను సమకూర్చుటకై చామర్లకోట కరుదెంచి, యారాత్రి తిరిగి కాకినాడ కేగుచుండెను. అత డొకరిద్దఱు స్నేహితులతో నచ్చట ప్రసంగించుచు గూర్చుండెను. ఆయనను గుర్తించి, మారువేషమున నున్న అగ్గిరాము డాయనను సమీపముననే తనముఖము సరిగా కనబడని విధముగా గూర్చుండెను. ఒకవేళ సుబ్బారావాతని జూచినను గుర్తింపలేని రీతినే అగ్గిరాముడు తనవేషము నంతయు మార్చివైచెను. ఆమిత్రుల సంభాషణవలన పై విషయ మగ్గిరాముడు గ్రహింపగలిగి కాకినాడ కేగవలెనని వచ్చినవాడు, సుబ్బారావుగారిని చూచి, యారాత్రికి కాకినాడ ప్రయాణమును మాని వేయ నిశ్చయించుకొని రైలు బయలుదేరువఱకు నచ్చటనే గూర్చుండి, ముందేమి చేయవలయునాయని విచారించుచుండెను. ఇట్లొకపావుగంట వఱకును జింతించి, యాతడులేచి, తన ట్రంకుపెట్టెను, గైకొని, బసివిరెడ్డిగారి సత్రము నొద్దకుబోయి, బండి నొకదానిని మాటలాడుకొని భిక్కవోలునకు బ్రయాణమాయెను.

బైరాగి నిద్రనుండి మధ్యాహ్నము నాలుగుగంటలకు మేల్కని చామర్లకోట యూరులోనికి కరుదెంచి తన భిక్షాపాత్రమునం దున్న

రెండణాలకు ఫలమునుగొని, భుజించి, సాయంకాలమగువఱకు నాసమీపమునసే సంచరించి, రాత్రికి సత్రమునభుజించి, రైలుస్టేషను కరుదెంచెను. ఆతడును సుబ్బారావు నానవాలుపట్టి యా సమీపముననే వేఱొకమూల గూర్చుండి, యాయనచెప్పు సంశములను వినుచుండెను. రైలుకై యరుదెంచినవాడు రైలెక్కకయే రైలేగినతరువాత తిరిగి యూరిలోనికేలపోవలయునని యాతడనుమానించి స్టేషనువిడిచి పోవుచున్న యాసామాన్యక్షత్రియ సంసారివేషమునున్నవానిని కొంత దూరము వెంబడించి యాతడు బండ్లయొద్ద నాగుటయును, బండిమాటలాడుకొని, దానిపై బిక్కవోలు, ప్రయాణమై పోవుటయు, జూచి, రైలువేళమఱచి, యీతడు కాకినాడబండికరుదెంచి, తానెక్కవలసిన రైలుగాదని గ్రహించి, తనయవసరముకొలది బండిపై రాత్రికి రాత్రిబిక్కవోలిత జేగుచుండవలయును" అని తనలోతాననుకొనెను. ఐనను నొంటరిగా బండిపోవుచుండుటచే, పరుల కుపకారము చేయుటయే తనపనిగావున నాథై రాగి, బిక్కవోలువఱకు నాబండి దృష్టిపథమును దాటిపోకుండునట్లు వెంబడింపవలయునని, తానదృష్టవంతుడేయైనచో తానాడబోయిన తీర్థ మెదురుకాకూడదా యనియు దలంచి, బండివెనుక నుమారరువది డెబ్బది గజములదూరమున వెంబడించెను. సాధ్యమగునంతవరకు కగుపడకుండునట్లాతడు చీకటిమాటుగనే వెంబడించుచుండెను.

బండి యుదయము కాకపూర్వమే, కాలువప్రక్క నాగెను బండివాడు నిద్రనుండి మేల్కొని, చూచుసరి కెవ్వరును బండియందు లేకుండుటచే, నాతడు 'కుయ్యో మొర్రో' అని అర్దెపోయినందుకు గోలపెట్టనారంభించెను. ఆగోలనువిని, వెనువెంటనేయున్న విశ్వనాధ మాతావునుజేరెను. అతడు బండివానివలన యావద్వృత్తాంతమును విని,

బండివానినోదార్చెను దొంగలుకొట్టు దినములలో నజాగ్రత్తగా బండిపై నిద్రపోవుటకిది తగినశాస్త్రియని తలంపవలయును. దారిలో నెచ్చటనో భయము జనింప నాబాటసారి చల్లగాజారియుండును. ఇట్లు విశ్వనాథము చెప్పుచుండగా నాబండివాడు బండినిత్రిప్పి తిరుగ చామర్లకోట కేగ బ్రయాణమై తాను కప్పుకొనియున్న బట్ట నిటునటు సవరించుకొనుచున్నప్పుడు వీపునకు గట్టిగానేదియో తగులుటచే నాతడనుమానించి, చూచికొనగా నొకకొంగున రెండురూప్యములు కట్టబడియుండెను. సంతోషించి యాతడావార్తను కాలువచెంత దంతధావన మొనర్చుచున్న భైరాగికి దెలిపెను. భైరాగితప్పక తానువెంబడించిన పురుషుడగ్గిరాముడేయనియు, నేకారణముచేతనో యాతడు మార్గమధ్యమున అద్దెను బండివానికొంగునకు గట్టి బండిదిగి పారిపోయెననియు గ్రహించెను. తూర్పు తెల్లవారుటకు బూర్వమే అగ్గిరాముడు పదముల చప్పుడు వలన తన్నెవ్వరో యంటివచ్చుచుంటిరని తెలిసికొని బండివాడు నిద్రించుచుండెనని గ్రహించి చల్లగా బండినుండి తన పెట్టెతో దిగి పారిపోయెను. ఆతడట్లు బండినుండి దిగి, పారిపోవుచు, వచ్చుచున్న వాడెవ్వడాయని చూచుటకై త్రోవప్రక్క కొంతకాలమునుండి యెవ్వరో భైరాగికదాయని యనుకొని, ఆసమీపగ్రామమున తన మిత్రుడును, తనవలన నిదివరకు చాలధన మనుభవించినవాడునునగు నొక శూద్రుని యింటికేగెను. అప్పటికింకను గనుజీకటియుండెను. అట్లు పోవుచు కాలువకు స్నానార్థ మొక వృద్ధబ్రాహ్మణుడు నిద్రమత్తున నెత్తికిజుట్టిన యంగవస్త్రముపై నొక పెద్దరాగిచెంబునుంచుకొని వచ్చుచు నాతనికెదురుపడెను. ఆతడించుక చిత్రమాచరింపదలంచి తన పెట్టె నొకచో దాచి, వచ్చుచున్నవృద్ధు డాతని దాటిపోయిన తర్వాత నొకయిటికను చేతబుచ్చుకొని యాతని వెంబడించెను. ఇట్లొక పదిగజముల దూరమేగి ఆయిటికను మెల్లగా నాతనితలపై నుంచి, ఆచెంబును దీసికొని

గిసపెట్టితోకూడ నామిత్రుని యింటికేగి, సామా నచ్చటనుంచి, దంతధావనమొనర్చి తిరిగి తానరుదెంచిన మార్గమున నావృద్ధుని చెంబుదీసికొనిన తావున గూర్చుండెను. ఆవృద్ధుడు కాలువ కేగి తోముకొనుటకై తలవెదకుకొనగా నిటికదొరకెను. ఆమోసము నెఱింగి గోలపెట్టుచు మార్గమున నెచ్చటనైన బడిపోయెనేమోయని దలంచి, పడిపోయిన నిటికెక్కడనుంచి వచ్చినదనియు దలంచి, తిరిగి యింటియొద్దనే పొరపాటున నిద్రమత్తున తానే యట్లు తెచ్చితినేమో యనియు దలంచి విచారగ్రస్తుడై యింటికి మరలెను మార్గమధ్యమున దారసిల్లిన యగ్గిరాముడు దాతనిముఖము నవలోకించి కాబోలును వానిని బలుకరించెను. వారిర్వురకు నీక్రిందిసంభాషణము జరిగెను.

"ఏమండీ శాస్త్రిగారు! స్నానమునకు కాబోలును మీరేగి తిరిగి విచారగ్రస్తులై వచ్చుచున్నారేమి? మీ ముఖము జూడ విచారగ్రస్తులై నట్లు తోచుచున్నది?"

"నాయనా! స్నానమున కేగుచుండ, దొంగయెవ్వడో నాతలపైనున్న చెంబును దొంగిలించి, దానికిబదులుగా నొకయిటికనుంచి పారిపోయినాడు కాలువకేగి నాకుజరిగిన నష్టమును గుర్తించి, పొరబాటున నేనే యింటమఱచి, నిద్రమత్తున దీనిని దెచ్చుకొంటినేమోనని తిరుగ యింటికి బోవుచున్నాను."

"చెంబుపోవుటయే స్థిరముచేసికొన్నను, అంతమాత్రమునకే మీరిట్లు విచారము నొందవలయునా? చెంబుఖరీ దేమాత్రముండి యుండును?"

"చెంబుఖరీదెంతైనను, తిరిగి కొనుననంతటి సమర్థుడను గాక పోవుటచే యిట్లు విచారింపవలసియున్నది, చాలబీదవాడను; యీపూట కుండిన రాత్రికి తిరిగి వెదకుకొనవలసియున్నది. మీరెవ్వరు నాయనా?"

ఆమాటలకు హృదయము కరగిపోవుచు "నే నెవ్వడనైన నేమి? నాయొద్ద నేదైన చెంబుగలదేమో చూచి యిచ్చెదను. పావు గంటలో వచ్చెదను మీరిచ్చటనే యుండు"డని చెప్పి, అగ్గిరాముడు పరుగు పరుగునబోయి తాను తస్కరించిన, చెంబును దీసికొని తన పెట్టెను తెరచి ఆచెంబు పట్టెడునన్ని రూప్యము లందుంచి తిరిగివచ్చి యాయన చేతికిచ్చుచు "శాస్త్రిగారు! మీచెంబు నేనే తీసితిని. క్షమింపవలయును మీరు తిరుగ కాలువకేగి స్నానముజేసిరండు నా వెంట మాత్రము రావలదు. నేనెవ్వడనో తెలిసికొని ప్రయత్నింపవలదు" అని ఆయనను గాలువకు పంపి తానింటికేగి, ఆమిత్రునియింటి నాదినమున నుండుటకు నిశ్చయించికొనెను.

ఆవృద్ధుడును గాలువకేగి ఆచెంబునందుంచబడిన రొక్కమందలి రూప్యముల నంగవస్త్రమున గట్టిగా మూటగట్టుకొని కాలువలో స్నానముజేయుచు తనకృతజ్ఞతను బట్టలేక యావద్వృత్తాంతమును స్నానార్థమరుదెంచిన తనపరిచితులకు కెఱింగించుచుండెను. తిరిగి చామర్లకోటకె బయలుదేఱి పోవుచున్న భైరాగి యీవిషయము నావృద్ధుని చుట్టును జేరియున్న వారివలనను నావృద్ధునివలనను నా మహాదాతయొక్క యాకారవర్ణన మెఱింగి యీచిత్రమును జరిపిన యాత డగ్గిరాముడే యని స్థిరపఱచుకొని తానుకూడ నాదినమున నా ప్రాంతముల నుండవలయునని నిశ్చయించుకొని వృద్ధుడింటికి బయలు దేరువరకు నాగి యాతని వెంబడించి యాతనివలన నాపురుషుడువచ్చి పోయినమార్గము నెరింగి యామార్గమున నూరిలోనికి బయలుదేరి పోయెను. ఇట్టి యుదారగుణ స్వభావుడగు వానియెడ దానింతపట్టు దలతో పనిచేయవలసివచ్చినందులకు హృదయమున నించుక విచా రించుచు వీలయినచో నాతని నెట్లయిన రక్షించినచో మేలగుననియు, సాధ్యమగునేని యాతని నాదుర్వృత్తినుండి మరల్చుటకే యత్నింప

వలయునని భైరాగివేషము నాతని నన్వేషించుచున్న విశ్వనాథము తలంచుచుండెను. ఎట్లయినను, మిత్రుడైన సుబ్బారావుగారికిచ్చిన వాగ్దానమును ముందుగా నెరవేర్చుటవసరమనియు, లేనిచో నాతడధికారుల క్రోధమునకు బాత్రుడగుననియు గూడ నాతడూహించెను.

ఉదయ మేడున్నర గంటలగుసరి కాతడా సమీపగ్రామము జేరెను. ఊరంతయు నొకటిరెండుపర్యాయములు ప్రదక్షిణము జేసినట్లు తిరిగెను. కాని వానికెందు నగ్గిరామునిజాడ కనబడలేదు. ఇంకొకసారి తిరిగి యేయింటనైన గొంచెమన్నము యాచింపవలయునని యుద్దేశించి యాతడూరంతయు జాగ్రతగా నాల్గుదిక్కుల బరిశోధించుచు బయలుదేరెను. ఇదివఱకీతడు తిరుగునప్పుడు తానుండిన శూద్రునియింటి కిటికి గుండ నగ్గిరాముడొకసారి భైరాగిని జూచి, యించుకకాల మాలోచించి మిన్నకుండెను. ఆతడు భోజనముజేసి తనమిత్రునితో బ్రసంగించుచు కూర్చుండ నీభైరాగి తిరిగి యావీధినేవచ్చెను అగ్గిరాముడు లేచి వీధిలోనికివచ్చి తలుపు మరుగుననుండి యాతనిపరీక్షించి తనయను మానము నిజమేయని నిశ్చయించికొని "విస్సన్నా!" అని కేకవేసెను. విశ్వనాథము తిరిగిచూచి అగ్గిరాముని గుర్తించి, చిరునగవుతో నాతని జేరెను. ఇరువురును నాశూద్రుడు గూర్చుండిన తావుసజేరిరి. అగ్గిరాముడు విస్సన్నయుదంతము నామిత్రునికెఱింగించి "విస్సన్నా! నీవెట్లు తప్పించుకొని వచ్చితివి? నిన్న చాకుర్లకోట స్టేషనులో సుబ్బారావుగారు నీసంగతి నెవరితోడనో చెప్పుచుండగా వింటిని" అనెను.

"ఆకనిస్టేబులలో నొకడు నాకు దగ్గరబంధుగు డున్నవాడు. వాడు నాగదికి కావలిగాయుచు ప్రసంగవశమున నది కావలిగాయు రెండవవానికి మత్తుమందునొసగి గదికి కన్నము త్రవ్వుట కవకాశము నా కేర్పరచెను. ఆతడేమి చిక్కులలో పడునోకాని, నాకు చాల యుప

కారము జేసినాడు. నీవు పారిపోయినవిధము మేమెల్లరమును విని చాల సంతోషించితిమి" అనెను. అగ్గిరాముడు సంతోషించి "విస్సన్నా! మన కార్యవట్టములో జరిగినమోసమునకు కారణ మెవ్వరో నీకేమయిన ననుమానమున్నదా?"అని ప్రశ్నించెను.

"ఏమో దృఢముగా చెప్పలేను. మనమున్న గూడెములోని మాలలు కక్కూరితిపడి, పోలీసువలన బహుమానము నొందుటకై అట్లు జేసియుందురు. ఏమో నిచులుకిదా?"

"కావచ్చును మిత్రుని, తననుపకారిని, మోసము జేసినవానిని భగవంతుడే దండించును. మనము నిచ్చటనే యీమిత్రునింటనుండి మనపని జూచుకొనవచ్చును." అని యాతడు స్థిరపఱచెను.

18

అగ్గిరాముడు చెప్పిన కడసారిమాటలు విశ్వనాథము హృదయమున నాటుకొని, బాధింపసాగెను. తనయందు నమ్మకముంచి రహస్యముల వెలిబుచ్చినవానియెడ మోసముచేసినవానికి సద్గతులుండవు. కాని, యయాచితముగా తానొనర్చబూనిన కార్యమున కట్టిసందర్భ పడుచుండుటచే యీదోషము తనయందు లేగని యాతడు స్థిరపఱచుకొని, యేదియో సంగతి జ్ఞప్తికిరాగా నాతడు పరధ్యానచిత్తుడై యుండెను. అగ్గిరాముడది ప్రశ్నించి "ఏమో ఆలోచించుచుంటివి? నన్ను పిడనాడి పోవుచుయునని నీకు తోచినదాయేమి? విస్సన్నా! నేను నిన్నేవిధమైన సంశయమును బెట్టను. నీయిచ్చవచ్చినచో నాతో నుండుము, లేదా కావలసిన నీ నేస్తుము"అనెను.

“నేనీ రెండుమూడు దినములనుండియు, మిక్కిలి ప్రయాస పడుచుండుటచే నాహృదయము పరధ్యానపరమైయున్నది నిన్ను విడిచిపెట్టను. నీయండనేయుండి నాకు వీలగునంత సహాయము నీకు జేయుచుండును” అని విశ్వనాథము చిరునగవుతో నాతని హస్తమున తన హస్తము నుంచుచు బల్కెను.

“విన్నన్నా! ఇక మనమిద్దర మీయింటనే యుండుదము. ఈ స్నేహితుడు సేవ తాను పనిగొని కింకర యూరేగవలెనని నిశ్చయించుకొనియున్నాడు కావున నీగృహము మనయధీనమున నుండును. సాయంకాల మిద్దరమును బయలుదేరి, నాపూర్వపు మకామునకేగి సామగ్రినంతయు దెచ్చికొనెదము. భోజనమైనదా? లేనిచో తెమ్ము స్నానముజేసి వంటజేసికొనుము.” విశ్వనాథ మీమాటల కానందము గనబఱచి లేచి వంటప్రయత్నము జేసికొనబోయెను. అగ్గిరాముడును ఆశూద్రమిత్రుడునుగూడ వానికుపకరణములను సమకూర్చుట కాతడు వంటజేసికొను వసారాలోనికేగి యాతనికి దోడ్పడుచు నేదియో లోకాభిరామాయణమును విచ్చలవిడిగా మాటలాడుకొనుచుండిరి. విశ్వనాథము చామర్లకోటనుండి, యతని వెంబడించిన సంగతి నగ్గిరామునితో జెప్పెను అగ్గిరాముడు తనకనుమానము జనింప బండిలోనుండి దిగి యామిత్రుని యింటకరుదెంచిన గాథను, మార్గమున జేసిన చిత్రమును దెలియబఱచెను. ఒకరిసంగతి నెఱింగి రెండవవారు పకపక నవ్వజొచ్చిరి.

భోజనమైన తరువాత నెల్లరును విశ్రమింపతలచి పండుకొనిరి. కొలదికాలములో వారు శ్రమనొంది యుండుటచే కాబోలును గాఢ నిద్రామగ్నులై యాలోకమును మఱచిరి. చీకటి పడుచుండగనే వారు నిద్రనుండి మేల్కొని, భోజనములొనర్చి యాశూద్రునితో తప్పక

మఱునాఁడురాత్రి కఱుదెంచుట నిశ్చయమనిచెప్పి అగ్గిరాముడును, విశ్వనాథము ను పెద్దాపురము ప్రయాణమైరి.

రహస్యాపరాధపరిశోధనలయందు పేరుజెందిన విశ్వనాథమును, దొంగతనమునందు జిల్లానంతయు గగ్గోలుపెట్టిన అగ్గిరాముడును మారు వేషములతో నల్లాపముల నాడుకొనుచు, పరమమిత్రులవలె పోవుచుండిరి. ఇది స్వభావవిరుద్ధము కూడ కానేరదు. శరీరలక్షణవేత్తలను భవము వలన ఘనయశస్సు సంపాదించు దొంగకును రహస్యపరిశోధకునకును రూపురేఖలందు వ్యత్యాసము లేదనియు వారు పొందు శిక్షాపద్ధతుల ననుసరించి వారివృత్తులు భేదించునే కాని ముఖవర్చస్సునను ఇతరశరీర లక్షణముల నొక్కటేయనియు జెప్పుచున్నారు. అగ్గిరాముడు రహస్యాపరాధపరిశోధకుడే యైనచో విశ్వనాథమువలెనే పేరుగాంచి యుండు నేమో!

అట్లామిత్రులిరువురును పెద్దాపురము బోవుచుండగా, మార్గమధ్యమున విశ్వనాథ మగ్గిరాముని పూర్వచారిత్రమును జెప్పవలయు నని చాల ప్రార్థించెను. ఎట్టకేల కగ్గిరాముడు సమ్మతించి పెద్దాపుర మేగువఱకును దనగాథ విరివిగా నెఱింగించెను. అందు మనకు ముఖ్యమైన సంగతులనెల్ల గ్రోడీకరించి పాఠకుల కెఱింగించెదము. అగ్గిరాముని చర్యలెల్ల లోకవిదితమే కావున నాతడీ వృత్తి నేల ప్రవేశించెనో పాఠకుల కెఱుంగజెప్పుట చాల యవసరము. అతడు వచించినవిధమునే తెలియజేయుచున్నాము.

“జనులనుకొనునట్లు నేను మాలవాడనుగాను. శూద్ర వంశజుడను, నాజన్మస్థలము. పెద్దాపురమునొద్ద నొకగ్రామము; నాజనకుడు చాలకాలము చెన్నపట్టణములో నొకకంపెనీలో పనిచేయుచుండుటచే

నావిద్యాభ్యాస మంతయు చెన్నపట్టణముననే జరిగెను. నేనచ్చట నాల్గవఫారమువఱకును విద్య నభ్యసించితిని. నాతల్లి గతించుటచే నా తండ్రి యుద్యోగమును చాలించి స్వగ్రామమున కరుదెంచి, విశ్రాంతి బడయునెంచెను మేమిర్వురమును పెద్దాపురముజేరితిమి. వేసవికాలపు శెలవులగుటచే నేనుతిరిగి విద్యనేర్చుకొనుట కచ్చటకునుబోవక, నా తండ్రితోనుంటిని; నాకప్పుడు పదునేడవయేడు; ఇట్లు మేమరుదెంచిన నెలదినములకు మాదురదృష్టవశమున చెన్నపట్టణమున నాతండ్రివలన నపకారమునొందిన పోలీసిన్స్పెక్టరు పెద్దాపురమునకు బదిలీ చేయ బడెను. నాతండ్రికంపినీవిషయమున మోసము దలపెట్టిన యీతని దురుద్యమమును కంపెనీవారితో జెప్పి తన్మూలమున పై అధికారుల కెఱిగించి, యాతనినుద్యోగమునుండి కొంతకాలమునస్పెండు జేయించెను. ఆతడావిషయమును మనమునందిడుకొనెను. కొలదిదినములలో నాతడు మేమున్నతావును గనిపెట్టెను. నాటినుండియు నాతడేదియో యొకవిధమున మమ్ముల బాధించుచుండెను. ఇట్లొకవారము పదిదినములు జరిగినవెనుక నే నింటలేకుండ జూచి యాతడు నాయింట బ్రవేశించి నాతండ్రిని బెదరించి, యింటిలోనిసామానునంతయు స్టేషనునకు దీసికొనిపోయి నాతండ్రిని చోరీయాస్తిని గొనినాడనియు, శిక్షార్హుడనియు, ఖైదులోనుంచెదననియు బెదరించెను. నే నింటికరుదెంచువరికి నాతండ్రి తన వార్ధక్యమున సంభవించిన యీపరాభవమునకు వగచి పై అధికారి కీతనిదౌర్జన్యమున దెలుపవలయునని ప్రయాణమై మనోవ్యధచే దేహము కంపింప ముందడుగుబెట్టలేక మితిలేనియాయాసము జనింప మంచముపై బడి యిపుడో యింకనో యనునట్లు పడియుండెను నేనీవృత్తాంతమంతయు నాతనివలన వింటిని. నేనేగి పై యధికారుల నెఱింగించుటకు నాతండ్రియవస్థవలన వీలుగలుగలేదు. అప్పుడే నేను నాతండ్రి కీదురవస్థదెచ్చినవానిపై కసిదీర్చుకొన ప్రతిజ్ఞజేసుకొంటిని.

అదివిని నాతండ్రి "నాయనా! ఎన్నడును రక్తమును మాత్రము నీ కంటజూడవలదు. అటుకాకుండ నీయిచ్చవచ్చినట్లు నీకసిదీర్చుకొనుము అదియేనాదీవెన" అని ఆశీర్వదించిపరలోకగతుడాయెను. ఆతని యంత్య క్రియలను జరిపి నేనాయూరునను గతేక రెండు మూడు మాసముల వఱకు నటునిటు దిరుగుచు నాయిన్స్పెక్టరు స్థితిగతులను కనుగొను చుంటిని. ఒకదినమున నల్ల చెరువు సత్రమున నేను ఐరుండియుండగా నేదోయొకకేసుపై యాతడు నాసత్రమున కరుదెంచి మకాముజేసెను. సమయము లభించినదని తలంచి యాతడొంటిగాయున్న సమయమున నాతని గది ప్రవేశించి యాతనిసామానును చల్లగా దీసికొనివచ్చుచు నొకకాగితముపై "ఛండాలుడా! నిన్ను చంపదలంచక పోవుటచే బ్రతికితివి. నాసంసారమునకు దెచ్చినయపవాదునకును నష్టమునకును నీ కిదియేశాస్తి. అగ్గిరాముడు నిన్నింకను వదలడు" అని వ్రాసి యాతని గుండెపైనుంచి వానిసామానుతో పారిపోయితిని, ఆసామానులో నాతని కాకితములును కూడ కొన్నికలవు నేనువాడుచుండిన పిస్తోలాతనిదే అగ్గిరాముడనునామము నా దినముననే ధరించితిని. నాపూర్వపునామము వేంకటస్వామి ఆపేరకస్మాత్తుగా స్ఫురించుటచే నేటివఱకు నదియే వాడు చుంటిని. ఇక చెప్పునదేమున్నది. నాటితో స్థిరపడినది. ఇక దొంగనై లోకోపకారము జేయమొదలిడితిని. ఆయిన్స్పెక్టరు గ్రామమున నుండునంతకాలము నాతనియింట నేసామాను నుంచెడివాడనుగాను మారువేషములను ధరించి మాయోపాయములతో నాత డాయూర నుండుటకు భయపడునట్లుజేసితిని. ఆతడన్నిదొంగతనములను నాతలపై పెట్టుచు, నన్ను బట్టుకొనుటకు బ్రయత్నము లాచరించుచు నా గ్రామ మునుండి బదిలీచేయించుకొని, దూరముగా పారిపోయెను. ఈ పండ్రెండు సంవత్సరములనుండియు నే నీవిద్య కనువగునుపాయముల నన్నిటి సమార్జించితిని. దేహమును బలపఱచుకొంటిని.

మిత్రు లిద్దరును పెద్దాపురమింకను జీకటియుండగనే జేరి పాడుబడిన కోటలోని యగ్గిరాముని నివాసస్థలమునకేగి విశ్రమించిరి. వారచ్చటనే వండికొని భుజించి హాయిగా సాయంకాలమగువఱకును విశ్రాంతి దీసికొని చీకటిపడినవెంటనే ముఖ్యమైన సామానులంతయు దీసికొని తిరిగి తెల్లవారుసరి కేర్పఱచుకొనిన నూతన నివాసమును జేరి ప్రయాణమై పోదలంచిన యాగృహాధిపతిని సాగనంపి బడలియుండు టచే నిద్రాపరవశులైరి. మధ్యాహ్నము భుజించినతర్వాత నగ్గిరాముడు విశ్వనాథముతో భావినిగుఱించి యిట్లు చర్చించెను.

విశ్వనాథ ! నేటిరాత్రి బయలుదేరి నేను రాజమండ్రి కేగి యొకయధికారియింటి కొకసారి పోవలయునని యున్నది. అది చాల అపాయకరమైయైనను, చేయవలసియున్నది. ఏలనందువా ! ఆతడు చాల ముఖ్యోపయని ప్రతీతి. ఆతనికొకసారి దర్శనమిచ్చినగాని, బాగుం డదు. ఇన్నిదినములనుండియు నాతడునాపై కారములను మిరియము లను నూరుచున్నాడు. ఆతనికొకసారి నాసామర్థ్యమును రుచిచూపింప వలయునని యున్నది. మనగుంపంతయు పోలీసువారిచేతులలో బడి నది. వారినేదైన నుపాయముపన్ని జెయిలునుండి తప్పించుకొనున ట్లేర్పాటులు జేసిరావలయును. రాజమండ్రికేగి ప్రయత్నములన్నియు జేసికొనిరావలెయును. నేడో రేపో మనవాండ్రను రాజమండ్రి పంపె దరు. ఐనను నీవుకూడ నేదైన మారువేషము ధరించి, కాకినాడ కేగి వీలగునేని మనవారలకు ధైర్యముజెప్పి యావద్వృత్తాంతముల నెఱింగి రావలయును, నేడు చతుర్దశికదా ! విదియనాడు చీకటిపడునప్పటికి నేను తిరిగివచ్చెదను. నీవీవర్తమానము నంతయు దెలిసికొని నే నరు దెంచునరి కిచ్చటకు రావలయును. వీలగునేని నాకుగూడ వండియుం చుము. నీవు కాకినాడలో చాల జాగ్రతతో మెలగవలయును. తిరిగి

నీవిచ్చట కరుదెంచునప్పు డెవ్వరును వెంబడింపకుండ జూచుకొనవల యును. ఈసాయంకాలమే బయలుదేరి పోవుదము. నీవాదినమునకు రావేని, నీవుకూడ వారిచేత జిక్కితివని యనుకొనెదను. నేను రాని యెడల నీవధైర్యమునొందక యిచ్చటనే యుండవలయును. నాకేవిధ మైన విపత్తును రాదులెమ్ము."

"తప్పక నే నావేళకే యరుదెంతును. నీవుమాత్రము జాగ్ర తగా నుండినచో మాకెన్నడు నేవిధమయిన లోటును గలుగదు" అని విశ్వనాధము తన నిశ్చయ మెఱింగించెను.

19

విశ్వనాధ మానాడు సాయంకాలమైన వెనుక చామర్లకోటవఱ కును నడచిపోయి యచ్చట రైలునెక్కి రాత్రి 12 గంటలు దాటిన తర్వాత కాకినాడ ప్రవేసించి, తిన్నగా సుబ్బారావుగారి యింటికేగి దానును లేపి పండుకొనెను. అగ్గిరాముడు బిక్కవోలువఱకు నడచి పోయి సూర్యోదయాము కాకమునుపే రాజమండ్రి జేరెను. ఆతడు మారువేషము నుండెను. తన శిరోజములను దగ్గరగా కత్తెరవేయించి మీసముదీసివైచి, నామములను ధరించి సాతానివలెనుండెను. ఆతడు తిన్నగా కంభమువారి సత్రమునకేగి యచట బస జేసెను.

రెండుదినములవఱ కాతడాయూరనే మకాముజేసి తనపని నంత యుదీర్చికొన ప్రయత్నించుచుండెను. పాడ్యమినాడు సాయంకాల మాతడాయధికారిని జూడబోయి యాయన బంగాళయరుగుపై చాల వఱకుగూర్చుండెను. కాని యాతని అఱియు గఱియుగ గొనువాడు లేకుండెను. ఒంటిగానున్నప్పుడా యధికారిని గనుగొనవలెనని యాత

ఓకమూలకూర్చుండుటచే లోపలికేగి తిరిగివచ్చువాఁడని కాతఁడు గోచ రింపకుండెను. ఇట్లొక రెండుగంటలవఱకు కాతఁడు గూర్చుండెను. తా నెవరికొఱకరుదెంచెనో యాతడీవలకు రాకుండుటయు, నా ప్రక్కపసారా యందుండినట్లు స్ఫురించుటయు, జూచి అగ్గిరాముఁడా ప్రక్కకు దొంగిజూచెను. ఆతఁడొక్కఁడే యుండెను. చేతిలో నేదియో గ్రంథము నుంచుకొనియాతఁడు తనకోటును పడకకుర్చీకి దగిలించియట్లే కునుకు చుండెను. అగ్గిరాముఁడు మెల్లగ నాతావునకుజేరెను. ఆయనకు మెలకువ రాలేదు. రెండునిమిషములవఱకు జూచి యతఁడు విసిగి యిక నిద్ర నుండి మేల్కొనడని గ్రహించి, యా చెంతనున్న కోటును మెల్లగ గైకొని పలాయితుఁడాయెను. రాత్రిపదిగంటల కాతఁడు తనబసజేరి, ఆ కోటు నొక బంగీగా కట్టి లోపల "అగ్గిరాముఁడంపినాఁడు" అని యొక కాగితముపై వ్రాసియుంచి, ఆబంగీ మరునాఁడు పోస్టులో బంపవలయు నని నిశ్చయించుకొని, బండికట్టించుకొని తెల్లవారుసరికి కడియము జేరెను. ఆసాయంకాలము చీకటిపడుసరి కాతఁడు తిరిగి తననివాసమును జేర వచ్చుచుండెను. ఆయుధికారి నిద్రనుండి మేల్కొని, లోనికిపండు కొనబోవునప్పుడు తనకోటుకై చూచుకొనెను. అది కానబడకుండుటచే నింటిలోనుండెనేమోయని లోనికేగి వెదకెను. తనకెందును కోటు కనబడకుండుటచే ఆతఁడు బంట్రోతులను బిలిచి వారిని దూషించి వెదకుట కాజ్ఞనిచ్చెను. ఎందువెదకినను గానరాలేదు. బంట్రోతులను పనినుండి తీసివైచెదనని బెదరించి కలగినమనస్సుతో నాతఁడు నిద్ర బోయెను. మరునాఁడుదయమున గూడ నాతఁడు వెదకించెను. కాని లాభము లేకపోయెను, ఆకోటు బంగీగా కట్టబడి, కడియము పోస్టాఫీసు లోనుండి తన పేర నంపబడుచుండెను.

విశ్వనాథ మామరునాఁడుదయముననే మేలజేరి, దాసును లేపి యాతనితో చాలవఱకు రహస్యముగ మాటలాడెను. ఇంతలో సుబ్బా

రావుగారు కూడా కాఫీ, ఫలహారములను దీసికొని, యాగదిలోని కరు దెంచెను. విశ్వనాథ మాయనను గూర్చుండ నియమించెను. ముగ్గురును ఫలహారములను జేసిరి

"సుబ్బారావుగారు! మీపని నెరవేరినది. ఇక మూడవనాడుద యమున మీకగ్గిరాముని దర్శనము జేయించెదను మీరేయనుమానము నొందవలదు"

"మీయనుగ్రహమువలన దిరిగి నాతిండి నాకులభింపగలదు. ఏమేమిప్రయత్నములను జేయవలయునో సవిస్తరముగా తెలిపినచో నేను సిద్ధముగా నుండెదను."

"మీరేవిధమైన ప్రయత్నములను జేయనవసరములేదు. ఆనా డుదయముననే మీరు నాగది తలుపు దీయునప్పటి కగ్గిరాముడం దుండును మీరు భయపడవలసిన యవసరములేదు. మీరుమాత్రము వానినేమియుననవలదు. మీరేకాదు మీజవానులాతని నెంతమాత్రము నిందింపవలదని శాసింపవలయును. దానికేమికాని మిగిలిన వారింకను నిచ్చట జైలులోనున్నారా? లేక రాజమహేంద్రవరము వారిని బంపి తిరా? అగ్గిరాముడు వచ్చునప్పటికి వారెవ్వరు నిచ్చట నుండరాదు."

"వారిని రేపు రాజమండ్రి పంపవలెనని ప్రయత్నించుచు న్నాను. రేపుమధ్యాహ్నము తప్పక రాజమండ్రి పంపివైచెదను. ఆ యభ్యంతరముండదు."

"సరే లెండు నేనును దాసు నూరులోని కేగి వచ్చెదము. శెలవా!" అని యిద్దరును దుస్తులను ధరించి యూరులో నటు నిటు సంచరించుచు రహస్యముగా యావద్వృత్తాంతమును మాటలాడుకొని భోజనమున కింటికి వచ్చిరి.

ఆమరునాడు చీకటిపడుసరికి విశ్వనాథమును నారాయణదాసును అగ్గిరాముడు నూతనముగా నేర్పఱచుకొనిన నివాసస్థలమును జేరి లోపల బ్రవేశించి తమతో దెచ్చికొనిన ఫలహారమును భుజించి యించుకకాలము విశ్రమించిరి. అనంతరము వారిద్దరును గూడి ఆ యింటి వీధిగుమ్మమునకు గడపకు లోపల మోకాలులోతు గోతి నొకదానిని దీయనారంభించిరి, రాత్రి పండ్రెండుగంటలకు వారిపని నెరవేరుటయు వారు తలుపువైచికొని నిద్రించిరి. ఆమరునాడుదయమున తమకుగావలసిన సామగ్రినంతయు సిద్ధముగావించుకొని, భుజించి సాయంకాలమగుసరికి జాగరూకులై యగ్గిరాముని రాకకు వేచియుండిరి.

అగ్గిరాము డరుదెంచుసరికి రాత్రి ఏడుగంటలాయెను. ఆతడరుదెంచి వీధితలుపు దట్టెను. లోపలనున్న యిద్దరును గోతి కిటునటు నిలిచి తలుపుదెరచిరి. లోపల నంతయు చీకటిగనుండెను." దీపమేది ? విస్సన్నా !" అని అగ్గిరాముడు గడపదాటెను. ఆతడా గోతియందు బడెను. నారాయణదాసు తత్‌క్షణమె యాతనిసందిట బట్టుకొనెను. విశ్వనాథము చురుకుగా నాతని దండలను విఱచికట్టి యతనిపాదములను గూడ బంధించి, మొలనున్న పిస్తోలు నూడబెరికికొని, "మాటలాడినచో నీపరువు నీకు దక్కదు" అని బెదరించి, వాని నాగోతినుండి నారాయణదాసు సహాయమున నీవలకులాగి చేతులను గాళ్లను తిరిగి బంధించి, దీపము వెలిగించెను. అగ్గిరాము డాశ్చర్యమగ్నమానసుడయి దీపపువెలుగున విశ్వనాథమును గుర్తించి, విస్సన్నా ! ఇంతమోసము దలపెట్టిన నీకు తరగతులుండునా ? పోలీసువారిచ్చు స్వల్పబహుమానమున కాశపడి, నన్ను బట్టుకొనదలపెట్టితివా ? ఎంత విశ్వాసఘాతకుడవైతివి' అనెను. స్నేహముచేత నెంతవానిచేనైనను విషము దినిపింపవచ్చును. కానివైరమున నమృతమునైన దినిపింపలేరు. కలిసిమెలసి

తిరుగుచు వారితో భుజించుచు నుండుటచే విశ్వనాథము కగ్గిరాముడు దొరకెను. కన్నులు నిప్పులుగక్కుచు నగ్గిరాముడు తీక్షణముగా విశ్వనాథమువైపు జూచుచుండెను.

"అగ్గిరాముడా! కాదుకాదు. వెంకటస్వామి! నేను విస్సన్నను కాను. నేను విశాఖపట్టణ కాపురస్థుడను విశ్వనాథమనువాడను. ఈతడు నాబావమఱది నేను రహస్యాపరాధ పరిశోధకుడను నిన్నుపట్టి యప్ప జెప్పినగాని తనతిండి పడిపోవునని నామిత్రుడగు సుబ్బారావుగారు కోరుటచే నిన్నును నీగుంపును వెంటాడి బంధించితిని. నీయందు నాకొక సద్బుద్ధి పుట్టుటచే, నిన్నెట్లయిన నాతో నుంచికొనవలయునను నుద్దేశముతో నున్నాను దీనికి నిదర్శన మిచ్చుట నెవ్వరును బోలీసువారు లేకుండటయే! ఆవిషయము నీవే యాలోచించుకొనవలయును. నిన్న దినముననే మేమిద్దరమును దీసికొనిపోయి యుదయమున సుబ్బారావు గారి కప్పజెప్పెదము. ఆయనకు జేసిన వాగ్దాన మప్పటితో తీరిపోవును. నాయందు నీకు క్రోధము వలదు. నేనెవ్వడనో నీకెఱింగించిన నీవలన మోసము జరుగుననియు నిక నాకంట బడవనియు నిన్నిరాత్రి మేమిద్దర మును గూడి యీమాయోపాయముచే నిన్ను బంధించితిమి.

అగ్గిరాము డాలోచించుచుండెను. అతని ముఖముననున్న కోపము క్రమముగా తగ్గిపోయెను. ఆతడు విశ్వనాథమువైపు చూచుచుండెను.

"విశ్వనాథముగారి పేరొకసారి వినియుంటిని. ఇన్నిదినములును వారు నాతో మెలగితిరని యిప్పుడు నాహృదయమున నాహ్లాదము జనించుచున్నది. నాకేమిలెందు ఖైదులో మీరు మీమిత్రున కొసగిన వాగ్దానము జెల్లించుకొనుటకు నన్ను దీసికొనిపోవచ్చును. కాని ఖైదులు శాశ్వతములు కావు. అభేద్యములుకావు నాదారినేను చూచుకొన గలను.

అని అగ్గిరాము డేమేమో చెప్పుచుండగ నాతనిమాట కడ్డయి విశ్వనాథము తన హృదయమిట్లు సంపూర్ణముగ వెలిబుచ్చెను.

"నాయొద్ద నిదివఱ కెన్ని దినముల నుండియో విశ్వాసముగా నుండి నాకు పరిశోధనలలో చాల సహాయము జేయుచున్న కొండడను వాడు గతించెను. నాటినుండి నేటివఱకు నాతనిస్థానము నాక్రమించుట కెవ్వరును దగినవారు లభింపలేదు. నేను నీతో నిన్ని దినములుండియు మెలంగుచుండుటచే నీసంగతి బాగుగ దెలిసికొని నిన్ను సన్మార్గమునకు ద్రిప్పుటయే నాముఖ్యోద్దేశముగా బెట్టుకొనియుంటిని. నిన్ను విడ నాడను అని విశ్వనాథమును నారాయణదానును నాటిరాత్రి చాల వఱకు బంధింపబడిన యగ్గిరామునితో ప్రసంగించి యాతనివలన నవసర మగు వాగ్దానములన్నియు గైకొని యాతని కుపయోగించు మార్గ మును సవిస్తరముగ బోధించి తెల్లవారుటకు బూర్వమే వానిని చామర్లకోటవరకు దీసికొనివచ్చి సూర్యోదయము కాకపూర్వమే తాముండుగదితల్పు దీసి, అగ్గిరాము నందుంచి, సుబ్బారావుగారిని మేల్కొల్పిరి. అగ్గిరాముని ముఖము నవలోకించినచో నాతడు రాత్రి జరిగినసంభాషణమువలన, చాల సంతుష్టినందినట్లు కనబడుచుండెను. అంతియే కాదు. విశ్వనాథము చెప్పినమాటలవలన నిదివఱ కాతనిపై నున్నకోపమంతయు నశించుటయేకాక మితిలేని విశ్వాస ముదయించిన ట్లాతని చూపులే నిదర్శనము.

సుబ్బారావుగా రరుదెంచిరి. ఆయన తన నేత్రములను నమ్మ లేక, విశ్వనాథమును పలుకరించెను. విశ్వనాథమాయన కగ్గిరాముని బంధించి తెచ్చితినని చెప్పి వానిని జూపించెను. వెంటనే యాయన కనిస్టేబులకు కబురంపి, అగ్గిరామునెడ నాయన చూపిన మర్యాదయే విశ్వనాథమువలన యాయన పొందిన మహోపకారముయొక్క విస్తీర్ణ తను చాటగలదు.

20

"విశ్వనాథముగారు! మీమేలు నేనేమని కొనియాడగలను? పనిలోనుండి తప్పింపబడకుండ నాకడ్డుపడి నాతిండిని నాకు నిలిపిరి. వేయి జన్మములకైనను, నేను మీ ఋణమును దీర్చుకొనలేను. నాకు మీరుతప్ప గురువును, దైవమును లేడని నమ్ముచున్నాను."

"మిత్రునకు నాచేతనైన సహాయము జేసితిని. దానికంత పొగిడనేల? సుబ్బారావుగారు! నేనుస్త్రీప్రియుడను గానని మీరెఱింగి యిట్లూరక యీస్వల్పకార్యము నుగ్గడించుట నాకు కోపకారణము కాకపోయినను, మనస్సునకు నచ్చదు. నేనిట్లుంటినని మీరన్యథా తలంప వలదు" సుబ్బారావీ పల్కులనాలించి పకపక నవ్వుచుండెను.

"అయ్యా! నాపని నెరవేరినది నేనును మాదాసును, నేటి మధ్యాహ్నమే భోజనానంతరము బయలుదేరి మా యూరేగెదము. మీరుకోర్టుకేగి యగ్గిరాముని మేజస్ట్రీటుగారియొద్ద హాజరు పెట్టవలయునేమో? ఇప్పుడే మాకనుజ్ఞ నొసగవలయును. తరువాత మీకు దొరికియుండడు."

సుబ్బారావుగారు వారినాప నెంతయోప్రయత్నించెను. కాని వారిర్వురు దొందరపనియున్నదని తమమాటనే నెగ్గించుకొని, భోజనానంతరము బయలుదేరి, విశాఖపట్టణ మేగుటకుమారుగా పిఠాపురమేగి సాయంకాలమువఱ కచ్చటనేయుండి, చీకటిపడినవెంటనే, తమసామానుతో రైలుస్టేషనుజేరిరి. నారాయణదాసచ్చట నాసామానునకు గావలియుండె విశ్వనాథము బయలుదేరి, యెచ్చటికోపోయెను.

ఇక గాకినాడలో నామధ్యాహ్న మగ్గిరాముడు కోర్టునకు దీసికొనిరాబడి మేజస్ట్రీటుగారి యెదుటకు దీసికొనిపోయెను. కోర్టు జనము

తో క్రిక్కిరిసియుండెను. విశ్వనాథమును నారాయణదాసును, గలసి తీసికొనిరాగలిగిన అగ్గిరామునకప్పుడొక పండ్రెండుగురు పహారాజవానులు గావలిగాచుచుండిరి. మేజస్ట్రేటుగా రడిగిన యేప్రశ్నకు నగ్గిరాముడు సమాధానము జెప్పకుండుటచే ప్రాణమువిసిగి వారాతని దిరిగి ఖైదులో నుంపబడుట కంపివైచిరి మరునాడుదయమున నాతడు రాజమండ్రికి గొంపోబడుటకాజ్ఞ యొసగబడెను. తనగదియందుగూర్చుండి యగ్గిరాముడు దీర్ఘాలోచనపరుడై పదేపదే "ఏనిమిషమున కెట్లు వచ్చునో యెవ్వరు చెప్పగలరు? నాకిది తుదకుమేలుగనే పరిణమించు నట్లున్నది" అని యనుకొనుచుండెను. భగవంతుని యాదేశము నెవ్వరు నిర్ణయింపగలరు.

రాత్రి పండ్రెండుగంటలాయెను లోకమంతయు నిశ్శబ్దముగ నుండెను. ఎచ్చటనో మాత్రము కొంచెము పర పర మను శబ్దమగుచుండెను. ఇంకొక యరగంటలో నాశబ్ద మాగిపోయెను. అగ్గిరాముడొక్కపెట్టున పైకెగిరి యాగదిలోని కిటికీనెక్కి గోడపైనున్న యింటి కప్పు నెత్తివైచి పైకురికెను జైలులో కలవరము గలిగెను. అగ్గిరాముడు కిటికీ నూడదన్ని పారిపోయెనని కనిష్టేబులటునిటు పరుగెత్త నారంభించిరి వారుదయమువఱకును వెదకిరి కాని వానిజాడ యెందును గనుగొనలేకపోయిరి పదిగజముల దూర మెడమున్న తుపాకిబారినుండి తప్పించుకొని పారిపోవగలనను అగ్గిరాముని ప్రతిజ్ఞ నెరవేరెను. అగ్గిరాముడంతటితో మాయమైపోయెను. తిరిగి యాతడు నేటివఱకును గనబడకుండ లోకముయొక్క కన్నులను మూసివైచెను. ఈతడె నిజమైన అగ్గిరాముడు ఆనామమును ధరించిన ప్రతిదొంగయు నాచోర చక్రవర్తితో సమానుడు. నిజమైన యగ్గిరాముడాఖైదునుండి వెలువడిన యుత్తరక్షణముననే, తనచోరావతారమును చాలించెను.

"దాసూ! కొండడు చనిపోయినాడని యిన్ని దినములనుండియు విచారించుచుంటిమి కాని, నేటికి మనకొక క్రొత్తకొండడు లభించినా డోయి! సందిట నదిమిపట్టితినని నీపై నాతనికి కోపములేదు, లెమ్ము ఏమనెదవు కొండా?" క్రొత్తకొండడు తనయదృష్టవశమున విశ్వనాథము నేవలభించినదని సంతసించుచు, నాతనిపాదములపై వ్రాలెను. విశ్వనాథ మాతని లేవనెత్తి.

"ఇక నీపూర్వపుజీవనము నెల్లమఱచి, నూతనుద్యోగమున నభ్యుదయము నొందెదవుగాత" అని యాతని ప్రేమపూర్వకముగా దీవించెను.

స మా ప్త ము

(దొంగరాముని గురించి వేరొకగ్రంథమున దెలియజేయబడును)

శ్రీ కొండపల్లి ప్రెస్, రాజమండ్రి.